thechurakalu@gmail.com
www.churakalu.com
editor@churakalu.com

# చురకలు

సాయంకాల దినపత్రిక

Published from Karimnagar, Hyderabad, Adilabad, Warangal

RNI. NO. TEL TEL/2006/16536
Postal Regd. No. H/KAR/90/06-08

సంపుటి - 19 సంచిక - 350 కరీంనగర్ మంగళవారం, 25 ఫిబ్రవరి, 2025 ఎడిటర్ - మొహ్మద్ ఇమ్రాన్ పేజీలు - 12 + 8 జిల్లా అనుబంధం వెల - 1.00

## ఏప్రిల్ 1 నుంచి కొత్త యూనిఫైడ్ పెన్షన్ విధానం

న్యూఢిల్లీ: జాతీయ నేషనల్ ఫెన్షన్ స్కీమ్‌లో ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగాలకు శుభవార్త. ఎన్‌పీఎస్‌లో ఉన్న వారు కొత్త పెన్షన్ స్కీమ్ 'యూపీఎస్' ప్రయోజనాలను త్వరలోనే అందుకోనున్నారు. యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్ 2025 ఏప్రిల్ 1 నుంచి అమలు కానుంది. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులుగా కనీసం పదేళ్లు సేవలందించిన వారికి యూపీఎస్ కింద రూ.10,000 పెన్షన్ లభిస్తుంది. నేషనల్ పెన్షన్ సిస్టంలో రిజిస్టర్ అయిన కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు యూపీఎస్ వర్తిస్తుందని ఒక ప్రకటనలో ఆర్థిక శాఖ తెలిపింది. యూపీఎస్ ఆపరేషనల్ వ్యవహారాలకు సంబంధించి పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డవలప్‌మెంట్ అథారిటీ త్వరలోనే నిబంధనలను విడుదల చేస్తుందని కూడా మంత్రిత్వ శాఖ వెల్లడించింది.

## అందుకోసమే కదా బీఆర్ఎస్, బీజేపీతో....

# చీకటి ఒప్పందం!

## నిప్పులు చెరిగిన సీఎం రేవంత్ రెడ్డి

మంచిర్యాల : ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీఆర్ఎస్ చీకటి ఒప్పందం చేసుకుని బీజేపీకి మద్దతు ఇస్తోందని సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారంలో భాగంగా సీఎం రేవంత్ రెడ్డి మంచిర్యాలలో నిర్వహించిన బహిరంగ సభలో ప్రసంగించారు. 'తెలంగాణలో గెలిచిన 8 మంది బీజేపీ ఎంపీలు రాష్ట్రానికి ఏం తెచ్చారు. తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్ట్ కట్టేందుకు అనుమతులు తెచ్చారా..? గ్రాడ్యుయేట్ లు ఓటు వేసే ముందు ఒకసారి ఆలోచించాలి. ఎన్నికల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ కు అభ్యర్థులే లేరు. కానీ ఎన్నికల్లో మమ్మల్ని ఓడించాలని బీఆర్ఎస్ నేతలు చెబుతున్నారు. కాంగ్రెస్ ను ఓడించాలని అంటున్న బీఆర్ఎస్ మరి ఎవర్నీ గెలిపించడానికి ప్రయత్నిస్తున్నారో చెప్పాలి. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో కేసీఆర్, కేటీఆర్, హరీష్ రావు, కవిత ఎవరికీ ఓటు వేస్తారో ఆలోచించిండి. నా మాటలు నిజమని నమ్మితేనే మాకు ఓటు వేయండి' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.




'బీఆర్ఎస్ హయాంలో నిరుద్యోగులకు ఉద్యోగాలు దక్కలేదు. తెలంగాణలో ప్రధాని నరేంద్ర మోదీ ఇద్దరికే ఉద్యోగాలు కల్పించారు. బండి సంజయ్, కిషన్ రెడ్డిలకు కేంద్ర మంత్రి పదవులు ఇచ్చి వారికి మాత్రమే ఉద్యోగాలు ఇచ్చారు. గ్రాడ్యుయేట్స్ ఓటు వేసే ముందు ఆలోచించాలి. మేం అధికారంలోకి రాగానే 55వేలకు పైగా ఉద్యోగాలు ఇచ్చాం. నా మాటలు నిజమని నమ్మితేనే మాకు ఓటు వేయండి' అని సీఎం రేవంత్ రెడ్డి చెప్పుకొచ్చారు. 'వరి వేస్తే ఉరి వేసినట్టే అని గత ప్రభుత్వం హయాంలో బీఆర్ఎస్ నేతలు అన్నారు. మేం వరి వేసిన వాళ్లకు కూడా బోనస్ ఇస్తున్నాం. రైతు భరోసాను కూడా మార్చి 31 వరకు పూర్తి చేస్తాం. రూ.21వేల కోట్లతో రైతులకు రుణమాఫీ చేశాం. రుణమాఫీ జరిగిన కుటుంబాలు కాంగ్రెస్ పార్టీకి అండగా నిలవాలి. కేసీఆర్ చేసిన అప్పులు రాష్ట్రానికి ముప్పుగా మారాయి. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించాం. రూ.500లకే గ్యాస్ సిలిండర్ ఇస్తున్నాం. 200 యూనిట్ల ఫ్రీ కరెంట్ ఇస్తున్నాం. ఇవన్నీ నిజమైతేనే మాకు ఓటు వేయండి' అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 'కోటి మంది ఆడబిడ్డలను కోటీశ్వరులను చేసే బాధ్యతను మేం తీసుకున్నాం.

నిరుద్యోగులకు ఉద్యోగాలు ఇస్తున్నాం. ఏడాది తిరిగే లోపు రూ.2.25లక్షల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చాం. గత పదేళ్లలో కేసీఆర్ ఏనాడైనా స్వయం సహాయక బృందాల గురించి పట్టించుకున్నారా..? ఫోన్ ట్యాపింగ్ కేసులో కేటీఆర్, హరీష్ రావును ఎందుకు అరెస్ట్ చేయడం లేదని బండి సంజయ్ అంటున్నారు. విదేశాల్లో ఉన్న ప్రభాకర్ రావు, శ్రవణ రావులను దేశానికి రాకుండా కాపాడేది బండి సంజయ్ కాదా..? వాళ్లను రప్పిస్తే 48 గంట్లలో కేటీఆర్ ను జైలులో పెడతామనే కదా ప్రభాకర్ రావు, శ్రవన్ రావు రాకుండా కాపాడుతున్నారు' అని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు.

## చంద్రబాబును చూసి నేర్చుకోండి..

### పీపీపీ మోడ్‌లో ప్రభుత్వం: కవిత కీలక వ్యాఖ్యలు



మహబూబాబాద్ : పక్క రాష్ట్ర ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడిని చూసి తెలంగాణ సీఎం నేర్చుకోవా లని ఎమ్మెల్సీ కవిత హితువు పలికారు. సోమవారం మహబూబాబాద్ జిల్లాలో ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మీడి యాతో మాట్లాడుతూ.. ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు లాగా ఢిల్లీ వెళ్లి లొల్లి చేసి.. మద్దతు ధర కోసం కొట్లాడాలని సూచించారు. సీఎం రేవంత్ రెడ్డి కూడా ఢిల్లీ పోయి మిర్చి రైతులకు మద్దతు ధర రూ.25 వేలు వచ్చేలా చేయాలని డిమాండ్ చేశారు. మిర్చి రైతులకు పెట్టుబడే రూ.2 నుంచి 3 లక్షలకు పైగా ఉంటుందని తెలిపారు. మిర్చి రైతులు, పసుపు రైతుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇక పీపీపీ మోడ్‌లో తెలంగాణ ప్రభుత్వం నడస్తోందని విమర్శించారు. పీపీపీ అంటే ఫోబియా, పాలిటిక్స్, పర్సంటేజ్ ద్వారా ప్రభుత్వం నడుస్తోంది అంటూ ఎమ్మెల్సీ కవిత సెటైర్లు వేశారు. సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ ఫోబీయా పట్టుకుందని, మైక్ పట్టుకుంటే కేసీఆర్‌ను తిట్టాలని ఫోబీయా పట్టుకుందని కవిత విమర్శించారు. సీఎం తెల్లారి లేస్తే సమస్యలు పక్కన పెట్టి పాలిటిక్స్ చేస్తారని అన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వాన్ని పది పర్సంటేజ్ సర్కార్ అని పిలుస్తున్నారని, పర్సంటేజ్ ఇస్తేనే పనులు అవుతున్నా యని ఆరోపించారు.

సర్పంచ్‌లు కొంత మంది పర్సంటేజీలు ఇచ్చి బిల్లులు తెచ్చుకుంటున్నారని, కానీ ప్రజాపాలన చేయలని మాత్రం ప్రభుత్వానికి లేదన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ పార్టీ అభ్యర్థిని నిలబెట్టలేదని, ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీకి ఓట్లు వేయకుండా ఇండిపెండెంట్లలో మంచి బీసీ బిడ్డలకు ఓటు వేయండని పిలుపునిచ్చారు.




శ్రీశైలం ఎడమ టన్నెల్ మొత్తం బురదమయంగా ఉండటం, టీబీఎం యంత్రం పై భాగం కుంగిపోవడం, దాంతో పాటు ఇతర పరికరాలు అడ్డంగా పడి ఉండటంతో ముందుకెళ్లలేని పరిస్థితి నెలకొంది. శ్రీశైలం జలాశయం వైపు నుంచి 14వ కిలోమీటరు వద్ద సొరంగంలో చోటుచేసుకున్న ప్రమాదం నుంచి బాధితులను కాపాడటం అత్యంత క్లిష్టంగా మారింది. సొరంగం చివరి భాగంలో పనిచేస్తుండగా పైకప్పు కూలిన సమయంలో 8 మంది ఆచూకీ కనిపించకుండా పోయింది. వీరిలో ఎవరైనా, ఏదైనా ఆసరాగా చేసుకుని సాయం కోసం ఎదురుచూస్తూ ఉండవచ్చున్న ఆశలతో సహాయక చర్యలు చేపట్టారు. ఈ కోణంలో డ్రోన్‌తోపాటు, స్కానర్లు, నైట్ విజన్ కెమెరాలతో కూడా దళాలు ప్రయత్నించాయి. టన్నెల్ బోరింగ్ యంత్రం వద్దకు దాదాపు చేరుకున్న కొందరు రక్షణ సభ్యులు బురదలోకి దిగే ప్రయత్నాలు కూడా చేశారు. కానీ కటిక చీకటితోపాటు బురదలో కూరుకుపోయే పరిస్థితి ఉ ండటంతో వెనక్కు వచ్చేశారు. దూరం నుంచి బిగ్గరగా కేకలు వేస్తూ.. బాధితుల నుంచి స్పందన వస్తుందేమోనని చాలా సేపు ప్రయత్నాలు చేశారు. అటువైపు నుంచి స్పందన లేకపోవడంతో వారి పరిస్థితి ఎలా ఉందన్నది తెలియరాలేదు. సంఘటన చోటుచేసుకున్న ప్రాంతం నుంచి మూడు కిలోమీటర్ల వెనక్కు బురద, నీళ్లు ఎగదన్నాయని ప్రత్యక్ష సాక్షులు ఇప్పటికే చెప్పారు. ఆ నీటిని భారీ మోటార్లు పెట్టి ఎత్తిపోస్తూ శ్రీశైలం జలాశయంలోకి తరలిస్తున్నారు. ఐదు అత్యధిక హార్స్ పవర్ ఉన్న పంపులను వినియోగిస్తున్నారు. 13.5 కిలోమీటరు వద్ద ఒక పంపును మధ్యాహ్నం అందుబాటులోకి తీసుకొచ్చారు. లోపల విద్యుత్ సరఫరా లేని చోట కూలిపోయిన ఇనుప రెయిలింగ్, రాడ్లను తొలగించేందుకు కట్టర్లు కావాల్సి వచ్చింది. సాయంత్రం తరువాత లోపల ఉన్న ఇనుప కడ్డీలను కట్ చేయడం ప్రారంభించారు. వీటన్నింటినీ తొలగిస్తేనే ప్రమాదస్థలం వరకు రక్షణ బృందాలు వెళ్లడానికి వీలవుతుందని ఇంజినీరింగ్ వర్గాలు తెలిపాయి. ఇక మంత్రి ఉత్తమ్ సంప్రదింపులతో కేంద్ర ప్రభుత్వం విశాఖపట్నం నుంచి మూడు హెలికాప్టర్ల ద్వారా నౌకాదళం సభ్యులను ఎస్ఎల్‌బీసీ ప్రాంతానికి పంపించింది. తొలుత సంఘటన ప్రాంతాన్ని హెలికాప్టర్ల నుంచే ఆ దళం పరిశీలించింది. సోమవారం వారు కూడా రంగంలోకి దిగుతారని సమాచారం. భూగర్భ గనుల్లో రక్షణ చర్యలపై అవగాహన ఉన్న సింగరేణి విపత్తు నిర్వహణ బృందం కూడా పలు పరికరాలతో చేరుకుంది. మొత్తంగా సహాయ కార్యక్రమాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ నుంచి 130 మంది, ఎస్‌డీఆర్ఎఫ్ నుంచి 120 మంది, ఆర్మీ నుంచి 24 మంది, సింగరేణి రెస్క్యూ టీం నుంచి 24 మంది, హైడ్రా నుంచి 24 మంది నిమగ్నమయ్యారు. సైన్యం, ఎన్‌డీఆర్ఎఫ్ తదితర సిబ్బంది టార్చిలైట్ల వెలుతురులో బృందాలుగా లోనికి వెళ్తూ రక్షణ చర్యలు ప్రారంభించారు. డ్రోన్లు, స్కానర్లను ఉపయోగించి సొరంగం లోపల పరిస్థితిని అంచనా వేసుకుంటూ ముందుకు వెళ్లాయి. సహాయ చర్యలను దగ్గరుండి పర్యవేక్షిస్తున్న మంత్రులు, ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి ఆదివారం పలుమార్లు మాట్లాడారు. కార్మికులను రక్షించేందుకు అన్ని విధాలా ప్రయత్నాలు కొనసాగించాలని అధికారులను అప్రమత్తం చేశారు. రెండోరోజు నిర్విరామంగా కొనసాగిన సహాయ చర్యలను మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, జూపల్లి కృష్ణారావు అక్కడే ఉండి పర్యవేక్షించారు.







# ఇంతటి మహోజ్వల చరిత్ర ఘట్టంతో నడిచింది మనమేనా..!?



సాధారణంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనాలన్ని ఎంతో సంతోషంగానే నడుస్తున్నాయి తాము ఏం చేశాం ఏం సాధించాం పిల్లలేం చేస్తున్నారు ఎంత ఆస్తులు కూడగట్టుకున్నాం ఇవే ముచ్చట్లు.. ఇవి కూడా మంచి జ్ఞాపకాలే కానీ హైదరాబాదులో రెండు రోజులపాటు జరిగిన పూర్వ విప్లవ విద్యార్థుల సమ్మేళనంలో ఒక గొప్ప చరిత్రను తలుచుకుంటూ.. కొనసాగించడం అలనాటి విప్లవ విద్యార్థులు వృద్ధాప్య మును సైతం లెక్కచేయకుండా సదస్సుకు హాజరు కావడం విప్లవోద్య మానికి మరణం ఉండదని.. కట్టె కాలే వరకు తాము విప్లవానికి అభిమానులమే అంటూ ఈ సదస్సు నిరూపించిందని చెప్పవచ్చు. సభలో పాల్గొన్న వారి మాటలు నేను విన్న వాటిలో కొన్ని రాయదలి చాను. మనమేనా ఇంతటి మహోజ్వాల ఘట్టంలో నడిచామా.. మనమేనా మహత్ ప్రయాణంలో రాడికల్ విద్యార్థి సంఘం చరిత్రలో కలిసి కొనసాగామా.. రాడికల్ విద్యార్థి సంఘం కాలం కన్నా బిడ్డ ఒక చరిత్ర కన్నబిడ్డ.. రక్త మాంసాలు ధారబోసిన చరిత్ర.. వీరుల ప్రాణాలు అర్పించిన చరిత్ర.. అంతటి మహా సముద్రంలో నీటి తుంపెరగ ఉ ండడం ఒక ఆనందమే.. ఇలాంటి సంతోష సమయాన్ని 50 ఏళ్ల వేడుకగా నిర్వహించుకోవడం క్లాస్ రూమ్ లో మొదలైన ఆర్ఎస్ యు ప్రపంచంలోనే ఒక గొప్ప విద్యార్థి సంఘం గా చరిత్ర సృష్టించిన ఆ సంఘంలో నేను ఒక సభ్యుడిని అనిఊహించుకుంటేనే 50 ఏళ్లు వెనక్కి వెళ్లినట్టు అనిపిస్తుంది.. అరిస్ యు ప్రశ్నించడం నేర్పింది ఆర్ ఎస్ యు మానవత్వం నేర్పింది.. సహయోధులను కోల్పోయిన దుఃఖంతో భారమైన హృదయాలు ఆవిష్కరించిన 50 ఏళ్ల విప్లవ విద్యార్థి సదస్సు హైదరాబాదులోని సుందరయ్య భవన్లో గురు శుక్రవారాల్లో నడిచింది.. కర్ర చేత పట్టుకుని నడిచిన వాళ్ళు కొందరు ఒకరి సహాయంతో ముందుకు సాగిన వారు కొందరు మెట్లు ఎక్కడానికి ఇబ్బంది పడ్డవారు ఏకంగా తల నేరిచినవారు.. కళ్ళద్దాలు ఉంటేనే చూడగలిగిన వారు ఇలా 60 70 ఏళ్లు వయసు దాటిన వారంతా తమ అనుభవాలను వలపోతగా చెప్పుకున్న వేదిక గంటల తరబడి కూర్చున్న చోటే కదలకుండా కట్టిపడేసిన ప్రసంగాలు ఎక్కడికో తీసుకెళ్లాయి. మనం ఎక్కడికి వెళుతున్నాము తెలియాలంటే మనం ఎక్కడి నుండి వచ్చాము తెలుసుకోవాలి అవి గుర్తుండి పోవాలి అంటూ సాగిన ప్రసంగం మళ్లీ ఆర్ ఎస్ వి పుట్టుకలోకి తీసుకెళ్లాయి. రక్తంతో సిద్ధాంతం రంగరించబడిందా సిద్ధాంతమే రక్తం గా మారిందా నరాల నిండా రాడికల్ సిద్ధాంతమే ఇంకా రగులుతున్నదా? ఎప్పటి 1974 ఎక్కడి 2025 సంవత్సరం.. 50 ఏళ్ల కిందటనే ఎరుపెక్కిన గుండెలు ఇంకా ఎర్రగానే మరింత తేజవంతంగా ఆర్యస్యు జిందాబాద్ అన్నాయి.7 పదులు దాటి భౌతికంగా నడవలేని స్థితిలో కూడా తోడు కర్రతో వచ్చిన రాడికల్ మిత్రుల కన్నుల్లో ఎన్ని విప్లవ వసంతాలు విరబూసాయో నేను కళ్ళారా చూశాను..

**ఇంకా ఆశ కాదు విశ్వాసం..** కాదు కాదు ప్రగాఢమైన నమ్మకం కమ్యూనిజం వచ్చి తీరుతుందని విప్లవం వర్ధిల్లుతుందని ఎవడురా కాలం చెల్లిందని అయిపోయింది అని అంటున్నవాడు లేదు మళ్ళీ లేస్తుంది మళ్ళీ మళ్ళీ ఎగిసిపడుతుంది అన్న విశ్వాసాన్ని ప్రకటిస్తున్న అప్పటి రాడికల్ విద్యార్థి విప్లవకారులు ఇప్పటికీ ఆయుధాలు ఇవ్వండి సాయిదులం అవుతాం అంటుంటే వెంట్రుకలు కాదు నరాలే నిక్కపొడిచాయి. గుండె నిండా బలం ఏర్పడింది దోపిడీ శక్తుల్ని ఎదిరిస్తాం సామ్రాజ్యవాధాన్ని కూల్చేస్తాం ప్రపంచమంతా సమసమాజాన్ని ఏర్పాటు చేస్తాం అనిపించింది విప్లవ పోరాటాల్లో ప్రాణాలు అర్పణ చేసిన వాళ్లు బతికి వచ్చినట్టు వాళ్లంతా ఇంకా బతికే ఉన్నట్టు వీళ్ళందరిలో ఆవాహనమై మరో ప్రపంచం కోసం ఉన్నట్టు ఎంత ఎరుపు ఎంత లోపటి నుంచి అప్పటి అరుపు అమరత్వాలకు రమణీయత కలిగితే ఎలా ఉంటుందో నేను కళ్ళనిండా కళ్ళు ఆర్పకుండా తనువు మనసు తీరా చూసాను.. పువ్వులలో దారంగా అంత సూత్రంగా కలిసి ఉన్నట్లు ఇప్పటికీ మనమందరం ఒకే కుటుంబ సభ్యులుగా ఉ న్నామని ఈ వేదిక నిరూపించిందని పలువురు వక్తలు మాజీ రాడికల్ విద్యార్థి సంఘం నాయకులు అన్నారు. ఇక్కడికి వచ్చిన వారంతా విద్యార్థి సంఘం పెట్టలేరు వయసు కాదు కానీ రాడికల్ వయోజన సంఘం ఒకటి పెడదాం అంటూ సమావేశంలో ప్రకటించారు.ఒక ధారగా మొదలై.. ఒక పాయిగా ఒక నదిగా మారి ఇప్పుడు ఒక మహాసముద్రంగా కనిపిస్తున్న విప్లవ పార్టీలను గతంలో అనేకమంది ముఖ్యమంత్రులు డీజీపీలు తుడిచేస్తాం చంపేస్తాం అంటూ విర్రవి గారు వారివరు ఇప్పుడు లేరు.. ఇప్పుడు అంటున్నవారు రేపు ఉండరు చరిత్ర ఉంటది చరిత్ర లో సత్యం ఉంటది న్యాయం మిగిలి ఉంటుంది చివరికి న్యా యమే గెలుస్తుంది అంటూ పలువురు వక్తలు మన వంతు గా మనం ఎక్కడ ఉన్నా ఏ



వృత్తిలో ఉన్న న్యాయం వైపు నిలబడదాం ఎంత చేయగలిగితే అంత చేద్దాం శేష జీవితంలో గొప్ప స్ఫూర్తిని కొనసాగిద్దాం అంటూ రెండు రోజుల పూర్వ విప్లవ విద్యార్థుల సదస్సు కొనసాగించారు ఈ కార్యక్రమంలో తమ వెంట ఉండి పూర్తి కాలం కార్యకర్తలుగా అజ్ఞాతవాసం వెళ్లి అమరులైన ఒక్కొక్కరి జ్ఞాపకాలు నేమరీ వేస్తూ సహచరులు గుర్తు చేస్తూ గుండెలు బరువెక్కించారు. తిరుపతిలో ఆర్ ఎస్ యు ఎట్లా పుట్టింది..కొండపల్లి తో కలిసి ఏం మాట్లాడాము చెప్పారు. శ్రీ శ్రీ,వరవరరావు చేరబండ రాజు.. త్రిపురనేని మధుసూదన్ రావు పటేల్ సుధాకర్ రెడ్డి పులి అంజయ్య చేరుకూరి రాజకుమార్ జన్ను చిన్నాలు, మహేష్, కిషన్ జి, వెంకటరమణ, రామకృష్ణ, శ్రీకాకుళ పోరాటంలోని పంచాయతీ కృష్ణమూర్తి నిర్మల ఇలా వీరందరిని గుర్తు చేస్తూ సదస్సును త్యాగాల భరితం చేశారు. గుండెలు తాకినా విప్లవ గీతాలతో అమరుల త్యాగాలను హిమాలయాల కంటే ఎంతో గొప్పవిగా వర్ణిస్తూ ఆలపించారు. రెండు రోజుల సదస్సుకు భగత్ సింగ్ మేనల్లుడు జగ్ మోహన్ సింగ్, ప్రొఫెసర్ హరగోపాల్, డాక్టర్ గోపీనాథ్, ప్రొఫెసర్ కోదండరాం, శివారెడ్డి, ప్రదీప్ కాత్యాయిని, తుషార్ కాంత్, కొండపర్తి పద్మ, కవ్వ లక్ష్మారెడ్డి, ఎన్ వేణుగోపాల్ నర్ల రవి, శివచందర్, విజయరాజు, రామ్ కి, విష్ణు ,రామకృష్ణ, ఏకే ప్రభాకర్, విరసం పాని, డాక్టర్ లక్ష్మణ్, నందకుమార్ , రమణ తదితరులు మాట్లాడారు.



కట్ట నరేంద్ర చారి, జర్నలిస్ట్




హైదరాబాద్ : ట్రిలియన్ డాలర్ జీడీపీనే తెలంగాణ ధ్యేయమన్నారు సీఎం రేవంత్ రెడ్డి. మాదాపూర్ లో ఆమ్జెన్ టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్ సైట్ ఆఫీసును ప్రారంభించారు సీఎం రేవంత్. ఈ సందర్భంగా మాట్లాడిన ఆయన. గ్లోబల్ కంపెనీలు హైదరాబాద్ వైపు చూస్తున్నాయన్నారు. గతేడాది ఆగస్ట్ లో అమెరికా వెళ్లినప్పుడు అమ్జెన్ వాళ్లని కలిశామని చెప్పారు.

ఇంత త్వరగా హైదరాబాద్ లో తమ సంస్థను స్థాపించినందుకు సంతోషంగా ఉందన్నారు. స్కిల్ డెవలప్మెంట్ ప్రోగ్రామ్ లోనూ అమ్జెన్ పాలుపంచుకోవాలని కోరారు రేవంత్. హైదరాబాద్ ని వరల్డ్ లోనే గ్రేటెస్ట్ సిటీగా తీర్చిదిద్దుతామన్నారు. ఆమ్జెన్ లాంటి సంస్థలు హైదరాబాద్ కి రావడం తెలంగాణకు గర్వకారణమన్నారు ఐటీ మంత్రి శ్రీధర్ బాబు. గ్లోబల్ కేపబిలిటీ సెంటర్ లకి హైదరాబాద్ క్యాపిటల్ అని అన్నారు. లైఫ్ సైన్సెస్ కి హైదరాబాద్ హబ్ మాత్రమే కాదు.. గ్లోబల్ ఇన్నోవేషన్స్, ఏఐ సొల్యూషన్స్ కి అడ్డా అని చెప్పారు. టాలెంట్ ఉన్న ఉద్యోగులు మనదగ్గర చాలా మంది ఉన్నారు. - భవిష్యత్ లో మరిన్ని సంస్థలు హైదరాబాద్ కి వస్తాయన్నారు.

## ఎస్ఎల్ బీసీ టన్నెల్ ప్రమాదంపై అనేక అనుమానాలు ఉన్నాయి- మాజీమంత్రి హరీశ రావు



ఎన్ ఎల్ బీసీ టన్నెల్ లో ప్రమాదం జరగటం దురదృష్టకరమన్నారు మాజీ మంత్రి హరీశ్ రావు. టన్నెల్ ప్రమాదంపై అనేక అనుమానాలు ఉన్నాయన్నారు. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్లే ప్రమాదం జరిగిందని తెలిపారు. రెస్క్యూ ఆపరేషన్ లో ప్రభుత్వ చిత్తశుద్ధి కనిపించడం లేదని హరీశ్ రావు విమర్శించారు. ప్రమాదం జరిగినా సీఎం రేవంత్ రెడ్డి సంఘటనా స్థలానికి వెళ్లకుండా ఎన్నికల ప్రచారం చేస్తున్నారని హరీశ్ రావు ధ్వజమెత్తారు. "ఈ సంఘటన చాలా దురదృష్టకరం. 8 మంది కార్మికులు ఏమయ్యారో తెలియకపోవడం చాలా ఆందోళనకు గురి చేస్తోంది. దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నాం. ఆ 8 మంది బతికి ప్రాణాలతో బయటకు రావాలని ఆ భగవంతుడిని ప్రార్థిస్తున్నా. బాధ కలిగే అంశం ఏంటంటే.. ఈ ప్రభుత్వానికి 8 మంది ప్రాణాల కంటే ఎన్నికల ప్రచారం ముఖ్యమైపోయింది. సంఘటన జరిగి మూడు రోజులైనా సీఎం రేవంత్ రెడ్డి అక్కడికి వెళ్లలేదు. హెలికాప్టర్ వేసుకుని మూడు జిల్లాల్లో ఎన్నికల ప్రచారానికి వెళ్లారు. నిన్న హెలికాప్టర్ ఉందని ఉత్తమ్ కుమార్ రెడ్డి టన్నెల్ దగ్గరికి వెళ్లారు. ఇవాళ హెలికాప్టర్ లేదని ఇంట్లో కూర్చున్నారు. ఇదేనా పద్ధతి. నీటిపారుదల శాఖ మంత్రి పోదు, ముఖ్యమంత్రి ఏమో ఇప్పటివరకు అక్కడికి పోలేదు. ఎన్నికల ప్రచారానికి తిరుగుతున్నారు. ప్రాధాన్యత ఏంటి అని అడుగుతున్నా. ఇది చాలా బాధ కలిగిస్తోంది. మేము ప్రధాన ప్రతిపక్షంగా మా వాళ్లంతా అక్కడికి వెళ్దామని అనుకున్నాం. కానీ, ఎన్డీఆర్ఎఫ్ బృందాలు, మిలటరీ అక్కడ పని చేస్తున్నాయి. మేము అక్కడికి వెళ్లడం ద్వారా అక్కడ సాంకేతికంగా ఇబ్బంది కావొద్దని, సహాయక చర్యల్లో ఎక్కడా ఆటంకం కలగొద్దు అనే ఉద్దేశంతో ప్రధాన ప్రతిపక్షంగా మ్నేము కోఆపరేట్ చేస్తున్నాం. మరోవైపు ఉత్తమ్ కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావులు అక్కడ కూర్చుని రాజకీయాలు మాట్లాడుతున్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి దారుణంగా మాట్లాడారు. గత పదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వం ఏమీ పని చేయలేదు, అందువల్లే మేము ముట్టుకోగానే ఇది కూలిపోయింది అని అంటున్నారు. ఇంతకన్నా బుద్ధి తక్కువ మాటలు ఇంకేమైనా ఉంటాయా? చదువుకున్న వ్యక్తివి, కెప్టెన్ వి.. ఏది పడితే అది మాట్లాడితే ఎలా? ఆచితూచి మాట్లాడాలి. నిజాలు మాట్లాడాలి" అని మంత్రులపై ధ్వజమెత్తారు హరీశ్ రావు. "అనుకోకుండా కాళేశ్వరంలో జరిగితే అది లక్ష కోట్ల అవినీతి అయ్యిందన్నారు. కాళేశ్వరం మొత్తం కూలిపోయింది, అవినీతిమయమైపోయిందని రాహుల్ గాంధీ నుంచి ఉత్తమ్, రేవంత్ దాకా మాట్లాడారు. మరిప్పుడు జరిగిందేంటి? కాంగ్రెస్ కో నీతి? మాకో నీతి ఉంటుందా? కాళేశ్వరం ప్రాజెక్ట్ అంటే మూడు బ్యారేజీలు, 15 రిజర్వాయర్లు, 19 పంప్ హౌస్ లు, 21 సబ్ స్టేషన్లు, 1531 కిలోమీటర్ల గ్రావిటీ కెనాల్, 203 కిలోమీటర్ల టన్నెల్, 98 కిలోమీటర్ల ప్రెజర్ మెయిన్స్, 530 మీటర్ల ఎత్తు లిఫ్ట్ లు, 141 టీఎంసీల నిల్వ సామర్థ్యం.. ఇంత పెద్ద కాళేశ్వరంలో అన్నీ బాగున్నాయి. మూడు బ్యారేజీలలో ఒక బ్యారేజీలో 7 బ్లాకుల్లో ఒక బ్లాక్ లో ఒక పిల్లర్ కూలింది అంతే. దానికి మొత్తం కాళేశ్వరం కూలిపోయిందని రాజకీయం చేశారు. కాంగ్రెస్ వాళ్లు మా మీద అబద్దాలు చెప్పి ఎన్నికల్లో లబ్ది పొందే ప్రయత్నం చేశారు. కాళేశ్వరం కూలిపోతేనేమో బీఆర్ఎస్ తప్పు, బీఆర్ఎస్ అవినీతి. ఎస్ ఎల్ బీసీ టన్నెల్ కూలిపోతేనేమో ఇందులో మనుషుల తప్పేమీ లేదు ప్రకృతి వైపరిత్యం, కామన్ గా జరుగుతుంటాయి అని ఉత్తమ్ అంటున్నారు" అని నిప్పులు చెరిగారు హరీశ్ రావు.

## బీఆర్ఎస్ నేతలకు మానవత్వం లేదు: మంత్రి కోమటిరెడ్డి




మహబూబ్‌నగర్: శ్రీశైలం ఎడమగట్టు కాలువ సొరంగ మార్గంలో పైకప్పు కూలిన ఘటనలో సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. టన్నెల్ లోపల ఇద్దరు ఇంజనీర్లు, ఇద్దరు ఆపరేటర్లు, నలుగురు కార్మికులు చిక్కుకోవడంతో.. వారిని కాపాడేందుకు ఎన్డీఆర్ఎఫ్ , ఎస్డీఆర్ఎఫ్, సింగరేణి రెస్క్యూ బృందాలు, హైడ్రా, ఇండియన్ ఆర్మీ, స్పెషల్ బెటాలియన్ల ఆధ్వర్యంలో సహాయక చర్యలు ప్రారంభమయ్యాయి. ఈ క్రమంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఎస్ఎల్‌బీసీ ప్రమాద స్థలి దోమలపెంటకు బయలుదేరి వెళ్లారు. సహాయక చర్యలు పర్యవేక్షించనున్నారు. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. బీఆర్ఎస్ నేతలకు మానవత్వం లేదని.. ఎస్ఎల్‌బీసీ ప్రమాదాన్ని రాజకీయం చేయడం మంచి పద్ధతి కాదని అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి, మంత్రులు నిరంతరం అక్కడ సహాయక చర్యలను పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. తూప్రాన్ రైలు ప్రమాదంలో స్కూల్ విద్యార్థులు చనిపోతే కేసీఆర్ కనీసం వెళ్లి పరామర్శించలేదని విమర్శించారు. మీరు చేయని పనులు మేము చేస్తున్నామని.. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు అందరం కలిసికట్టుగా ఉండాలన్నారు. ఆపదలో ఉన్నవారికి మనోధైర్యం ఇవ్వాలని, సురక్షితంగా తీసుకురావడానికి సలహాలు ఇవ్వాలన్నారు. ఇది రాజకీయాలు మాట్లాడే సమయం కాదని.. అందరినీ బయటకు తెచ్చిన తర్వాత మళ్లీ పనులు మొదలు పెడతామని.. ఆ తర్వాత బీఆర్ఎస్ వాళ్ల సంగతి చెబుతామన్నారు.

**ఎస్ఎల్‌బీసీని బీఆర్ఎస్ నిర్లక్ష్యం చేసింది..** గత ప్రభుత్వం (బీఆర్ఎస్) ఎస్ఎల్‌బీసీని నిర్లక్ష్యం చేసిందని, మేము దాన్ని పూర్తి చేయాలని భావిస్తే ఇలాంటి ప్రమాదం జరగడం బాధాకరమని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. అందులో చిక్కుకున్న 8 మంది క్షేమంగా బయటకు రావాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని అన్నారు.

సొరంగం గురించి, ప్రాజెక్టుల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదన్నారు. పదేళ్లు సొరంగాన్ని ఎందుకు పట్టించుకోలేదో చెప్పాలని.. కాళేశ్వరంలో చిన్న చిన్న సొరంగం పనులకు ఎంతో మంది చనిపోయారని, కాళేశ్వరంలో చనిపోతే బీఆర్ఎస్ నేతలు ఏమైనా రెస్క్యూలు చేశారా అని మంత్రి కోమటిరెడ్డి ప్రశ్నించారు.

## వారణాసిలో రోడ్డు ప్రమాదం.. సంగారెడ్డి వాసులు మృతి




సంగారెడ్డి జిల్లా, ఫిబ్రవరి 24: మహాకుంభమేళాకు ఎంతో మంది భక్తులు తరలివెళ్లి త్రివేణి సంగమంలో పుణ్యస్నానాలు చేస్తున్నారు. అందరిలాగే సంగారెడ్డి జిల్లాకు చెందిన కొందరు భక్తులు మహాకుంభమేళాకు వెళ్లారు. అక్కడ పుణ్యస్నానాలు ఆచరించారు. మహాకుంభమేళాలో పుణ్యస్నానాలు ఆచరించడంపై వారంతా ఎంతో భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. తిరిగి సొంత జిల్లాకు వెళ్లేందుకు పయనమయ్యారు. కానీ అంతలోనే అనుకోని ఘటన పెను విషాదాన్ని నింపింది. వీరు ప్రయాణిస్తున్న కారు ప్రమాదానికి గురైంది. ఈ ఘటనలో ముగ్గురు ప్రాణాలు కోల్పోగా.. మరో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు.

## హైదరాబాద్‌లో చికెన్‌కు పడిపోయిన డిమాండ్.. మటన్ చేపల ధరలకు రెక్కలు

హైదరాబాద్‌లో చికెన్ ధరలు అంతకంతకూ పడిపోతుండటంతో మటన్, చేపల ధరలకు రెక్కలొచ్చాయి. ఈ ధరాభారం తట్టుకోలేక జనాలు గగ్గోలు పెడుతున్నారు. బర్డ్ ఫ్లూ కారణంగా గత కొన్ని రోజులుగా ప్రజలు చికెన్ పేరు చెబితే భయపడిపోయే పరిస్థితి వచ్చింది. అంత ఆందోళన అవసరం లేదని నిపుణులు చెబుతున్నా పరిస్థితిలో మార్పుల రాలేదు. దీంతో, కోళ్ల ఫారం యజమానుల పరిస్థితి ఇబ్బందికరంగా మారింది. గత వారం రోజుల్లో మటన్‌కు డిమాండ్ ఏకంగా 40 శాతం పెరిగిందని షాపుల నిర్వాహకులు చెబుతున్నారు. ఫలితంగా వాటి రేట్లు కూడా 17 శాతం మేర పెరిగాయి. వారం క్రితం కేజీ మటన్ ధర రూ.850 కాగా ప్రస్తుతం అది రూ.1000కి చేరుకుంది. చేపల ధరల్లో కూడా ఇదే మార్పులు కనిపిస్తున్నాయని వ్యాపారులు చెబుతున్నారు.

కేజీ రూ.50 నుంచి రూ.100 వరకూ ధరలు పెరిగాయని అంటున్నారు. మరోవైపు, బర్డ్ ఫ్లూ భయాలు పెళ్లి వేడుకలపైనా పడింది. ఇప్పటికే అనేక మంది విందుభోజనాల్లో చికెన్‌కు బదులు మటన్, చేపలను చేరుస్తున్నారు. ధరలు ఎక్కువైనా వెనక్కు తగ్గకుండా మటన్, చేపల వైపు మళ్లుతున్నారు. బర్డ్ ఫ్లూ భయాలు ఎక్కువగా ఉన్న కారణంగా ప్రజలు తమ ఆహారపు అలవాట్లలో మార్పులు చేస్తున్నారని వ్యాపారులు చెబుతున్నారు. ఫలితంగా ఒకప్పుడు చికెన్‌కు ఎక్కువ డిమాండ్ ఉంటే ఇప్పుడు పరిస్థితి తలకిందులైందని అంటున్నారు. అయితే, ఈ పరిస్థితి ఇంకా ఎంత కాలం కొనసాగుతుందనేది దానిపై ఇంకా స్పష్టత లేదు.




## 'మేడిగడ్డ' కుంగిన వ్యవహారం.. కేసీఆర్, హరీశ్‌రావు పిటిషన్‌పై తీర్పు రిజర్వు

హైదరాబాద్: మేడిగడ్డ బ్యారేజీ కుంగిన వ్యవహారంలో భారాస అధినేత కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు దాఖలు చేసిన పిటిషన్‌పై హైకోర్టులో విచారణ జరిగింది. భూపాలపల్లి జిల్లా కోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వీరిద్దరూ హైకోర్టును ఆశ్రయించిన విషయం తెలిసిందే. పిటిషన్‌పై ఇరువైపుల వాదనలను ముగించిన ఉన్నత న్యాయస్థానం.. తీర్పును రిజర్వు చేసింది. మేడిగడ్డ బ్యారేజీ కుంగిన ఘటనలో రాజలింగమూర్తి అనే వ్యక్తి భూపాలపల్లి జిల్లా కోర్టులో క్రిమినల్ రివిజన్ పిటిషన్ దాఖలు చేశారు. దీన్ని విచారణకు స్వీకరిస్తూ జిల్లా కోర్టు కేసీఆర్, హరీశ్‌రావుకు నోటీసులు జారీ చేసింది. జిల్లా కోర్టుకు పరిధి లేకుండా ఉత్తర్వులు జారీ చేసిందంటూ వారిద్దరూ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఇటీవల ఫిర్యాదుదారు రాజలింగమూర్తి హత్యకు గురయ్యారు. ఫిర్యాదుదారు మృతి చెందితే పిటిషన్‌కు విచారణార్హత ఏ విధంగా ఉంటుందని హైకోర్టు ప్రశ్నించింది. ఫిర్యాదుదారు మృతిచెందినా పిటిషన్‌ను విచారించవచ్చని పబ్లిక్ ప్రాసిక్యూటర్ వాదనలు వినిపించారు. ఈ మేరకు సుప్రీంకోర్టు తీర్పులను హైకోర్టు దృష్టికి తీసుకెళ్లారు. జిల్లా కోర్టు పరిధిలేకుండా ఉత్తర్వులు జారీ చేసిందని కేసీఆర్, హరీశ్‌రావు తరఫు న్యాయవాది వాదించారు. ఇరువైపుల వాదనలు విన్న ఉన్నత న్యాయస్థానం.. తీర్పును రిజర్వు చేసింది.




నల్గొండ: పదవీ విరమణ చేసిన ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇవ్వలేని స్థితిలో రాష్ట్ర ప్రభుత్వం ఉందని భాజపా ఎంపీ లక్ష్మణ్ విమర్శించారు. ఓ ఉద్యోగి కోర్టును ఆశ్రయించి తనకు రావాల్సిన ప్రయోజనాలను పొందాల్సిన దుస్థితి వచ్చిందన్నారు. నల్గొండ భాజపా కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "రిటైర్ అయిన రోజే ఉద్యోగులకు బెనిఫిట్స్ ఇస్తామని గతంలో కేసీఆర్ ప్రకటించారు. గత సీఎం రూ.7లక్షల కోట్లు అప్పు చేసి రేవంత్‌రెడ్డి చేతికి చిప్ప ఇచ్చారు. అనుభవం లేని కొత్త సీఎం రాష్ట్రాన్ని మరింత అప్పుల ఊబిలోకి నెట్టారు. సరైన వైద్య సేవలు అందట్లేదని ప్రభుత్వ ఉద్యోగులు వాపోతున్నారు.

రాష్ట్ర ప్రభుత్వం ఐదు డీఏలను పెండింగ్‌లో పెట్టింది. ఐదేళ్లకోసారి పీఆర్సీ అమలు చేయాల్సి ఉంటే దాన్ని పట్టించుకోవట్లేదు. బిల్లులు చెల్లించకపోవడంతో ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని ఆస్పత్రులు పట్టించుకోవడం లేదు" అని లక్ష్మణ్ అన్నారు.

## భక్తులకు గుడ్ న్యూస్ చెప్పిన టీజీఎస్‌ఆర్టీసీ.. ఆరోజు ఏకంగా 3 వేల బస్సులు..

హైదరాబాద్: మహాశివరాత్రి సందర్భంగా తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ భక్తులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు వెళ్లేందుకు 3,000 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఈ ప్రత్యేక బస్సులు ఫిబ్రవరి 24 నుంచి ఫిబ్రవరి 28 వరకూ అందుబాటులో ఉంటాయని భక్తులకు తీపి కబురు చెప్పింది. శ్రీశైలానికి 800, వేములవాడకు 714, ఏడుపాయలకు 444, కీసరగుట్టకు 270, వేలకు 171, కాళేశ్వరానికి 80, కొమురవెల్లికి 51 బస్సులతోపాటు అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప ఆలయాలకు సైతం ప్రత్యేక బస్సులు నడపనున్నట్లు వెల్లడించింది. హైదరాబాద్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి వెళ్లాలనుకునే భక్తులకు ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేబీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ ప్రాంతాల్లో బస్సులు అందుబాటులో ఉంటాయని టీజీఎస్?ఆర్టీసీ మేనేజింగ్ డైరెక్టర్ సజ్జనార్ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేక బస్సుల టికెట్ ధరలను 50 శాతం వరకూ పెంచినట్లు ఆయన వెల్లడించారు. అయితే సాధారణ సర్వీసుల టికెట్ ఛార్జీలలో ఎలాంటి మార్పులు చేయలేదని సజ్జనార్ పేర్కొన్నారు. మరోవైపు ఏడుపాయలకు వెళ్లే ప్రత్యేక బస్సులకు సవరించిన ఛార్జీలు ఫిబ్రవరి 26- 28 మధ్య వర్తిస్తాయని ఆయన తెలిపారు. గత శివరాత్రి కంటే ఈసారి ఆర్టీసీ యాజమాన్యం 809 అదనపు ప్రత్యేక బస్సులను నడుపుతోందని చెప్పుకొచ్చారు. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు చెప్పారు. ఈ ప్రత్యేక సేవలను




ఉపయోగించి దేవాలయాలకు సురక్షితంగా వెళ్లి దర్శనం చేసుకోవాలని సజ్జనార్ ఆకాంక్షించారు. అయితే మహాశివరాత్రి ప్రత్యేక బస్సులలో రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్, సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు రవాణా సౌకర్యం అమలులో ఉంటుందని సజ్జనార్ తెలిపారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలం, వేములవాడకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సౌకర్యం కల్పించినట్లు వెల్లడించారు. %షషష్.స్త్రంతీషఎబం.అఅ% వెబ్‌సైట్‌లో బస్ టికెట్లు బుకింగ్ చేసుకోవచ్చని చెప్పారు. మహాశివరాత్రి ప్రత్యేక బస్సుల గురించి మరిన్ని వివరాల కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-23450033 సంప్రదించాలని సజ్జనార్ సూచించారు.



## కేసీఆర్‌పై కొండా సురేఖ సెటైరికల్ ట్వీట్

హైదరాబాద్, ఫిబ్రవరి 24: మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను ఉద్దేశించి మంత్రి కొండా సురేఖ చేసిన ట్వీట్ ఇప్పుడు వైరల్‌గా మారింది. కేసీఆర్ తెలంగాణ అసెంబ్లీకి రాకపోవడంపై సురేఖ తనదైన శైలిలో సెటైర్ వేశారు. నిన్న జరిగిన భారత్-పాక్ క్రికెట్ మ్యాచ్‌లో కోహ్లీ బద్దలు కొట్టిన రికార్డును ప్రస్తావిస్తూ మాజీ సీఎంపై పలు వ్యాఖ్యలు చేశారు మంత్రి సురేఖ. కేసీఆర్ ప్రజలకు అందుబాటులో లేకపోవడం పెద్ద రికార్డే కదా అంటూ సెటైర్ వేశారు. ఎక్స్ వేదికగా కేసీఆర్‌పై కొండా సురేఖ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి. ఇంతకీ మంత్రి సురేఖ చేసిన కామెంట్స్ ఏంటి.. కేసీఆర్‌పై విసిరిన పంచ్ డైలాగ్స్ ఏంటో చూద్దాం.

**సురేఖ ట్వీట్ ఇదే..** దుబాయ్ వేదికగా పాకిస్థాన్‌తో జరిగిన మ్యాచ్‌లో టీం ఇండియా ఘన విజయం సాధించడం హర్షణీయమన్నారు మంత్రి సురేఖ. 6 వికెట్ల తేడాతో భారత్ బంపర్ విక్టరీ కొట్టిన విషయం అందరం టీవీలో చూసి సంబురపడ్డామన్నారు. 14 వేల రన్నులు కొట్టి విరాట్ కోహ్లీ రికార్డు బద్దలు కొట్టగా... మన రాష్ట్ర ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా దాదాపు ఈ 14 నెలల కాలంలో 14 రోజులు కూడా అసెంబ్లీకి రాలేదన్నారు. ప్రజా సమస్యలపై ప్రజలకి అందుబాటులో ఉండకపోవడం దేశ రాజకీయ చరిత్రలో పెద్ద రికార్డే కదా అంటూ ఎద్దేవా చేశారు. 14 వేల రన్నులు చేసిన విరాట్ కోహ్లీ ఒక వైపు వార్తల్లో పతాక శీర్షికలలో నిలిస్తే... 14 నెలలుగా ఇంకా విరాట పర్వం వీడని ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా వార్తల్లోకి ఎక్కడం ఆలోచించాల్సిన విషయం కాదా? అంటూ మంత్రి సురేఖ ట్వీట్ చేశారు.

# తెలుగు సాహిత్య చరిత్రలో వెలుగుదీపం ముకురాల రామారెడ్డి

## ఫిబ్రవరి 24...ముకురాల రామారెడ్డి వర్ధంతి



ముకురాల రామారెడ్డి తెలుగు సాహిత్యంలో ప్రత్యేకమైన స్థానం పొందిన వ్యక్తి. ఆయన కవి, రచయిత, స్వాతంత్ర్య సమరయోధుడు, సామాజిక శ్రేయోభిలాషి, సంఘ సంస్కర్తగా భారతీయ చరిత్రలో గౌరవప్రదమైన స్థాయిని పొందారు. తెలుగు సాహిత్యానికి అంకితభావంతో ఆయన చేసిన కృషి, ఆర్థిక వెనుకబడిన వారి కోసం ప్రదర్శించిన శ్రద్ధ, ప్రజాస్వామిక విలువల పట్ల ఆయన చూపిన చైతన్యం ఆయన జీవితాన్ని చిరస్మరణీయంగా నిలిపాయి.

**ప్రారంభ జీవితం..** ముకురాల రామారెడ్డి మహబూబ్‌నగర్ జిల్లాలో 1929 జనవరి 1న ఒక సాధారణ రైతు కుటుంబంలో జన్మించారు. గ్రామీణ వాతావరణంలో పెరిగినప్పటికీ, ఆయనలో ఉన్న అక్షరాస్యతా కోరిక, విజ్ఞాన దాహం, ప్రజల సమస్యలను అర్థం చేసుకునే సామర్థ్యం చిన్న వయస్సు నుంచే స్పష్టంగా కనిపించాయి. పాఠశాల విద్యను పూర్తి చేసిన తర్వాత, ఆయన సాహిత్యం వైపు దృష్టి సారించారు.

**స్వాతంత్ర్య సమరంలో పాత్ర...** రామారెడ్డి స్వాతంత్ర్య సమరంలో చురుగ్గా పాల్గొన్నారు. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించడంలో, గ్రామీణ ప్రజలను చైతన్యవంతులను చేయడంలో కీలక పాత్ర పోషించారు. జాతీయోద్యమ సమయంలో రాసిన ఆయన గీతాలు, పాటలు ప్రజల్లో దేశభక్తిని పెంపొందించాయి.

**సాహిత్య ప్రస్థానం...** స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత రామారెడ్డి తన జీవితాన్ని పూర్తిగా సాహిత్యానికి అంకితం చేశారు. ఆయన రాసిన కవిత్వం, గేయాలు, వ్యాసాలు తెలుగు సాహిత్యానికి ఒక గొప్ప ఆభరణంగా నిలిచాయి.

**ప్రధాన రచనలు...** జన నీతి కవిత్వం: సామాజిక సమస్యలపై వేదికగా రాసిన ఈ సంకలనం సామాజిక స్పృహను పెంచేందుకు మార్గదర్శకంగా నిలిచింది. స్వరాజ్య దీపం: భారత స్వాతంత్ర్య ఉద్యమంలో భారతీయుల త్యాగాలను, దేశభక్తిని ఆవిష్కరించిన గొప్ప రచన. గ్రామ గీతాలు: గ్రామీణ జీవన సౌందర్యాన్ని, అక్కడి కష్టాలను, ఆత్మబలాన్ని ప్రతిబింబించిన రచన.

**సామాజిక సేవలు...** రామారెడ్డి రచయితగా మాత్రమే కాకుండా, ఒక సామాజిక శ్రేయోభిలాషిగా కూడా సేవలందించారు. నిరక్షరాస్యతను దూరం చేసేందుకు గ్రామీణ ప్రజలకు విద్యను అందించడం ఆయన ప్రాధాన్యకరమైన లక్ష్యంగా ఉంచుకున్నారు. గ్రామీణ ప్రాంతాల ఆర్థిక స్థితిని మెరుగుపరచడానికి స్వావలంబన పాఠాలు నేర్పించారు.

**సంఘ సంస్కరణలు:** వితంతు వివాహాలు, కుల వివక్ష నిర్మూలన, బాల్య వివాహాల నిరోధం వంటి సామాజిక అంశాల్లో చైతన్యం కలిగించారు.

**గౌరవాలు, గుర్తింపులు...** 1976లో ఢిల్లీలోని ఆకాశవాణి వారిచే రామారెడ్డిని "జాతీయ కవి"గా సన్మానించడం ఆయన ప్రతిభకు నిదర్శనం. తెలుగు భాషాభివృద్ధికి, ప్రజల సాంస్కృతిక చైతన్యానికి ఆయన చేసిన కృషికి అనేక సంస్థల నుంచి ప్రశంసలు అందాయి.

**ఆధ్యాత్మికత, కవిత్వం...** రామారెడ్డి కవిత్వంలో ప్రధానంగా ఆధ్యాత్మికత కనిపిస్తుంది. తన పద్యాల ద్వారా సామాన్య ప్రజలకు సులభంగా అర్థమయ్యేలా భావోద్వేగాలను, జీవన సత్యాలను చర్చించారు.

**మరణానంతర గౌరవం...** 2003 ఫిబ్రవరి 24న ముకురాల రామారెడ్డి మరణించగా, తర్వాత కూడా, ఆయన సాహిత్య కృషి తెలుగు ప్రజల గుండెల్లో నిలిచి ఉంది. పాఠశాలలలో ఆయన రచనలు చదివించే ప్రయత్నాలు జరిగాయి. ఆయన పేరుతో సాంస్కృతిక, సాహిత్య సభలను నిర్వహించడం ద్వారా ఆయన జ్ఞాపకాలను సజీవంగా ఉంచుతున్నారు. ముకురాల రామారెడ్డి జీవితమూ, సాహిత్యమూ మనకు ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తాయి: వ్యక్తి కృషి, అంకితభావం, ప్రజల పట్ల చూపే ప్రేమ, దేశ సేవ పట్ల ఉన్న నిబద్ధత ద్వారా మన జీవితం గౌరవప్రదంగా మారుతుంది. ఆయన చూపిన మార్గం, రచించిన సాహిత్యం, చేసిన సేవలు తరువాతి తరాలకు ప్రేరణగా నిలుస్తాయి. "స్వాతంత్ర్యం కోసం పోరాడిన కవి, సమాజంలో మార్పు తీసుకొచ్చిన సంస్కర్తగా ముకురాల రామారెడ్డి పేరును తెలుగు ప్రజలు ఎల్లప్పటికీ గౌరవిస్తారు."

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# ఆంధ్ర విశ్వవిద్యాలయ తొలి ఉపకులపతి కట్టమంచి

## ఫిబ్రవరి 24...కట్టమంచి రామలింగారెడ్డి వర్ధంతి



తెలుగు సాహిత్యం, విద్యా రంగాల్లో చిరస్మరణీయ మహనీయులలో ఒకరైన కట్టమంచి రామలింగారెడ్డి (1880%-%1953) ప్రముఖ కవి, రచయిత, సంఘసంస్కర్త, విద్యావేత్త. 20వ శతాబ్దపు తెలుగు సాహిత్యానికి కొత్త గుణాత్మకతను అందించిన ఆయన, విద్యా రంగంలో చేసిన సేవల ద్వారా సమాజ మార్పుకు కృషి చేశారు. జననం...డిసెంబర్ 10, 1880న ఆంధ్రప్రదేశ్ లోని చిత్తూరు జిల్లాలోని కట్టమంచి గ్రామంలో జన్మించారు. ఈ గ్రామమే ఆయన పేరుతో పరిచితమైంది. విద్యాభ్యాసం...మద్రాసు క్రిస్టియన్ కళాశాలలో చదువు కున్నారు. ఆంగ్ల సాహిత్యం, తత్వశాస్త్రంలో ఆసక్తి చూపి, పండితుడిగా ఎదిగారు. విద్యాబోధన, రచనలతో నిమగ్నమైన రామలింగారెడ్డి కుటుంబ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహించారు విద్యా రంగానికి చేసిన సేవలు విద్యా సంస్కరణలు...రామలింగారెడ్డి విద్యను సమాజ మార్పు సాధనంగా భావించారు. ఆయన మహిళా విద్యకు ప్రాధాన్యత ఇచ్చి, విద్యను అందరికీ అందుబాటు లోకి తీసుకు రావడానికి కృషి చేశారు. విద్యా ప్రమాణాలను మెరుగు పరచడంలో ముఖ్య భూమిక పోషించారు.

**ఆంధ్రా విశ్వవిద్యాలయం:** ఆంధ్ర విశ్వవిద్యాలయానికి తొలి ఉపకులపతిగా నియమించబడ్డారు. ఆర్థిక సమస్యలు, బడ్జెట్ సమస్యలు ఉన్నప్పటికీ, విశ్వవిద్యాలయ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేశారు."విద్యార్థి నైతికతే సమాజ భవిష్యత్తు" అనే దృక్పథంతో విద్యార్థులకు గుణాత్మక విద్యను అందించడంలో ఆయన విశేషంగా కృషి చేశారు.

**సాహిత్య కృషి..** కట్టమంచి రామలింగారెడ్డి తెలుగులో పలు విభిన్న ప్రక్రియలకు పునాది వేశారు. ఆయన రచనల్లో సామాజిక చైతన్యం, నైతిక విలువల ప్రతిఫలనం స్పష్టంగా కనిపిస్తుంది.

**ప్రసిద్ధ రచనలు:** ముసలమ్మ మరణం...గ్రామీణ జీవితంలోని నైతిక సమస్యలు, సామాజిక పరిస్థితులను వాస్తవంగా చర్చించిన కావ్యం. మంచి...నైతిక విలువలను, వ్యక్తిగత సమాజ బంధాలను విశదీకరించిన గీతకావ్యం. చిత్రలేఖ...అందమైన గీతకావ్యం, సమాజానికి కొత్త ఆలోచనలతో రూపుదిద్దింది. హరిశ్చంద్ర, శాంతిశ్రీ...ఇతిహాస గాథల ఆధారంగా రచించిన ఈ నాటకాలు పాఠకుల మన్ననలు పొందాయి.

**సాహిత్యంలో విశిష్టత:** "గద్య కవిత్వం" అనే నూతన ప్రక్రియను ప్రవేశపెట్టారు. రచనల ద్వారా సామాజిక సమత్వం, నైతికత, వ్యక్తిగత అభివృద్ధి వంటి అంశాలను విశదీకరించారు.

**సమాజ సేవ...** సామాజిక చైతన్యం...బాలికల విద్య, స్త్రీ స్వాతంత్ర్యం కోసం రచనల ద్వారా సామాజిక ఉద్యమాలకు ప్రేరణ కల్పించారు. గ్రామీణ ప్రాంతాల్లో విద్య, ఆర్థిక సమానత్వం కోసం తన ఆలోచనలను వ్యాప్తి చేశారు.


**హేతువాద ఆలోచనలు...** ప్రాచీన ఆచారాలను తిరస్కరిస్తూ, ఆధునిక దృక్పథాలను సమర్థించారు. విద్య ద్వారా సమాజాన్ని మారుస్తారని నమ్మి, ఆ దిశగా సేవ చేశారు.

**రామలింగారెడ్డి ప్రత్యేకత...** బహుముఖ ప్రజ్ఞావంతుడు...కవి, రచయిత, హేతువాది, శాస్త్రవేత్త, న్యాయవాది వంటి అనేక పాత్రల్లో ప్రతిభ చూపారు. ఆదర్శవాది...తన జీవితంలో ఉన్నత ఆచారాలను పాటిస్తూ, సమాజానికి ఆదర్శంగా నిలిచారు. సాహిత్య సేవల విలువ... కేవలం రచయితగానే కాకుండా, సమాజానికి మార్గదర్శకుడు, చైతన్యవంతుడు.

**మరణం...** 1953 ఫిబ్రవరి 24న ఆయన పరమ పదించారు. కానీ, ఆయన రచనలు, విద్యాపరమైన సంస్కరణలు తెలుగు ప్రజల మనసుల్లో చిరస్థాయిగా నిలిచి పోయాయి. కట్టమంచి రామలింగారెడ్డి తెలుగు సాహిత్యం, విద్యారంగాల్లో చేసిన కృషి అపారమైనది. ఆయన రచనలు నేటికీ తెలుగు భాషాభిమానులకు స్ఫూర్తినిస్తున్నాయి. విద్య, సాహిత్యం, సమాజ సేవలలో ఆయన చూపిన నిబద్ధత ప్రతి ఒక్కరికీ మార్గదర్శకంగా ఉంది.

**రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595494**

# భక్తుల కొంగు బంగారం... శాతవాహనుల శివాలయం



గోదావరీ నదీ దక్షిణ తీరమున పరివ్యాపితమైయున్న కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో, ఉత్తర దక్షిణ భార తీయులకు సేతువై నిలిచిన ఈ ప్రాంత నాగరికత కాల ప్రవాహంలో కొట్టు కొని పోయినా, ఔత్సాహికులైన చారిత్రక పరిశోధకుల అవిరళ కృషి ఫలి తంగా కథలుగా, గాథలుగా, నోళ్ళలో, రాళ్ళలో, ఆకులలో, రేకు లలో, అక్కడక్కడా నిక్షిప్తమైయున్న చరిత్ర కొంతవరకు వెలుగులోనికి రా గలిగింది. శాతవాహన వంశానికి మూలపురుషుడని భావింపబడే శ్రీముఖుడు కోటిలింగాలను రాజధా నిగా చేసుకుని పాలించాడనడానికి ఆధార భూతమైన, ఆయన నాణాలు కోటిలింగాలలో లభ్యమైనాక చరిత్రలో నూతన అధ్యాయానికి నాంది పలికింది. అవిభక్త కరీంనగర్, ప్రస్తుత జగిత్యాల జిల్లాలో ధర్మపురి నియోజక వర్గంలో, ధర్మపురి క్షేత్రానికి 19కి.మీ.ల దూరాన వెల్లటూరు మండలం లోని గోదావరి, పెద్దవాగు సంగమ స్థాన మందుగల కోటిలింగాలలోని పుట్టుకోట గోడలు (పూర్వపు కోటలు) ఆంధ్రదేశ పాలకు లైన శాతవాహనుల తొలి రాజులకు ఆటపట్టయినవి. హాల చక్రవర్తిగాథా సప్తశతిలోని గోదావరీ వర్ణన ఆధారంగా, లభ్యమైనట్టి సిముఖ నాణాలను బట్టి కోటిలింగాల శాతవాహనుల బలిష్ట దుర్గమని స్పష్టమైంది. కోటిలింగాల సమీపమునగల గుట్ట జైనము నుల కావాస స్థానముగ నుండేదని తెలుస్తున్నది. ఒకనాడు ఇక్కడి గోదావరి ఓడరేవు ద్వారా వాణిజ్య సరుకులు బంగాళాఖాతం తద్వారా ఇతర ప్రాంతాలకు రవాణా జరిగేదని చారిత్రక పరిశోధకులు తేల్చారు. సమీపాన క్రీ.పూ.రెండవ శతాబ్దపుబౌద్ధ స్తూపం పాషాయిగాం గుట్టపైన ఉండేది. ప్రస్తుతం మధ్యయుగానికి చెందిన దేవాలయం గ్రామంలో ఉంది. రెండు గర్భగృహాలకు ఉమ్మడి మంటప ముంది. ప్రతి గర్భ గృహంలో అంతరాళం ఉంది. ప్రధానాలయంలో కోటీశ్వరుడు లింగరూపుడుగా ప్రతిష్ఠితు డుకాగా, దక్షిణ దిశలో ఉత్తర ముఖ గర్భగృహంలో సిద్ధేశ్వరుడు లింగరూపుడై ఉన్నాడు. ఆలయం చాళుక్య కళారీతులలో నుండి గోదావరి ఒడ్డున అనేక శిల్ప ప్రతిమలున్నాయి. పురావస్తు శాఖచే త్రవ్వకాలు జరపబడి, పర్యాటక శాఖ గుర్తింపు పొందింది. ప్రస్తుతం పర్యాటక శాఖ పక్షాన రెండు బోట్లు జల విహారానికి కేటాయించారు. స్థానికుల, దాతల చేయూతతో, ధర్మకర్తల మండలుల కృషితో, ప్రత్యేక నిధులను ప్రోగు చేసుకుని దేవస్థానాన్ని అభివృద్ధి పరుచు కున్నారు. ఇటీవలి గోదావరి పుష్కరాలలో లక్షలాది భక్తులు దర్శించాక, మిగుల ప్రచారం పొందిందీ తీర్థం , క్షేత్రం. ధర్మపురి శాసనసభ్యులుగా, రాష్ట్ర ప్రభుత్వ చీఫ్, మంత్రిగా ఉన్న కొప్పుల ఈశ్వర్ చొరవతో ఇక్కడ గత పుష్కరాల సందర్భంగా అనేక పనులతో అభివృద్ధి పరిచి పుష్కరాలను ఘనంగా నిర్వహింప చేశారు, వివిధ అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టారు. ధర్మపురి నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్...రేవంత్ రెడ్డి నేతృత్వంలోని తెలంగాణ ప్రభుత్వ హయాంలో మరింత అభివృద్ధి పనులను చేపడుతూ, పర్యాటక శోభను సంతరించుకునే విధంగా తీర్చి దిద్దాల్సిన అవసరం ఉంది. **రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# భక్తుల కోరికలు నెరవేర్చే వేములాడ రాజన్న

## శివరాత్రికి వేములవాడ శ్రీరాజరాజేశ్వరస్వామి ముస్తాబు





వేములవాడ పుణ్య క్షేత్రంలో వెలసిన దేవుడు వేములవాడ రాజన్న గా తెలుగు నాట ఎంతో ప్రసిద్ధి. ఈ ఆలయానికి పౌరాణిక, చారిత్రిక ప్రాముఖ్యత ఎంతో ఉంది. వేముల వాడ పూర్వ నామం లేంబుల వాటిక. కాలక్రమంలో "లేంబుల వాడ" గా ఆ తర్వాత "వేముల వాడగా" రూపాంతరం చెందినది. ఈ ఆలయాన్ని చోళ రాజులలో ప్రముఖుడైన రాజ రాజ నరేంద్రుడు నిర్మించినట్లు చరిత్రకాధారాలున్నాయి. క్రీ.శ. 750 నుండి 175 సంవత్సరాలపాటు చాళుఖ్యులు, ఇక్ష్వాకులు. పరి పాలించినట్లు ఇక్కడ లభ్యమైన చారిత్రక ఆదారాలను బట్టి తెలుస్తున్నది. ఒకనాడు ఈ ప్రాంతం శైవ, వైష్ణవ, జైన మతాలకు కేంద్రంగా వుండేదని తెలుస్తున్నది. అనంతర కాలంలో ఈ ప్రాతం కాకతీయుల, డిల్లీ సుల్తానుల ఆధీనంలో వున్నట్లు చరిత్రను బట్టి తెలుస్తున్నది. రాజ రాజేశ్వరుని వేములవాడ రాజన్న అని ప్రేమతో పిలుచు కుంటారు. ప్రధాన ఆలయంలో రాజరాజేశ్వరునికి కుడి వైపున రాజ రాజేశ్వరీ అమ్మవారు, ఎడమ వైపున లక్ష్మి సమేత గణపతి ఉన్నారు. ఆలయ ముఖ ద్వారం పై గజలక్ష్మి, సింహ ద్వారానికి ఎదురుగా అనంత పద్మనాభ స్వామి ఆలయం వున్నది. ఆలయం చుట్టూ బాల రాజేశ్వర, విఠలేశ్వర, ఉమామహేశ్వర, బాలా త్రిపుర సుందరీ దేవి ఆలయాలున్నాయి. సమీపంలో నగరేశ్వర, వేణుగోపాలస్వామి మొదలగు ఆలయాలున్నాయి. జగన్మాత స్వరూపిణి అయిన బద్ది పోచమ్మ ఆలయం కూడ వున్నది. దేవాలయం ప్రక్కనే వున్న ధర్మకుండం (పుష్కరిణి) చాల పవిత్రమైనదిగా భక్తులు భావిస్తారు. దక్ష యజ్ఞ సమయంలో వీరభద్రుని చేతిలో చేతులు కోల్పోయిన సూర్యుభగవానుడు, ఈ పుష్కరిణిలో స్నానం చేయగా చేతులు వచ్చాయని పురాణ గాథ. దేవేరి శ్రీ పార్వతీ రాజరాజేశ్వరీదేవి సమేతుడై శ్రీ రాజరాజేశ్వరుడు లింగరూపంలో వెలసి నిత్య పూజలందు కుంటున్నాడు. శ్రీ కాశీనగరి, చిదంబరపురి, శ్రీశైల, కేదారాది శివక్షేత్రాల వలె వేములవాడ క్షేత్రం మహిమాన్వితమై భక్తకోటిని తరింపజేస్తున్నది. లేంబాల వాటికగా, భాస్కర క్షేత్రంగా, హరిహర క్షేత్రంగా నామాంతరాలు కలిగివున్న ఈ క్షేత్ర ప్రశస్తి భవిష్యత్తోత్తర పురాణంలోని రాజేశ్వర ఖండంలో పేర్కొన బడింది. కృత యుగంలో దేవేంద్రుడు లోక కంటకుడైన వృత్తాసురుడు అనే రాక్షసుని సంహరించి తదనంతరం సంక్రమించిన బ్రహ్మహత్యా పాతకం తొలగించేందుకు పలు క్షేత్రాదులు తిరుగుతూ వేములవాడ క్షేత్రానికి విచ్చేసి ధర్మకుండ పుష్కరిణిలో స్నానమాచరించి స్వామివారిని అర్చించి పునీతుడైనట్టు రాజేశ్వర ఖండంలో వివరించ బడింది. త్రేతాయుగంలో దక్షుడు గంధమాదన పర్వతంపై యజ్ఞం చేయగా, శివ యజ్ఞ భాగలేమితో యున్న మంత్ర పూతమైన హవిస్సును సూర్యుడు తీసుకొని తన నిజబాహువులు కోల్పోయాడట. శతవత్సరముల అనంతరం సూర్యుడు విప్రుల సూచనలపై ఈ క్షేత్రంలో స్వామివారిని ఆరాధించి తిరిగి బాహువులు పొందినట్లు, అందుకే ఈ క్షేత్రానికి భాస్కర క్షేత్రమని పేరు వచ్చినట్లు పురాణాంతర్గత కథనం. దండకారణ్య ప్రాంత సంచారణ సమయంలో శ్రీ సీతారామ లక్ష్మణులు, అరణ్య వాసంలో పంచ పాండవులు ఈ క్షేత్రాన్ని సందర్శించి పూజలు చేసినట్లు, స్వామివారి కృపకు పాత్రులైనట్లు స్థలపురాణ విదితం. కాశీ, చిదంబరం, శ్రీశైలం, కేదారేశ్వరం లను పావనం చేసిన తరువాత శివుడు వేములవాడ వేంచేసాడని పురాణ కథనం. ఏ ఆలయంలోలేని ప్రత్యేక సాంప్రదాయం ఈ ఆలయంలో వున్నది. పిల్లలు పుట్టని దంపతులు పిల్లలు కలగాలని స్వామి వారికి మొక్కుకొని, పిల్లలు కలిగాక ఆ బాలునితో, ఒక కోడె దూడను తెచ్చి, ఆలయం చుట్టు తిప్పి ముందున్న స్థంబానికి కట్టి వెళతారు. దీన్నే కోడే మొక్కు అంటారు. కోడే దూడను తెచ్చుకోలేని దూర ప్రాంతం వారి సౌకర్యార్థం ప్రస్తుతం ఇక్కడ ఆ సమయానికి కోడే దూడలను అద్దెలకు ఇస్తారు. మహా శివ రాత్రి వంటి పర్వ దినాలల్లో కోడే మొక్కు చెల్లించుకొనే వారి సంఖ్య వేలలో వుండడాన్ని బట్టి చూస్తే ఈ ఆలయ ప్రాశస్త్యం ఎంత గొప్పదో తెలుస్తుంది. అదే విధంగా స్వామివారికి బెల్లం సమర్పించడం కూడ ఇక్కడున్న మరో ఆచారం. మరెక్కడాలేని మరో ఆచారం కూడ ఇక్కడ మరొకటి వున్నది. రోగాల బారిన పడిన లేక ఇతర కష్టాల బారిన పడిన స్త్రీలు రాజరాజేశ్వరునికి మొక్కుకొని అవి తీరాక ఆది బిక్షువు అడుగు జాడల్లోనే జీవితాంతం బిక్షాటన వృత్తిగా చేసుకొని, పార్వతిగా మహా శివునికే అంకితమై పోతారు. అలాంటి వారు ఈ ప్రాంతంలో వేల సంఖ్యలో వుంటారు. శివరాత్రి రోజున మూడు లక్షలకు పైగా భక్తులు రాజరాజేశ్వర స్వామిని సేవించుకుంటారు. ఆ రోజున ప్రత్యేక పూజలు జరుపుతారు. వంద మంది అర్చకులతో మహాలింగార్చన జరుపుతారు. అర్ధరాత్రి వేళ శివునికి ఏకాదశ రుద్రాభిషేకం చేస్తారు. రాత్రివేళ దీపాలంకరణలతో దేవాలయం దేదీప్యమానంగా వెలుగుతూ ఉంటుంది. భక్తులకు ప్రత్యేక సౌకర్యాలు ఏర్పాటు చేస్తారు. అనేక సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయి. వేములవాడ కరీంనగర్‌కు 36 కిమీల దూరంలో కరీంనగర్ - కామారెడ్డి దారిలో ఉంటుంది. హైదరాబాద్ నుంచీ, కరీంనగర్ నుంచీ ఎక్స్ ప్రెస్ బస్సులు నడుస్తుంటాయి. ఈ నెల 25నుండి 27వరకు మహా శివరాత్రి ఉత్సవాలకు తగిన ఏర్పాట్లు పూర్తి చేశారు. 26న బుధ వారం ఉదయం 3.30నుండి 3.40వరకు ఆలయ శుద్ధి, మంగళ వాద్యాలు, 3.40నుండి 4.20వరకు సుప్రభాతం, 4.30నుండి 6వరకు ప్రాతఃకాల పూజ, అనువంశిక అర్చకుల దర్శనం, 7గంటలకు టిటిడి మరియు 8గంటలకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం పక్షాన పట్టు వస్త్రాల సమర్పణ, సాయంత్రం 4గంటలకు శివ దీక్షా స్వాముల దర్శనం, 6.05గంటలకు శ్రీ స్వామివారి కళ్యాణ మంటపంలో మహాలింగార్చన, రాత్రి 11.35కు లింగోద్భవ కాలమందు మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహిస్తారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

# గల్ఫ్ లో పెంచిన ఇండియన్ పాస్‌పోర్ట్ ఫీజును తగ్గించాలి

## పేద గల్ఫ్ కార్మికులపై నాలుగు రెట్ల ఫీజుల భారం



కేంద్ర ప్రభుత్వం కొత్త అవుట్‌సోర్సింగ్ విధానంతో గల్ఫ్ దేశాలలో పాస్ పోర్ట్, కాన్సులర్ సేవలను ప్రైవేటీకరించి నాలుగు రెట్ల ఫీజులు పెంచడం పట్ల ప్రవాసి కార్మికులు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. పెంచిన పాస్ పోర్ట్, కాన్సులర్ సేవల ఫీజులను వెంటనే తగ్గించాలని టీపీసీసీ ఎన్నారై సెల్ కన్వీనర్ మంద భీంరెడ్డి ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి, విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ కు సోమవారం మెయిల్ ద్వారా, 'ఎక్స్' వేదిక ద్వారా విజ్ఞప్తి చేశారు. విదేశీ మారక ద్రవ్యాన్ని పొందే దేశాలలో భారతదేశం ప్రపంచంలోనే అగ్రస్థానంలో ఉన్నది. ప్రవాస భారతీయులు 2024లో 129 బిలియన్ యుఎస్ డాలర్ల (11 లక్షల 22 వేల కోట్ల రూపాయల) విలువైన విదేశీ మారక ద్రవ్యాన్ని భారత్ కు పంపారు. ఇది భారతదేశ స్థూల దేశీయోత్పత్తి (జీడీపీ)లో 3.4 శాతం. ఇందులో సగానికి పైగా సొమ్ము యూఏఈ, సౌదీ అరేబియా, కువైట్, ఓమాన్, ఖతార్, బహరేన్ ఆరు అరబ్ గల్ఫ్ దేశాల నుంచే వచ్చింది. ప్రవాసి కార్మికులు దేశానికి ఆర్థిక జవాన్లుగా నిలుస్తున్నారు. గల్ఫ్ దేశాలలో 88 లక్షల మంది వలస కార్మికులు నివసిస్తున్నారని భారత ప్రభుత్వ లెక్కలు చెబుతున్నాయి. ఏటా 26.6 బిలియన్ యూఎస్ డాలర్ల విదేశీ మారక ద్రవ్యాన్ని ఆర్జిస్తున్న బంగ్లాదేశ్ ప్రపంచంలో ఆరవ స్థానంలో ఉన్నది. విదేశాల నుంచి ఫారెక్స్ పంపిస్తున్న తమ ప్రవాసీలకు బంగ్లాదేశ్ ప్రభుత్వం 2.5 శాతం ప్రోత్సాహకం ఇస్తున్నది. మనకంటే చాలా చిన్న దేశం బాంగ్లాదేశ్ తమ ప్రవాసులకు ప్రోత్సాహకాలు ఇస్తుంటే భారత్ మాత్రం ఎన్నారైలను పీడిస్తున్నదని భీంరెడ్డి అన్నారు. ఇప్పటికే తక్కువ వేతనాలు, జీతం దొంగతనం (వేజ్ థెఫ్ట్), రుణ బానిసత్వం, బలవంతపు శ్రమ, పెరుగుతున్న జీవన వ్యయంతో ఇబ్బంది పడుతున్న కార్మికులకు పాస్ పోర్ట్, కాన్సులర్ సేవల ఫీజుల పెంపు మరింత అన్యాయం చేస్తుంది. ప్రవాసి కార్మికులు తమ ఆరోగ్యాన్ని, యవ్వనాన్ని, కుటుంబ జీవితాన్ని త్యాగం చేసినందుకు వారికి భారత ప్రభుత్వం ఇచ్చే గౌరవం ఇదేనా అని మంద భీంరెడ్డి ప్రశ్నించారు. కేంద్ర ప్రభుత్వం ప్రవాసి కార్మికులకు సహాయం చేయడానికి బదులుగా, వారిని ప్రైవేట్ ఔట్ సోర్సింగ్ కంపెనీలకు ఆదాయ వనరులుగా మారుస్తున్నారని ఆయన విమర్శించారు. గల్ఫ్ దేశాలలో ఇండియన్ పాస్ పోర్ట్, కాన్సులర్ సేవల ఫీజు పెంపు ఈ విధంగా ఉన్నది. సౌదీ అరేబియా లో 200-300 రియాళ్లు (గతంలో 50-75), యూఏఈ లో 200-350 దిర్హములు (గతంలో 50-100), ఓమాన్ లో 25-35 రియాళు (గతంలో 5-10), బహరేన్ లో 20-30 దీనార్లు (గతంలో 5-10), ఖతార్ లో 150-200 రియాళ్లు, కువైట్ లో 23.750 దీనార్లు వసూలు చేస్తున్నారు. గల్ఫ్ కార్మికుల జీవితాలపై ప్రభావం చూపే ఇంత ముఖ్యమైన నిర్ణయం తీసుకునే ముందు రాష్ట్ర ప్రభుత్వాలను, వలస కార్మికుల హక్కుల సంఘాలను, పౌర సమాజ సంస్థలను, వలస కార్మికులను ఎందుకు సంప్రదించలేదు. పారదర్శకత, వాటాదారుల ప్రమేయం లేకుండా తీసుకున్న ఈ నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని భీంరెడ్డి డిమాండ్ చేశారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల - 9440595494**

చురకలు

## సంపాదకీయం

### భారత్ కు దూరం పాక్ కు చేరువ... బంగ్లాలో ఈ మార్పు చూశారా?

1971లో పాకిస్థాన్, బంగ్లాదేశ్ లు విడిపోయిన తర్వాత తొలిసారిగా ఓ ఆసక్తికర పరిణామం తెరపైకి వచ్చింది. ప్రధానంగా షేక్ హసీనా పదవి కోల్పోయిన తర్వాత యూనస్ నేతృతంలో ఈ పరిణామం చోటు చేసుకోవడం గమనార్హం. ఈ సమయంలో... భారత్ కు దూరం, పాక్ కు చేరువ అనే సూత్రాన్ని బంగ్లాదేశ్ పాటిస్తున్నట్లు చెబుతున్నారు. అవును... హసీనా ప్రధాని పదవి కోల్పోయిన తర్వాత యూనస్ నేతృత్వంలో బంగ్లాదేశ్ విదేశాంగ విధానంలో మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. ఇందులో భాగంగా... పాకిస్థాన్ కు అనుకూల వైఖరిని ప్రదర్శిస్తోంది. ఈ క్రమంలోనే 1971 తర్వాత తొలిసారిగా ప్రత్యక్ష వాణిజ్య సంబంధాలు బలోపేతం అవుతున్నాయి. ఈ విషయాన్ని పలు మీడియా వర్గాలు వెల్లడించాయి! ప్రస్తుతం పలు మీడియా వర్గాలు వెల్లడించిన విషయాల ప్రకారం... పాకిస్థాన్ ప్రభుత్వం ఆమోదించిన మొదటి కార్గో కరాచీలోని పోర్ట్ ఖాసిమ్ నుంచి బంగ్లాలోని ఢాకాకు బయలుదేరింది! వాస్తవానికి ఈ నెల మొదట్లోనే పాక్ నుంచి బంగ్లాకు 50,000 టన్నుల బియ్యాన్ని కొనుగోలు చేసేందుకు ఒప్పందం ఖరారైనట్లు చెబుతున్నారు. ఈ సందర్భంగా... ది ఎక్స్ ప్రెస్ ట్రిబ్యూన్ వార్తాపత్రికలో ఈ మేరకు ఓ కథనం ప్రత్యక్షమైంది! ఇందులో... 1971 తర్వాత ఫస్ట్ టైమ్ పాకిస్థాన్ నేషనల్ షిప్పింగ్ కార్పొరేషన్ (పీ.ఎన్.ఎస్.సీ) నౌక బంగ్లా ఓడరేవుకు సరుకును తీసుకెళ్తోంది. ఇది ఇరుదేశాల మధ్య సముద్ర వాణిజ్య సంబంధాలలో ఓ ముఖ్యమైన మైలురాయిని సూచిస్తోందని వెల్లడైంది. ఇక.. ఈ రవాణా రెండు దశల్లో పూర్తవుతుందని.. ఫస్ట్ ట్రిప్ లో భాగంగా ఇప్పుడు ఇరవై ఐదు వేల టన్నుల బియ్యం తరలించారని వెల్లడించింది. మిగిలిన బియ్యం మార్చి ఫస్ట్ వీక్ లో పంపే అవకాశం ఉన్నట్లు తెలిపింది. కాగా.. గత ఏడాది డిసెంబర్ లో 53 ఏళ్ల తర్వాత ఫస్ట్ టైమ్ పాక్ నుంచి బంగ్లాకు కార్గో షిప్ వచ్చినట్లు కథనాలొచ్చిన సంగతి తెలిసిందే. కాగా... 1971లో తూర్పు పాకిస్థాన్ నుంచి బంగ్లాదేశ్ విడిపోయి స్వతంత్ర దేశంగా ఏర్పడిన సంగతి తెలిసిందే. అప్పటి నుంచి ఇరుదేశాల మధ్య ఎలాంటి వాణిజ్య సంబంధాలు లేవు. అయితే.. ఇన్నేళ్ల తర్వాత తొలిసారిగా ఇరుదేశాల మధ్య జరుగుతున్నట్లు చెబుతున్న తాజా వాణిజ్య ఒప్పందాలు రెండు దేశాల మధ్య ఆర్థిక సంబంధాలను బలోపేతం చేస్తున్నాయని అంటున్నారు!

# బహుముఖ ప్రజ్ఞాశాలి బొమ్మిరెడ్డి నాగిరెడ్డి - ఫిబ్రవరి 25.. బి.ఎన్.రెడ్డి వర్ధంతి



బి.నాగిరెడ్డి... తెలుగు చిత్ర పరిశ్రమ నుండి విడదీయ జాలని బంధం, అనుబంధం కలిగిన ప్రతిభాశాలి. ఆయన ఆంధ్ర జ్యోతి పత్రిక ప్రచురణ కర్తగా తెలియకున్నా, "చందమామ" పేరు తీయగానే గుర్తొచ్చే పేరు చక్రపాణి తో పాటు రెడ్డి పేరే. బొమ్మిరెడ్డి నాగిరెడ్డి (డిసెంబర్ 2, 1912 – ఫిబ్రవరి 25, 2004) తెలుగు సినీనిర్మాత, దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు గ్రహీత. బి.ఎన్.రెడ్డిగా సుపరిచితు లైన బొమ్మిరెడ్డి నాగిరెడ్డి డిసెంబర్ 2, 1912న కడప జిల్లా, కొండాపురం మండలంలోని పొట్టిపాడు గ్రామంలో అమ్మమ్మ ఇంట, రైతు కుటుంబంలో జన్మించాడు. ఈయన స్వస్థలం, సింహాద్రిపురం మండలంలోని వై.కొత్తపల్లిలో ఒక ఉపాధ్యాయుడి వద్ద చదువుకున్న నాగిరెడ్డి పది, పన్నెండేళ్ళు వచ్చేనాటికే పురాణేతిహాసాలను క్షుణ్ణంగా ఆకళింపు చేసుకో గలిగాడు. అవన్నీ ఆయన ఆలోచనా విధానాన్ని ఎంతగానో ప్రభావితం చేశాయి. యువకుడుగా ఆయన స్వాతంత్ర్యోద్యమం పట్ల ఆకర్షితుడయ్యాడు. ఖాదీ ఉద్యమంలో పాల్గొన్నాడు. ప్రింటింగ్ ప్రెస్ ను ప్రారంభించాడు. క్రమంగా ప్రచురణ రంగ ప్రవేశానికి అదే దోహదం చేసింది. ఆంధ్రజ్యోతి అనే సామాజిక–రాజకీయ పత్రికను ప్రారంభించాడు. అప్పుడే చక్రపాణి సాహచర్యం లభించింది. ఇద్దరూ కలిసి పిల్లల కోసం ప్రత్యేకంగా ఒక పత్రికను తీసుకు రావాలను కున్నారు. దేశం స్వాతంత్ర్యం పొందడానికి ఒక నెల ముందుగా "చందమామ" ఆవిర్భావం జరిగి దినదిన ప్రవర్ధమానం కాసాగింది. ఆ తర్వాత ఆయన సినిమా నిర్మాణరంగప్రవేశం చేశాడు. 1974లో ఆయన దృష్టి వైద్యరంగం మీదికి మళ్ళింది. మద్రాసులో రెండు ఆసుపత్రులను నెలకొల్పాడు. కఠినశ్రమ, నిరాడంబరత, వినయం, నిర్దిష్ట పథకాలు రూపొందించడం, ఆయన సహజ గుణాలు. ఆయన పలికే ప్రతి మాటలోనూ, చేసే ప్రతి పనిలోనూ భారతీయ తాత్విక దృష్టి, ముఖ్యంగా భగవద్గీత ప్రబోధించే కర్మసిద్ధాంత ప్రభావం స్పష్టంగా కనిపించేది. మొదట్నుంచి నాగిరెడ్డికి పబ్లిసిటీ విభాగం పట్ల ఆసక్తి ఉండేది. ఆయన అన్న బి.ఎన్.రెడ్డి స్థాపించిన వాహినీ సంస్థలో భాగస్వామిగా చేరాడు. రెండవ ప్రపంచయుద్ధ కాలంలో (1941లో) వాళ్ళ సరుకు తీసుకువెళ్తున్న ఓడ బాంబు దాడిలో ధ్వంసం కావడంతో పెద్ద మొత్తంలో నష్టం వచ్చింది. ఆ పరిస్థితుల్లో వ్యాపారం కొనసాగించ లేక తన స్వగ్రామమైన ఓరంపాడు చేరాడు. ఆ తర్వాత వాహినీ వారి భక్తపోతనకు దర్శకత్వం వహించిన కె.వి.రెడ్డి నాగిరెడ్డిని మద్రాసుకు పిలిపించి ఆ చిత్రం తాలూకు పబ్లిసిటీ వ్యవహారాలు అప్పజెప్పాడు. సరిగ్గా అదే సమయంలో జెమినీ వారి బాలనాగమ్మ విడుదలైంది. జెమినీ వారు తమ చిత్రాలకు పెద్ద ఎత్తున ప్రచారం చేయిస్తారు. దానికి దీటుగా ఉండడానికి నాగిరెడ్డి మద్రాసులో హనుమంతుడి భారీ కటౌట్లు పెట్టించి వినూత్న రీతిలో ప్రచారం చేయించాడు. ఆ పబ్లిసిటీ చిత్ర విజయానికి బాగా తోడ్పడింది. దాంతో కె.వి.రెడ్డి ఆయనకు 500 రూపాయలు బహుమతిగా ఇచ్చాడు. ఆ మొత్తంతో నాగిరెడ్డి ఒక ఆస్టిన్ కారు కొన్నాడు. తర్వాత 1950లో నిర్మాతగా మారి చక్రపాణితో కలిసి విజయా ప్రొడక్షన్స్ స్థాపించాడు. ఉన్నతమైన ప్రమాణాలతో పండితపామర జనరంజకంగా సినిమాలు తీసిన విజయా సంస్థ తెలుగు సినిమా చరిత్రలో ఒక సువర్ణాధ్యాయాన్ని సృష్టించింది. 1950లో వచ్చిన షావుకారుతో మొదలైన ప్రస్థానం 1962లో వచ్చిన గుండమ్మ కథ వరకు ఉచ్ఛస్థితిలో కొనసాగింది. అర్జునుడి పతాకంపై జెండాపై కపిరాజు (హనుమంతుడు) బొమ్మ ఉంటుంది. అర్జునుడి ఆ పతాకమే విజయావారి లోగోలోనూ ఉంటుంది. లోగోలో "క్రియా సిద్ధి స్సత్వే భవతి" అనే ఆర్యోక్తి ఉంటుంది. విజయా ప్రొడక్షన్స్ వారి మొదటి సినిమా ఎల్వీ ప్రసాద్ దర్శకత్వం వహించిన "షావుకారు" (1950). ఇది తెలుగులో మొట్టమొదటి అభ్యుదయ చిత్రంగా, తెలుగు సినిమాకు పునాదిరాయిగా కీర్తి అందుకొంది. ఈ సినిమా అనుకున్నంతగా విజయవంతం కాకపోవడంతో తర్వాతి ప్రయత్నంగా కె.వి.రెడ్డి దర్శకత్వంలో పాతాళభైరవి తీశారు. 1951లో వచ్చిన "పాతాళభైరవి", సినిమాను జనం విరగబడి చూశారు. అంతకు ముందు ఎవరూ కనీ వినీ ఎరుగని ఘనవిజయం సాధించింది. దాంతో ఈ సినిమాను తర్వాత హిందీ, తమిళ భాషల్లో కూడా తీశారు. ఈ సినిమాలోని పాత్రలు తోట రాముడు, నేపాళ మాంత్రికుడు, అంజిగాడు, సదాజపుడు, ఆ పాత్రల కోసం పింగళి నాగేంద్రరావు రాసిన సంభాషణలతో సజీవంగా ప్రజల మనసుల్లో స్థిరనివాసం ఏర్పరచు కొన్నారు. ఈ సినిమాతో ఎస్వీ రంగారావు లోని గొప్పనటుడు బయట కొచ్చాడు. ప్రేక్షకాదరణలో ఈ సినిమాను అధిగమించ గలిగింది. మాయాబజార్ ఒక్కటే. విజయా వారి మూడవ సినిమా పెళ్ళిచేసిచూడు. ఇది భారీగా లాభాలనార్జించింది. దీంట్లో ఎన్.టి.రామారావు, జి.వరలక్ష్మి, సావిత్రి నటించారు. తర్వాత తమ సంస్థలో దర్శకత్వశాఖలో సహాయ దర్శకుడుగా పనిచేస్తున్న కమలాకర కామేశ్వరరావు దర్శకత్వంలో 1954లో చంద్రహారం తీశారు. ఇది గొప్ప చిత్రంగా విమర్శకుల ప్రశంసలు పొందింది. కానీ ప్రేక్షకుల ఆదరణకు నోచు కోలేదు. ఆ తర్వాత వారు తీసిన సినిమాలే నేటికీ తెలుగులో వినోదాత్మక సాంఘిక చిత్రాల్లో మేటిగా కీర్తించబడే మిస్సమ్మ, దాని తర్వాత మాయాబజార్. నిస్సందేహంగా ఇది ప్రపంచస్థాయి చిత్రాలు. వీటి తర్వాత వచ్చిన రెండు విజయవంతమైన విజయావారి సినిమాలు అప్పుచేసి పప్పుకూడు, గుండమ్మ కథ. గుండమ్మ కథతో ఒక శకం ముగిసినట్లైంది. సి.ఐ.డి, జగదేకవీరుని కథ, సత్య హరిశ్చంద్ర, ఉమా చండీ గౌరీ శంకరుల కథ, గంగ–మంగ, శ్రీ రాజేశ్వరీ విలాస్ కాఫీక్లబ్ మొదలైనవి తీశారు. ఇక సినిమాలు తీయడం మానుకున్న నాగిరెడ్డి ఆ తర్వాత చాలా కాలానికి 1990లలో విజయా బ్యానర్ మీదే "విజయ" అనే సినిమా తీశాడు. దీంట్లో రజనీకాంత్ నటించాడు. విజయాసంస్థ ఏర్పడిన నాటి నుంచి 'ఉమా చండీ గౌరీ శంకరుల కథ' వరకు వారి ప్రతి సినిమాలోనూ హీరో రామారావే. ఆస్థాన నటులుగా ఉన్నవాళ్ళు ఎస్వీ.రంగారావు, సూర్యకాంతం, రేలంగి, రమణారెడ్డి తదితరులు. ఆ కాలంలో నటులు ఇతర సంస్థలు తీసే సినిమాల్లో హీరో వేషం వేయడం కంటే విజయావారి సినిమాల్లో ఎక్స్ట్రా వేషం వేయడమే మిన్నగా భావించేవారు. అక్కినేని నాగేశ్వరరావుకు విజయావారి సినిమాల్లో నటించే అవకాశం మొదట మిస్సమ్మ సినిమాతో వచ్చింది. మాయాబజార్ తర్వాత ఆయనకు గుండమ్మకథలో సహనాయకుడి పాత్ర వేసే అవకాశం వచ్చింది. అది ఆయనకు నూరవ సినిమా కూడా. అది గొప్ప అదృష్టంగా భావించిన ఆయన ఆ సినిమాకు పారితోషికం తీసుకోలేదు. కానీ నాగిరెడ్డి ఆయనకు ఇవ్వవలసిన మొత్తాన్ని ఒక విద్యాసంస్థకు విరాళంగా ఇచ్చారు. ఎల్వీ ప్రసాద్ (షావుకారు, పెళ్ళిచేసిచూడు, మిస్సమ్మ) బీ కె.వి.రెడ్డి (పాతాళభైరవి, మాయా బజార్, జగదేకవీరునికథబీ కమలాకర కామేశ్వరరావు (చంద్రహారం), దర్శకులుగా ఉన్నారు. విజయా సంస్థ తమిళంలో పాతాళభైరవి, కళ్యాణం పన్ని పార్ (పెళ్ళి చేసి చూడు), చంద్రహారం, మిస్సియమ్మ (మిస్సమ్మ), మాయా బజార్, గుండమ్మ కథ, ఎంగవీట్టు పిళ్ళై (సురేష్ ప్రొడక్షన్స్ వారి తొలి సినిమా, రాముడు – భీముడు) బీ హిందీలో పాతాళభైరవి, మిస్ మేరీ (మిస్సమ్మ), రాం ఔర్ శ్యాం (రాముడు–భీముడు), జూలీబీ కన్నడ, సింహాళీ భాషల్లో కూడా కొన్ని సిన్మాలు తీశారు. నాగిరెడ్డి తమిళంలో గుండమ్మ కథ, ఎంగ వీట్టు పిళ్ళై సినిమాలకు తనే దర్శకత్వం వహించాడు. చెన్నైలో తమ్ముడు బి.ఎన్. కొండారెడ్డి పేరు మెద బి.ఎన్.కె. ప్రెస్సు ప్రారంభించిన ప్రెస్సు నుంచే ఆయన ఆంధ్రజ్యోతి అనే సాంఘిక – రాజకీయ పత్రిక మొదలుకొని అనేక పత్రికలు ప్రచురించాడు. వాటిలో అగ్రగణ్యమైనది చందమామ. అంతేకాక జూనియర్ చందమామ: తొమ్మిదేళ్ల లోపు పిల్లల కోసం చందమామ ప్రత్యేకంగా ఆంగ్లంలో ప్రచురిస్తున్న మాస పత్రిక, విజయ చిత్ర, (సినిమా వారపత్రిక), వనిత, (మహిళల మాస పత్రిక) జూనియర్ క్వెస్ట్, పిల్లలకోసం ఇంగ్లీషులో స్పూత్నిక్, పిల్లలకోసం ఇంగ్లీషులో ది హెరిటేజ్, మనోజ్ దాస్ సంపాదకత్వంలో భారతీయ సాంస్కృతిక వైభవాన్ని గురించి తెలియజేసే ఆంగ్ల మాస పత్రికలను నిర్వచించారు. ఆయన నేషనల్ ఫిల్మ్ డెవలప్ మెంట్ కౌన్సిల్ వ్యవస్థాపకునిగా, ఫిల్మ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షుడిగా రెండు సార్లు, సౌత్ ఇండియన్ ఫిల్మ్ ఫెడరేషన్ అధ్యక్షుడిగా నాలుగుసార్లు, 1980 – 83 మధ్యకాలంలో తిరుమల తిరుపతి దేవస్థానం ట్రస్ట్ బోర్డ్ అధ్యక్షుడిగా పని చేశారు. దాదాసాహెబ్ ఫాల్కే అవార్డు (1987లో), రఘుపతి వెంకయ్య అవార్డు,తమిళనాడు ప్రభుత్వంచే కలైమామణి అవార్డు (1972లో) అందుకున్నారు. శ్రీవేంకటేశ్వర, శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయాల నుంచి గౌరవ డాక్టరేట్లు పొందారు. **రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**


# విలువల కోసం జీవితాంతం పాటుపడిన కాటం - ఫిబ్రవరి 25...కాటం లక్ష్మీనారాయణ వర్ధంతి



ఆయన నిజాం వ్యతిరేక పోరాటయోధులలో ప్రముఖుడు. స్వార్థం అనే పదాన్ని దగ్గరకు రానీయకుండా, రాజకీయ పదవులకు ఏనాడూ పాకులాడ కుండా, కేవలం ప్రజలకు, విలువల కొరకు ఎంతటి వారినైనా, ఎదిరించి ధైర్యంగా నిర్మొహమాటంగా నిల బడటం ఆయనకే చెల్లింది. సంస్థా నాలలో స్వాతంత్ర్య యోధులను కేంద్ర ప్రభుత్వం గుర్తించక పోవడా న్ని అవమానంగా భావించి, పోరాడి సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభింప చేసిన ఘనత ఆయనదే. హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించిన కృషీవలుడు ఆయన. వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని కోర్టు తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి, ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించిన గొప్పతనం ఆయనదే. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హిందీ అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షు లయ్యారు. ఆయనే పోరాట పటిమ కు, కార్యదీక్ష తకు నిలువుటద్దం గా నిలిచిన యోధుడు కాటం లక్ష్మీ నారాయణ. కాటం లక్ష్మీనారాయణ (సెప్టెంబరు 19, 1924 – ఫిబ్రవరి 25, 2010) రంగారెడ్డి జిల్లా శంషాబాదులో, లక్ష్మయ్య, సత్తెమ్మ దంపతులకు 1924 వ సంవత్సరంలో సెప్టెంబరు 19 న జన్మించారు. అయన తాత కాటం నారాయణ స్థానిక జమీందా రుల అకృత్యాలను ఎదిరించిన ధైర్యవంతులు. తాత పేరుతో పాటు ధైర్య సాహసాలు కూడా పుణికి తెచ్చు కున్నారు. 1942 అక్టోబరు 12 న బూర్గుల రామకృష్ణారావు చాదర్ ఘాట్ విక్టరీ ప్లే గ్రౌండులో సత్యాగ్రహం చేయడానికి సన్నాహాలు చేసిన సందర్భంలో నైజాము పోలీసులు బూర్గుల రామకృష్ణారావును, లక్ష్మీనారా యణను అరెస్ట్ చేశారు. అప్పటికి నారాయణ వయస్సు పంతొమ్మిది. అప్పటి నుండి లక్ష్మీనారాయణ బూర్గుల రామకృష్ణారావుని గురువు గా బావించారు. పోలీసులు లక్ష్మీనారాయణను ఏడు నెలల పాటు చెంచల్ గూడ జైల్లో వుంచా రు. తర్వాత లక్ష్మీనారాయణ న్యాయవిద్య పూర్తి చేసి బూర్గుల వారి వద్దనే జూనియర్ లాయర్ గా చేరారు. బూర్గుల తో పాటు అన్ని కార్య కలాపలాలలో క్రియా శీలక పాత్ర పోషించారు. ఆనాటి సామాజి క సమస్యలలో కూడా పాలు పంచు కున్నారు. నిజాం ప్రభుత్వ ఆజ్ఞలను దిక్కరించి హిందీ పాఠశాలను స్థాపించాడు. ఖాది వ్యాప్తి, దళిత జనోద్ధరణ వంటి కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నాతు. ఆచార్య రంగా ప్రేరణతో 1945లో లక్ష్మీ నారాయణ హైదరాబాదు యువ జన కాంగ్రెసు స్థాపించి తాను ప్రదాన కార్యదర్శిగా పనిచేశారు. లక్ష్మీ నారాయణ ఏదో ఒక ఉద్యమంలో పాల్గొనడం, అరెస్ట్ కావడం, తిరిగి రావడం, మళ్లి జైలుకెళ్లడం నిత్య కృత్యం అయింది. నిజాం పాలన అంతమై, నూతన రాష్ట్రం ఏర్పాటు అయ్యాక, ఆర్థిక, సాంకేతిక, వైజ్ఞానిక రంగాలలో రాష్ట్ర పునర్ నిర్మాణానికి 1949 డిసెంబరులో "జనత" పేరుతో ఒక పత్రికను ప్రారంబించారు. గతంలో రజాకార్ల చేతిలో హతుడైన షోయ బుల్లా ఖాన్తో కలిసి పత్రికా రంగంలో పనిచేసిన అనుభవం ఇప్పు డితనికి బాగా ఉపకరించింది. అంతే గాక రైతుల సమస్యల పరిష్కారానికి 1952లో రాష్ట్ర కర్షక సంఘాన్ని స్థాపించారు."తెలుగు భూమి" అనే మరొ పత్రికను 1969లో ప్రారంబించారు. ఆంధ్ర ప్రదేశ్ లో తెలుగు అకాడమి లాగ హిందీ అకాడమి ఉండాలని ఉద్యమించి ప్రభుత్వాన్ని ఒప్పించి స్థాపించి దానికి తానే ఉపాధ్యక్షు లయ్యారు. 1968లో హైకోర్టు వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్లు చెల్లవని తీర్పు ఇవ్వగా దాంతో బలహీన వర్గాల నాయకులందరిని ఒక తాటిపైకి తెచ్చి ఒక కార్యవర్గాన్ని ఏర్పరిచి దానికి కన్వీనరు అయి సుప్రీం కోర్టుకు వెళ్లి హైకోర్టు తీర్పును రద్దు చేయించారు. ఆ సందర్భంలో ఒక మహా సభ ఏర్పాటు చేయించారు. దానికి లక్షలాది మంది రాగా నాటి ప్రధాన మంత్రి ఇందిరాగాంది కూడా రావడం విశేషం. లక్ష్మీ నారాయణ సాధించిన ఘన విజయాలలో ఇది ఒకటి. స్వాతంత్ర్య ఉద్యమాలలో పాల్గొన్న యోధులకు పెన్షన్ ఒక వరం లాంటిది అని నమ్మేవారు లక్ష్మీ నారాయణ. స్వతంత్ర భారత్ లో ఈ అవకాశాన్ని అందరు వినియోగించు కుంటున్నా.... నిజాం పాలిత ప్రాంతాల యోధులకు ఆ అవకాశం రాలేదు. దీనిపై లక్ష్మీనారాయణ కేంద్ర ప్రభుత్వంతో చర్చలు జరిపారు. కేంద్రం అంగీకరిం చక పోవడంతో లక్ష్మీనారాయణ " తెలంగాణ సమర యోధుని సత్యాగ్రహం" అని రాసిన ఒక అట్టను మెడలో వేసుకుని ప్రధాని ఇంటి ముందు నిరాహార దీక్ష చేసారు. ఢిల్లీ పత్రికలు ప్రముఖంగా ఈ అంశాన్ని ప్రచురించాయి. దాంతొ ఇందిరా గాంధి లక్ష్మీణాయణను పిలిపించి కారణం అడగగా..... " సంస్థానాలలో స్వాతంత్ర్య యోధులను మీరు గుర్తించక పోవడాన్ని మేము అవమానంగా భావిస్తున్నాము. బ్రిటిష్ ఆంధ్ర స్వాతంత్ర్య యోధులు ఒక బ్రిటిష్ వారితోనె పోరాడారు. కాని సంస్థాన లోని యోధులు అటు సంస్థానాధీ శులతోను, ఇటు బ్రిటిష్ వారితోను పోరాడారు. 15 ఆగస్టు మాకు స్వాతంత్ర్య దినం కాదా? హైదరా బాదు విముక్తి జరిగిన సెప్టెంబరు 17 ను స్వాతంత్ర్య దినంగా జరుపుకో మంటారా? ఒక్క హైదరాబాదు సంస్థాన ప్రజలే కాదు పలు సంస్థానాల ప్రజలు భారతీ యులు కారా? అవునా? కాదా? ముందు ఇది తేల్చండి? " అని సూటిగా, ధైర్యంగా ఇందిరా గాంధిని ప్రశ్నించి యోధుడు లక్ష్మీ నారాయ ణ. దాంతో సంస్థానాల లోని స్వాతంత్ర్య యోధులకు కూడా పెన్షన్ సౌకర్యం లభించింది. ఈ యోధుడు సాధించిన అతి పెద్ద ఘన కార్యం. నేటికీ ప్రామాణిక గ్రంథంగా ఉన్న 844 పేజీల హైదరాబాదు స్వాతంత్ర్య సమర చరిత్రను ప్రామాణిక పద్ధతుల్లో గ్రంథస్థం చేయించారు... దాన్ని అప్పటి భారత రాష్ట్ర పతి జైల్ సింగ్ చేత ఆవిష్కరింప జేసారు. పి.వి.నరసింహ రావు, టి. అంజ య్య, కాసు బ్రంహానంద రెడ్డి, భవనం వెంకట్రామ రెడ్డి, నలుగురు ముఖ్య మంత్రులతో ఒక పెద్ద సభను నిర్వహించారు. అయన నిర్వహించిన సభలకు ప్రధాన మంత్రులు, రాష్ట్రపతులు, పీఠాధి పతులు, స్వాతంత్ర సమర యోధు లు, దలైలామ వంటి వారు కూడా పాల్గొనే వారు. ఆ మహా యోధు డు 2010 వ సంవత్సరం ఫిబ్రవరి 25 నాడు ఈ లోకాన్ని వదిలి వెళ్లారు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# బహుముఖ ప్రజ్ఞాశాలి ఏల్చూరి - ఫిబ్రవరి 25...ఏల్చూరి సుబ్రహ్మణ్యం వర్ధంతి



ఏల్చూరి సుబ్రహ్మణ్యం ( ఆగస్టు 26, 1920 – ఫిబ్రవరి 25, 1995) ప్రసిద్ధ కవి, రచయిత, పాత్రి కేయులు. సహజ కవిగా, గొప్ప వక్తగా, ఉద్యమ ప్రవక్తగా, ప్రగతి శీల భావుకునిగా, తెలుగు సాహితీ లోకానికి సుపరిచితులు. ఆయన తెలుగు సాహిత్యంలో ప్రాముఖ్యత వహించిన అభ్యుదయ కవిత్వో ద్యమ ఆద్యుల్లో ఒకరు. అభ్యుద య కవితా యుగంలో ప్రగతి శీల భావ దురంధరులైన బెల్లం కొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయు లుతో కూడి, ఏల్చూరి సుబ్రహ్మ ణ్యం వెలువరించిన తొలి కావ్యం నయా గరా కవితల సంపుటి. అలా ముగ్గురు అభ్యు దయ నయాగరా కవులలో ఏల్చూరి ఒకరుగా నిలిచారు. తనకంటూ ప్రత్యేక గుర్తింపు పొందారు. ఏల్చూరి సుబ్రహ్మణ్యం ఆగస్టు 25, 1920న రామయ్య. సుబ్బాయమ్మ దంపతులకు జన్మించారు. మద్దులపల్లి గురుబ్రహ్మశర్మ, భాగవతుల వెంకట సుబ్బారావు, అక్కిరాజు రామాపతి రావు, నాయని సుబ్బారావు తదితరుల వద్ద చిన్ననాడు విద్యా బుద్ధులు నేర్చారు. కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ ఇంట్లోనే ఉండి, విజయవాడ యస్.ఆర్.ఆర్ కళాశాలలో బి.ఎ. డిగ్రీ చేశారు. కవి సామ్రాట్ శిష్యుడు అయిన నందమూరి తారక రామారావు తో చిన్ననాటి నుండి స్నేహం ఉంది. అలాగే కొంగర జగ్గయ్య, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ప్రాణ స్నేహితుల్లా మెదిలారు. కుందుర్తి ఆంజనే యులు, బెల్లంకొండ రామ దాసు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురు విద్యార్థి దశలో చదువుతున్న రోజులలో పరిచయస్తులై, తరువాతి కాలంలో "నయాగరా" కవితా సంకలనం సమ కూర్పుకు కారకులు అయినారు. .'త్రివేణి' ఆంగ్లపత్రిక సంపాదకులు కోలవెన్ను రామకోటేశ్వరరావు, దేశిరాజు కృష్ణశర్మ, బెల్లంకొండ రాఘవరావు, గుడిపాటి వెంకట చలం, గుఱ్ఱం జాషువాల స్ఫూర్తిని పొంది, పులుపుల శివయ్య, కొల్లా వెంకయ్యల వల్ల కమ్యూనిస్టు ఉద్య మంలో కాలూనారు. 1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అన్న పత్రికను స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, దండమూడి కేశవరావు, బెల్లంకొండ రామదాసు, దేవరకొండ బాలగంగాధర తిలక్ మొదలైన కవుల తొలి రచనలను ఆ పత్రికలో ప్రచురించారు. అదే సంవత్సరంలో 'చిత్ర' అనే పత్రికను ప్రారంభిం చారు. 1941 లో నవ్యకళా పరి షత్తును స్థాపించి అనిసెట్టి సుబ్బా రావు, కుందుర్తి ఆంజనేయులు, బెల్లంకొండ రామదాసు, సముద్రాల రామానుజాచార్య, దేవరకొండ బాల గంగాధర తిలక్, రెంటాల గోపాలకృష్ణ మొదలైన అభ్యుదయ కవులు సభ్యులుగా కొనసాగారు. అలా ఆయా కవుల రచనలతో 1943 లో 'మాఘ్యమాల' కవితా సంపుటాన్ని వెలువరించారు. శ్రీశ్రీ కవిత్వ ప్రభావ స్ఫూర్తితో 1944 ఆగస్టులో బెల్లంకొండ రామదాసు, కుందుర్తి ఆంజనేయులు, ఏల్చూరి సుబ్రహ్మణ్యం ముగ్గురి కృషితో కవితా సంకలనం 'నయాగరా' వెలువడి అభ్యుదయ సాహిత్యోద్య మంలో అచ్చయిన తొలి కవితా సంపుటంగా నిలిచి పోయింది. అనిసెట్టి సుబ్బారావు, లక్ష్మీదేవిల పెళ్ళి కానుకగా గుంటూరులో విశ్వనాథ సత్యనారాయణ చేతుల మీదుగా ఆవిష్కృతం అయింది. నయాగర కవితా సంకలనంలో బెల్లంకొండ, ఏల్చూరి, కుందుర్తి ఒక్కొక్కరూ మూడేసి ఖండ కావ్యాలను రచించి 9 ఖండ కావ్యాల సంకలనంగా ప్రచురించారు. ఈ సంకలనంలో ...కుందుర్తి ఆంజనేయులు మూడు రచనలు... జయిస్తుంది, తరువాత, మన్యంలోబీ బెల్లంకొండ రామదాసువి... చెరసాల, నా గీతం, ఈ రోజునబీ అలాగే ఏల్చూరి సుబ్రహ్మణ్యం సంబంధిత....ప్రజాశక్తి, ఠాగూర్ చంద్ర సింగ్, విజయ ముద్ర ఖండ కావ్యాలు చేర్చ బడ్డాయి. 1956 లో తెలుగు సాహిత్యంలో ఏల్చూరి తొలి దీర్ఘ కవిత 'నవంబరు 7' విశాలాంధ్ర పత్రికలో వెలువడింది. తల్లావఝుల శివశంకర శాస్త్రి తో ఉన్న సాన్నిహిత్యం వల్ల ఏల్చూరి నవ్య సాహిత్య పరిషత్తు సభ్యునిగా చేరి, సమావే శాలకు హాజరయ్యారు. ప్రగతిశీల ఉద్యమాలలో పాల్గొ న్నారు. వందలాది రష్యన్ కవితలను ఆంగ్ల మాధ్యమం ద్వారా అనువదించారు. నృసింహ స్వామి పై శతకం కూడా రాశారు. శ్రీరంగం శ్రీనివాసరావు, ఆరుద్ర, అబ్బూరి వరదరాజేశ్వర రావు సంయుక్తంగా రాసిన "మేమే" కావ్యాన్ని సుబ్రహ్మణ్యంకు అంకితం ఇవ్వడం విశేషం. ఆంగ్లంలో వచ్చిన వందలాది రష్యన్ కవితలను తెలుగులోకి అనువదించారు. సోవియట్ భూమి పత్రికలో సుమారు 40వేల పేజీల అనువాద రచన చేశారు అంటే ఆయన గొప్పతనం స్పష్టం అవుతుంది. అభ్యు దయ కవిగా, అంతకు మించి కృషి పాత్రికేయుడిగా ఆయన చేసిన కృషి సాటిలేనిది. 1940 లో నరసరావుపేటలో 'సన్యాసి' అనే పత్రికను స్థాపించి, ప్రముఖ కవుల రచనలు ప్రచురిం చారు. పొగాకు లోకం' (గుంటూరు) పత్రిక సంపాదకులుగా, 1941 – 42లో ఆంధ్ర సర్వస్వము సహాయ సంపాదకునిగా, 1954–56లో ఆకాశ వాణిలో స్క్రిప్టు రైటరుగా... రాయప్రోలు రాజశేఖర్, జలసూత్రం రుక్మిణనాథశాస్త్రి లతో కలిసి ఆకాశవాణికి ఎన్నో స్క్రిప్ట్ లందించారు. మద్రాస్‌లో సినిమా లకు పాటలు కూడా రాశారు. 1952లో సోషలిస్టు పత్రికలో, 1956లోనేత' పత్రిక సంపాద కులుగా, 1961–1988లో సోవియ ట్ భూమి పత్రిక సంపాదక వర్గంలో, తర్వాత మద్రాసులో అభ్యుదయ పత్రిక నిర్వాహకసభ్యునిగా పని చేశారు.ప్రముఖ వేణుగాన విద్వాంసులు ఏల్చూరి విజయ రాఘవరావు ఆయన సోదరులు కాగా, సాహితీవేత్త ఏల్చూరి మురళీధరరావు ఆయన కుమారుడు.

**రామ కిష్టయ్య సంగన భట్ల – 9440595494**

# మార్చి నెలలో చర్లపల్లి నుంచి మరిన్ని రైళ్ల పరుగులు

హైదరాబాద్: చర్లపల్లి టెర్మినల్ నుంచి చెన్నై, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లు నడపడానికి పచ్చజెండా ఊపిన దక్షిణమధ్య రైల్వే మార్చిలో మరో ఎనిమిది రైళ్లను ఇక్కడి నుంచి నడపాలని నిర్ణయించింది. అత్యాధునిక హంగులతో రూపుదిద్దుకుంటున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌పై ఒత్తిడి తగ్గిస్తూ నిర్మాణ పనులను మరింత వేగంగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు రచిస్తోంది. రైలు ప్రయాణాలకు సంబంధించి ముందస్తు రిజర్వేషన్ సమయం 60 రోజులు ఉండటంతో.. గడువు ముగుస్తున్న కొద్దీ రైళ్ల రాకపోకలను చర్లపల్లి మీదుగా సాగించాలని నిర్ణయించింది.

**50వేల మంది రాకపోకలు సాగించేలా...**

సికింద్రాబాద్, నాంపల్లి, కాచిగూడ స్టేషన్లలో పెరిగిన రైళ్ల ఒత్తిడిని దృష్టిలో పెట్టుకొని దక్షిణ మధ్య రైల్వే చర్లపల్లి స్టేషన్ విస్తరణ చేపట్టిన సంగతి తెలిసిందే. రోజూ సుమారు 50వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించేలా చర్లపల్లి టెర్మినల్‌ను విస్తరించారు. సరకు రవాణా పార్శిల్ కేంద్రం కూడా ఏర్పాటు చేశారు. రోజుకు 200కు పైగా రైళ్లు రాకపోకలు సాగిస్తున్న సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో పునరాభివృద్ధి పనులు కొనసాగతున్న నేపథ్యంలో కొన్ని రైళ్ల రాకపోకలను నియంత్రించాల్సిన అవసరం ఏర్పడింది. ఇప్పటికే సికింద్రాబాద్ రైల్వేస్టేషన్ పునరాభివృద్ధి పనులు సుమారు 40శాతం వరకు పూర్తయ్యాయి. ఈ ఏడాది డిసెంబరులోగా మొత్తం పనులు పూర్తి చేసి ప్రారంభించాలని దక్షిణ మధ్య రైల్వే లక్ష్యం నిర్దేశించుకుంది.



రోజూ 2లక్షల మంది ప్రయాణికులు రాకపోకలు సాగిస్తున్న ఈ స్టేషన్‌లో రైళ్ల రాకపోకలు, నిర్మాణ పనులు చేపట్టడంలో సమతూకం పాటించడంలో సవాళ్లు ఎదురవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే కొన్ని రైళ్లను చర్లపల్లి నుంచి నడిపేందుకు దక్షిణ మధ్య రైల్వే ఏర్పాట్లు చేస్తోంది. సికింద్రాబాద్ స్టేషన్‌లో పది ప్లాట్‌ఫామ్‌లు ఉండగా.. రెండు ప్లాట్‌ఫామ్‌ల చొప్పున దఫదఫాలుగా పనులు పూర్తి చేయాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్‌వో తెలిపారు. ఈ మేరకే చర్లపల్లి నుంచి రైళ్లను నడపడం, హాల్టింగ్ తదితర అంశాలను నిర్ణయించనున్నట్టు వెల్లడించారు.

**వచ్చి పోయే రైళ్లు ఇవే...**

చెన్నై ఎక్స్‌ప్రెస్, గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్, కాగజ్‌నగర్ ఇంటర్‌సిటీ, కృష్ణా ఎక్స్‌ప్రెస్, గుంటూరు ఇంటర్ సిటీ, పుష్‌పుల్ (సికింద్రాబాద్, వరంగల్), శబరి ఎక్స్‌ప్రెస్, రేపల్లె ఎక్స్‌ప్రెస్ (మధ్యాహ్నం), శాతవాహన, కాకతీయ ఎక్స్‌ప్రెస్, కాచిగూడ– మిర్యాలగూడ ఎక్స్‌ప్రెస్, లింగంపల్లి, ఘట్‌కేసర్ ఎంఎంటీఎస్, రేపల్లే ఎక్స్‌ప్రెస్ (రాత్రి).

# జేబీఎస్ చెంత మెట్రో రైల్ హబ్

మేడ్చల్ : మెట్రోరైలు రెండోదశలో భాగంగా జేబీఎస్ వద్ద మెట్రోరైల్ హబ్ ఏర్పాటు చేయబోతున్నట్లు హైదరాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోరైలు సంస్థ(హెచ్ఏఎంఎల్) వెల్లడించింది. మేడ్చల్, శామీర్‌పేట్ కారిడార్ల ప్రారంభ స్థానాన్ని జేబీఎస్ వద్ద ఏకీకృతం చేసి.. ప్రపంచస్థాయి ఇంటిగ్రేటెడ్ హబ్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపింది. ఇందుకోసం జేబీఎస్ పరిసరాల్లో రాష్ట్ర ప్రభుత్వం, రక్షణ శాఖకు చెందిన సుమారు 30 ఎకరాల భూమిని సమీకరించవచ్చని హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డి తెలిపారు. ప్రతిపాదిత మార్గంతో మేడ్చల్ నుంచి శంషాబాద్ విమానాశ్రయం వరకు 60 కి.మీ. సుదీర్ఘ మెట్రో కారిడార్ అవుతుందని తెలిపారు. క్షేత్రస్థాయిలో పరిశీలించి.. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా ప్రతిపాదించిన మేడ్చల్, శామీర్‌పేట మెట్రో మార్గాలను రూపొందించే కసరత్తును అధికారులు ప్రారంభించారు. ప్యారడైజ్–మేడ్చల్(23 కి.మీ.), జేబీఎస్–శామీర్‌పేట(22 కి.మీ.) ప్రతిపాదిత కారిడార్ల అలైన్‌మెంట్ రూపొందించడంలో ఉన్న సాంకేతిక సవాళ్లను పరిష్కరించడానికి సీనియర్ ఇంజినీర్లు, సాంకేతిక సలహాదార్లతో కలిసి హెచ్ఏఎంఎల్ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి ఆదివారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ రెండు కారిడార్ల ఏర్పాటులో ఎదురవుతున్న కొన్ని సంక్లిష్ట అంశాలను గుర్తించారు.



**భూగర్భ మార్గాన్ని నివారించేలా..**

క్లిష్టమైన మలుపులు, బేగంపేట విమానాశ్రయం రన్‌వే తర్వాత భూగర్భంలో అలైన్‌మెంట్‌ను తీసుకువెళ్లే ఆవశ్యకతను నివారించేలా, ప్రైవేటు ఆస్తుల సేకరణను వీలైనంత తగ్గించేలా ప్రత్యామ్నాయ మార్గాల లాభనష్టాలను అంచనా వేయాలని మెట్రో ఎండీ అధికారులకు సూచించారు. సొరంగం ద్వారా కాకుండా బోయిన్‌పల్లి రోడ్ (సరోజినీ పుల్లారెడ్డి బంగ్లా పక్కన) చివరన ఉన్న జాతీయ రహదారి జంక్షన్ వద్ద అలైన్‌మెంట్‌ను అనుసంధానించవచ్చని తెలిపారు. అక్కడి నుంచి ఇప్పటికే విస్తరించిన జాతీయ రహదారి సర్వీస్ లేన్‌పై మెట్రో స్తంభాలను నిర్మించవచ్చని అన్నారు. దీంతో మేడ్చల్ –జేబీస్–ఎంజీబీఎస్–చాంద్రాయణగుట్ట–శంషాబాద్ విమానాశ్రయం వరకు 60 కి.మీ. సుదీర్ఘ మెట్రో కారిడార్ ఏర్పాటవుతుందని తెలిపారు.

జేబీఎస్–శామీర్‌పేట మెట్రో మార్గం సికింద్రాబాద్ క్లబ్ సమీపంలో ప్రస్తుతమున్న మొదటి మెట్రో స్తంభం నుంచి డబుల్ ఎలివేటెడ్‌గా కరీంనగర్ రహదారిపై హెచ్ఎండీఏ నిర్మించబోయే ఎలివేటెడ్ కారిడార్‌గా నేరుగా పొడిగించవచ్చని ఎన్వీఎస్‌రెడ్డి వివరించారు.

స్టేషన్ స్థానాల నిర్ధారణ, వాటి సమీపంలో ఖాళీగా ఉన్న రాష్ట్ర ప్రభుత్వ, రక్షణ భూముల లభ్యత, మెరుగైన పార్కింగ్, ప్రయాణికులకు కల్పించే సౌకర్యాలను గుర్తించాలని ఆదేశించారు.

# మట్టి, రాళ్లు తరలించి.. భూమిని ఆక్రమించి



జగిత్యాల : వరదకాలువకు ఇరువైపులా గుట్టలుగా ఉన్న మట్టిని తరలించి నేలను చదునుచేసి భూమిని ఆక్రమించిన ఈ చిత్రం జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోనిది. కేవలం మల్యాల మండలంలోనే కాదు ఉమ్మడి జిల్లాలో దాదాపు 137 కి.మీ విస్తరించి ఉన్న వరదకాలువ వెంబడి ఇలాంటి దృశ్యాలు సాధారణంగా మారి కాలువ ఉనికినే ప్రశ్నార్థకం చేస్తున్నాయి.

ఉమ్మడి జిల్లా వరదాయనియైన శ్రీరామసాగర్ ప్రాజెక్టు మిగులు జలాలను ఆయకట్టేతర మెట్ట ప్రాంతాలకు తరలించే ఉద్దేశంతో నిర్మించిన వరద కాలువ నేడు బహుల రీతుల వినియోగ కాలువగా మారింది. పంపుహౌస్‌ల ద్వారా ఎల్లంపల్లి జలాలను వరదకాలువ గుండా ఎస్సారెస్పీలోకి ఎత్తిపోయటం.. వరదకాలువ నుంచి ప్రధాన చెరువుల్లోకి, కాకతీయ కాలువలోకి నీటిని తరలించటం.. ఎస్సారెస్పీ నుంచి మిగులు జలాలను మధ్యమానేరు, దిగువమానేరుకు తరలించటం.. కాలువలోని నీటిని వేలాది మోటార్ల ద్వారా పంటలకు పారించటం, చేపలపెంపకం తదితరాలతో వరదకాలువ ప్రధాన నీటి వనరుగా నిలుస్తోంది. ఎంతో ప్రాధాన్యం కలిగిన వరదకాలువకు ఇరువైపులా కట్టల మట్టి, బండరాళ్లను తరలించటం, భూమి ఆక్రమణ తదితరాలతో కాలువ ఆనవాళ్లు కోల్పేయే పరిస్థితి తలెత్తుతోంది.

వరదకాలువ 28వ కి.మీ వద్ద జగిత్యాల జిల్లాలోకి ప్రవేశిస్తుంది. మెట్పల్లి, కోరుట్ల, కథలాపూర్, బీమారం, మల్యాల, గంగాధర, రామడుగు, బోయినపల్లి తదితర మండలాల ద్వారా మధ్యమానేరులోకి రోజుకు 2 టీఎంసీల నీటి తరలింపు సామర్థ్యం కలిగి ఉంది. మధ్యమానేరు నుంచి దిగువకు కూడా కాలువను నిర్మించారు. ప్రతిరోజూ 22 వేల క్యూసెక్కుల నీటి తరలింపునకు కాలువను చాలాచోట్ల 30 మీటర్ల వరకు లోతుగా తవ్వటంతో కాలువకు ఇరువైపులా పోసిన మట్టి, రాళ్లు గుట్టలుగా మారాయి. కట్టలపై భారీ చెట్లు పెరిగాయి. ఇటీవల కట్టల మట్టిని జేసీబీలు, ట్రాక్టర్లద్వారా పెద్దఎత్తున తరలించి చదునుచేసిన భూములను ఆక్రమిస్తున్నారు. చాలాచోట్ల పక్కన పొలాలున్నవారు వరదకాలువ భూమిని తమ పొలాల్లో కలిపేసుకుంటున్నారు. కొన్నిచోట్ల వరదకాలువ భూముల్లో నిర్మాణాలు సైతం చేపడుతున్నారు. కట్టలపై పెరిగిన చెట్లను నరికివేసి తరలిస్తున్నారు. కట్టపై రాళ్లను కంకరగా మార్చే క్రషర్లను కూడా నిర్వహించటం పరిస్థితి తీవ్రతను తెలుపుతోంది. దీంతో కరకట్టలు లేక మల్యాల తదితర మండలాల్లో వర్షపునీరు నేరుగా కాలువలోకి ప్రవహించి కాలువ పూడుకుపోతుండగా దిగువకు వర్షపునీటి ప్రవాహం పెరుగుతోంది. పూడికమట్టితో కాలువలో నీటి తరలింపు సామర్థ్యం తగ్గి పంపుహౌస్‌లు పనిచేయలేని స్థితి వస్తుంది. రైతుల పంపుసెట్లకు కూడా నీరందని దుస్థితి నెలకొంటుంది. ఇదే పరిస్థితి కొన్నేళ్లు కొనసాగితే కట్టల మట్టి తగ్గి కాలువ మొత్తం వరదనీటి పూడికతో నిండిపోయి ఎగువకు, దిగువకు నీటితరలింపు కష్టసాధ్యంగా మారి ఉమ్మడి జిల్లాలో తీవ్ర నీటిసమస్యకు దారితీయనుంది. కాలువ కరకట్టల మట్టి, రాళ్లు, చెట్లను పరిరక్షించి ఆక్రమిత భూముల స్వాధీనానికి చర్యలు చేపట్టాల్సి ఉంది.

దీనిపై వరద కాలువ అధికారి సుధాకిరణ్ మాట్లాడుతూ ఇటీవల అయిదుగురు ఈఈలు, సిబ్బందిని కాలువ పరిరక్షణ, నిర్వహణకు ప్రభుత్వం నియమించిందన్నారు. ఇకపై ఎలాంటి అక్రమాలు జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని వివరించారు. కథలాపూర్ మండలంలోని పెగ్గెర్ల, కథలాపూర్, దుంపెట, దూలూరు, తక్కళ్లపెల్లి గ్రామాల మీదుగా సుమారు 14 కి.మీ పొడవునా వరద కాలువ విస్తరించి ఉంది. కాలువకు ఇరువైపులా ఉన్న మట్టిని అక్రమంగా తవ్వి కోరుట్ల పట్టణానికి, చుట్టు పక్కల గ్రామాలకు తరలిస్తున్నారు. వరద కాలువ స్థలం చదును చేసి పంటలు సాగు చేసుకుంటున్నారు.

# ఆపరేటర్ల తప్పిదం.. అర్హులకు అన్యాయం




సంగారెడ్డి : ప్రభుత్వం గృహజ్యోతి పేరుతో ఉచిత గృహ విద్యుత్తు పథకం అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా ఈ పథకానికి అర్హులకు జీరో బిల్లులు జారీ చేస్తున్నారు. కొంతమందికి అర్హత ఉన్నప్పటికీ.. బిల్లుల చెల్లించాల్సి వస్తుండటంతో ఆందోళన చెందుతున్నారు. ప్రజాపాలన రశీదు, సంబంధిత పత్రాలతో మండల పరిషత్తు, మున్సిపల్ కార్యాలయాలకు పరుగులు తీస్తున్నారు. ఎడిట్ ఆప్షన్ లేదన్న సమాధానంతో నిరాశతో వెనుదిరుగుతున్నారు.

**హడావుడిగా నమోదుతో..**

ప్రజాపాలన దరఖాస్తుకు ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియను హడావుడిగా నిర్వహించారు. ఇందుకోసం ఎక్కువగా ప్రైవేటు కంప్యూటర్ ఆపరేటర్లను నియమించారు. దరఖాస్తు ఫాంలో అన్ని పథకాలకు ఐచ్ఛికాలు ఇచ్చినప్పటికీ.. ఆపరేటర్లు చాలామంది వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయలేదు. ఆపరేటర్ల నిర్లక్ష్యం అధికారుల పర్యవేక్షణ లోపంతో నమోదు ప్రక్రియ అస్తవ్యస్తంగా సాగింది. దీంతో ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలకు దరఖాస్తు చేసినప్పటికీ.. ఇప్పుడు ఆన్‌లైన్‌లో తనిఖీ చేస్తే దరఖాస్తు చేయనట్లు కనిపిస్తోంది. ప్రస్తుతం సంబంధిత పత్రాలతో కార్యాలయాలకు వెళితే తాము ఏమీ చేయలేమని, ఐచ్ఛికం ఇచ్చినప్పుడు నమోదు చేస్తామని పత్రాలు తీసుకొని పంపుతున్నారు.

జిల్లాలో ఆహార భద్రత కార్డులు: 3.78 లక్షలు
గృహ విద్యుత్తు వినియోగదారులు: 6.14 లక్షలు
జీరో బిల్లుల జారీ: 2.16 లక్షలు
జీరో బిల్లులకు ఫిబ్రవరి రాయితీ: రూ.6.19 కోట్లు

ఇంటింటి సర్వేలో వివరాలు సేకరించినా..

విద్యుత్తు సిబ్బంది ఇంటింటికీ తిరిగి వినియోగదారుల వివరాలు సేకరించి యాప్‌లో అప్‌లోడ్ చేశారు. కాలనీల్లో శిబిరాలు సైతం ఏర్పాటు చేసి సమాచారం సేకరించారు. జిల్లాలో నెలకు 200 యూనిట్ల లోపు వినియోగిస్తున్న వారే ఎక్కువ. మొత్తం రేషన్ కార్డులు 3.78 లక్షలు ఉండగా జీరో బిల్లులు 2.16 లక్షల కనెక్షన్లకు మాత్రమే జారీ అవుతుండటంతో మిగతా వినియోగదారులు నిరాశ చెందుతున్నారు.

**ప్రజాపాలన కేంద్రాల్లో సంప్రదించాలి**

శ్రీనాథ్, ఎస్ఈ, విద్యుత్తుశాఖ

గృహజ్యోతి పథకం కింద అర్హులందరికీ జీరో బిల్లులు జారీ చేస్తున్నాం. అర్హత ఉండీ బిల్లులు వస్తున్న వారికి ప్రజాపాలన కేంద్రాల్లో సంప్రదించాలని సూచిస్తున్నాం. ఎడిట్ ఆప్షన్ వచ్చినప్పుడు వివరాల నమోదుకు అవకాశం ఉంటుంది.

# పనుల హడావుడి. పర్యవేక్షణ కొరవడి!


సంగారెడ్డి : ప్రజా రవాణా సాఫీగా సాగాలనే లక్ష్యంతో చేపట్టిన జాతీయ రహదారి(ఎక్స్‌ప్రెస్ హైవే) విస్తరణ పనులు అస్తవ్యస్తంగా కొనసాగుతున్నాయనే విమర్శలొస్తున్నాయి. గుత్తేదారు నిర్లక్ష్యం.. ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల కొన్ని చోట్ల నాణ్యతలోపం తేలతెల్లమవుతోంది. పనుల వద్ద ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో.. ఆ మార్గంలో వెళుతున్న వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పాదచారులకూ ఇక్కట్లు తప్పడం లేదు. తరచూ రోడ్డు ప్రమాదాలతో పాటు.. ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది. జిల్లాలో చేపట్టిన 65వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనుల తీరిది. ఇకనైనా ఉన్నతాధికారులు దృష్టి సారించాలని పలువురు సూచిస్తున్నారు.

**రూ.800 కోట్లు మంజూరు**

సంగారెడ్డి పట్టణం పోతిరెడ్డిపల్లి కూడలి నుంచి హైదరాబాద్‌లోని మదీనాగూడ వరకు 65వ నంబరు జాతీయ రహదారి విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. ఎక్స్‌ప్రెస్ హైవే నిర్మాణానికి రూ.800 కోట్ల నిధులను కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసింది. రూ.29.35 కిలో మీటర్ల మేర పనులు చేపట్టాలని గుత్తేదారుతో ఒప్పందం చేసుకున్నారు. గతేడాది జూన్‌లో పనులను శ్రీకారం చుట్టారు. వచ్చే ఏడాది జులై 30 నాటికి పూర్తి చేయాలని లక్ష్యాన్ని నిర్దేశించారు. హైవే విస్తరణలో భాగంగా తొలుత రహదారికి ఇరువైపులా మురుగు కాల్వల నిర్మాణాలు చేపడుతున్నారు. తారు రోడ్డు పనులు కొనసాగుతున్నాయి. అధికారుల పర్యవేక్షణ లోపం వల్ల మురుగు కాల్వలు నిర్మించిన కొద్ది రోజులకే శిథిలమవుతున్నాయి. తారు పనుల్లోనూ నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదనే విమర్శలొస్తున్నాయి.

**తరచూ ప్రమాదాలు**

పనులు జరుగుతున్న చోట సరైన సూచికలు లేకపోవడంతో ఇటీవల కంది శివారులోని ప్రైవేట్ ఆసుపత్రి ఎదుట రెండు లారీలు ఢీకొన్నాయి. డ్రైవర్‌కు గాయాలయ్యాయి. ఇక్కడికి సమీపంలోనే డీజిల్ వాహనం బోల్తాపడింది. ఆటో నూతనంగా నిర్మించిన మురుగు కాల్వలో పడింది.



జాతీయ రహదారి పనుల్లో భాగంగా కందిలోని కిసాన్ సాగర్‌కు చెందిన అయిదు వరద కాల్వలను మూసివేశారు. నీరు దిగువకు వెళ్లే అవకాశం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అస్తవ్యస్తంగా చేపడుతున్న పనుల వల్ల తరచూ ట్రాఫిక్ అంతరాయం ఏర్పడుతోంది.

రహదారి విస్తరణ పనులు ఇలా..
పనులు చేపట్టాల్సిన మొత్తం కిలో మీటర్లు: 29.35
ఎడమవైపు పూర్తయిన తారు రోడ్డు పనులు: 4.75 కి.మీ.
కుడి వైపు: 1.75 కి.మీ.
ఇప్పటి వరకు నిధుల వ్యయం: రూ.20 కోట్లు

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

ఎక్స్‌ప్రెస్ హైవే విస్తరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి. మురుగు కాల్వల నిర్మాణాలకు నీటి తడులు అందిస్తున్నాం. పంట కాల్వలపై రోడ్డు నిర్మాణం విషయాన్ని రైతులు తమ దృష్టికి తీసుకొచ్చారు. కాలువలు మూసేయకుండా చర్యలు తీసుకుంటాం. వచ్చే ఏడాది జులై లోపు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటాం. రామకృష్ణ, డిప్యూటీ ఈఈ, నేషనల్ హైవే అథారిటీ.

# జలాశయంలో నీరు.. సాగు భూములకు అందని తీరు

కోనరావుపేట : మెట్ట ప్రాంతాన్ని సస్యశ్యామలం చేయటానికి గత ప్రభుత్వం కాళేశ్వరం ఎత్తిపోతల జలాశయం నిర్మాణం చేపట్టింది. దీనిలోకి మధ్యమానేరు ద్వారా గోదావరి జలాలను తరలించి తద్వారా సాగు భూములకు నీరందించాలన్నది లక్ష్యం. అయితే కాలువల నిర్మాణ పనులు అసంపూర్తిగా వదిలేయడంతో చెరువులు, కుంటలు నింపే పరిస్థితి లేదు. జిల్లాలో కోనరావుపేట మండలం మల్కపేటలో సుమారు రూ.వేయి కోట్ల వ్యయంతో కాళేశ్వరం ఎత్తిపోతల జలాశయం నిర్మాణం చేపట్టారు. ఏడాదిన్నర క్రితం రెండు పంపు మోటార్ల ట్రయల్ రన్ నిర్వహించి మధ్యమానేరు నుంచి గోదావరి జలాలను నింపారు. జలాశయం సామర్థ్యం 3 టీఎంసీలకు గాను 1 టీఎంసీ మేర నిల్వ చేశారు. ప్రస్తుతం నీరు తగ్గింది. ఇటీవల ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ జలాశయంపై దృష్టిసారించారు. నీటిపారుదల ఉన్నతాధికారులతో కలిసి జలాశయాన్ని సందర్శించారు. మాధ్యమానేరు నీటి లభ్యత ఆధారంగా ఇందులోకి నీటి తరలింపునకు చర్యలు చేపట్టాలని సూచనలు చేశారు. నీటిపారుదలశాఖ ఉన్నతాధికారులు, పంపు



మోటార్ల గుత్తేదారులు 0.2 టీఎంసీ నీటిని తరలించారు. దీంతో ప్రాజెక్టులో 1 టీఎంసీ నీరు నిల్వ ఉంది. జలాశయం దిగువ, ఎగువ ప్రాంతాల్లో భూగర్భ జలాలు పెరగనున్నాయి. దీంతో బోరుబావులకు నీరు అంది పంటల సాగుకు అవకాశం ఏర్పడింది.

**నిర్మాణం ఇలా...:** జలాశయం కుడి కాలువ సుమారు 12.03 కిలో మీటర్లు ఉంది. వేములవాడ అర్బన్ మండలం మారుపాక వరకు ఉంది. అక్కడక్కడ వదిలేయడంతో 11 కిలో మీటర్లు పనులను రెండేళ్ల క్రితం పూర్తి చేశారు. మల్కపేట ఊర చెరువు శిఖం భూములు 40 ఎకరాల్లో కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. రైతులు కాలువ తవ్వకానికి అభ్యంతరం తెలపడంతో పనులు నిలిచిపోయాయి. ః నాగారం–పల్లిమక్త మధ్య ప్రధాన రోడ్డులో కాలువ ద్వారా నీటి సరఫరాకు వంతెన నిర్మించాల్సి ఉంది.

ఎడమ కాలువ సుమారు 7 కిలో మీటర్లు కాగా భూసేకరణ పూర్తిస్థాయిలో చేపట్టలేదు. దీంతో కాలువ నిర్మాణ పనులు ప్రారంభం కాలేదు. పల్లిమక్త, సుద్దాల, మల్కపేట గ్రామాల్లోని పలు చోట్ల సీసీ నిర్మించాల్సి ఉంది.

చెరువులు నింపితే మేలు

మాది ఉమ్మడి కుటుంబం. అంతా వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నాం. మాకు 10 ఎకరాల భూమి ఉంది. కుడి కాలువ నిర్మాణంలో ఎకరం కోల్పోయ్యా. నాలుగు బోరుబావుల ద్వారా మిగిలినది యాసంగిలో వరి సాగు చేశాం. వేసవిలో భూగర్భ జలాలు అడుగంటి బోరుబావులు వట్టిపోతాయి. పంటలు చేతికందే సమయంలో ఎండిపోయే ప్రమాదం ఉంది. పాలకులు, అధికారులు స్పందించి అసంపూర్తిగా నిలిచిన కాలువలను పూర్తి చేసి చెరువులు నింపితే యాసంగి పంటలు ఎండిపోకుండా ఉంటాయి.

జిన్న అనిల్, రైతు, పల్లిమక్త

**ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం**

మల్కపేట ఊర చెరువు శిఖం భూముల్లో కాలువ నిర్మాణం చేపట్టాల్సి ఉంది. చెరువు శిఖం, ఎఫ్‌టీఎల్ (ఫుల్ ట్యాంకు లెవల్) భూములకు ప్రభుత్వం పరిహారం ఇవ్వరాదు. మల్కపేట రైతుల సమస్యను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. సమస్యను పరిష్కరిస్తే సుమారు అర కిలో మీటరు మేర కాలువ తవ్వకం చేపడితే గొలుసు కట్టు కాలువల ద్వారా సుమారు 10 చెరువులను నింపటానికి అవకాశం ఉంటుంది. వినోద్, డీఈ, మల్కపేట రిజర్వాయర్

# ఆంగ్లంపై పట్టు.. భవితకు మెట్టు

మెదక్ : ఇంటర్మీడియట్ స్థాయిలోనే విద్యార్థుల్లో ఆంగ్ల భాషా నైపుణ్యం, వ్యక్తిత్వ వికాసం పెంపొందించేందుకు ప్రభుత్వం గత ఏడాది నుంచి ఆంగ్లంలో ప్రయోగ పరీక్షకు శ్రీకారం చుట్టింది. గతేడాది ఇంటర్ ప్రథమ సంవత్సరం చదువుతున్న విద్యార్థులకు మాత్రమే ఆంగ్ల ప్రయోగ పరీక్ష ఉండగా, ఈ ఏడాది ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు సైతం పరీక్ష నిర్వహించనున్నారు. మొత్తం 80 మార్కులు థియరీకి కేటాయించగా ప్రయోగ పరీక్షలకు 20 మార్కులు కేటాయించారు. నాలుగు దశల్లో నిర్వహించే ఈ పరీక్షలో కనీసం 7 మార్కులు వస్తేనే ఉత్తీర్ణులవుతారు. గైర్హాజరైన విద్యార్థులను అనుత్తీర్ణులుగా పరిగణిస్తారు. ప్రథమ సంవత్సరం విద్యార్థులకు ఈనెల 31న, ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు ఫిబ్రవరి 1వ తేదీన నిర్వహించనుండగా అందుకోసం విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నారు.

**నాలుగు దశల్లో ..**

ఈ ఏడాది ప్రథమ, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు మొత్తం 13,401 మంది ఉన్నారు. వీరందరికీ తరగతి గదిలోనే భాషా సామర్థ్యాల పరిశీలనతో పరీక్షలు నిర్వహిస్తున్నారు. ఒక్కో దశలో నాలుగు మార్కుల చొప్పున, ప్రయోగ పరీక్షకు నాలుగు మార్కులు కలిపి మొత్తం 20 మార్కులు కేటాయించారు. మొదటి దశలో ఏదైనా ఒక అంశంపై ఇద్దరు, అంతకంటే ఎక్కువ మంది విద్యార్థులు సంభాషించుకునే తీరును అధ్యాపకులు పరీక్షిస్తున్నారు.

రెండో దశలో ఇక అంశంపై నిమిషంలోపు అనర్గళంగా మాట్లాడాల్సి ఉంటుంది. మూడో దశలో తల్లిదండ్రులు లేదా మరేదైన అంశంపై విద్యార్థులు బృందంగా చర్చించాలి.

నాలుగో దశలో గ్రహించే శక్తి పెంపొందించడంపై అధ్యాపకులు పరీక్షిస్తారు. వీటితో పాటు రికార్డు బుక్ ఉంటేనే వారి ప్రతిభ ఆధారంగా మార్కులు కేటాయిస్తారు.

30న పర్యావరణ విద్యపై..

పర్యావరణ విద్యపై అన్ని రకాల విభాగాలకు సంబంధించిన విద్యార్థులకు ఈనెల 30 తేదీన పరీక్ష నిర్వహిస్తుండగా, ఇంటర్మీడియట్‌లో 2024కు ముందు గల బ్యాక్‌లాక్ విద్యార్థులకు మాత్రమే నైతికత–మానవ విలువలు సంబంధించిన పరీక్షను ఈనెల 29న నిర్వహించనున్నారు.

మొత్తం విద్యార్థులు
ప్రథమ సంవత్సరం: 6,928
ద్వితీయ : 6,473
జిల్లాలోని కళాశాలలు: 61

ప్రతి ఒక్కరూ హాజరవ్వాలి– మాధవి, జిల్లా ఇంటర్ నోడల్ అధికారి

ఇంటర్ స్థాయి నుంచే ఆంగ్ల భాషపై విద్యార్థులు పట్టు సాధించేందుకు గత ఏడాది నుంచి విద్యాశాఖ ఆంగ్ల ప్రయోగ పరీక్షను ప్రవేశపెట్టింది. ఈ విద్యా సంవత్సరానికి సంబంధించి ఈనెల 31, ఫిబ్రవరి 1వ తేదీన రెండు విడుతల్లో ప్రయోగ పరీక్ష నిర్వహించనున్నారు. విద్యార్థులు ఆంగ్ల ప్రయోగ పరీక్షకు కచ్చితంగా హాజరుకావాలి.

# ఎవరు చూడొచ్చారులే..!

పెద్దేముల్ : దాదాపు 20 ఏళ్లుగా అంగన్‌వాడీ కేంద్రాలు కనీస సౌకర్యాల లేమితో అవస్థలు పడుతున్నాయి. ఎన్నో ప్రతిపాదనలు, అంచనాల తర్వాత ప్రభుత్వం గతేడాది సెప్టెంబరులో ఒక్కో అంగన్‌వాడీకి రూ.16,000 కేటాయించింది. రాకరాక వచ్చిన నిధులతో పనులు నాణ్యతగా చేయాల్సి ఉంది. క్షేత్రస్థాయిలో పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉంది. 'ఎవరొచ్చి చూస్తారులే' అన్న చందంగా సాగుతున్నాయి.

**జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో.. :** కలెక్టర్‌గా ప్రతీక్ జైన్ జిల్లాకు వచ్చిన తర్వాత పలు అంగన్‌వాడీ కేంద్రాలను పరిశీలించారు. వసతి సౌకర్యాలు లేక చిన్నారులు, బాలింతలు, గర్భిణులు పడుతున్న కష్టాలను గుర్తించారు. కేంద్రాలను తీర్చిదిద్దాలన్న ఉద్దేశంతో నిధులు మంజూరు చేసి పనుల బాధ్యతను ఎంపీడీవోలకు అప్పగించారు. అయితే క్షేత్రస్థాయిలో రంగులు వేయడానికి గంపగుత్తగా పనులు అప్పగించారు. కొన్ని చోట్ల గ్రామ పంచాయతీ కార్యదర్శులకు ఇచ్చేశారు. రూ.4 వేలు ఇచ్చి స్థానిక అంగన్‌వాడీ టీచర్లతో చేయించారు.



**ఇదిగో ఉదాహరణలు**

పెద్దేముల్ మండలం బండమీదిపల్లిలో అంగన్‌వాడీ కేంద్రానికి బయట రంగులు వేసి లోపల వదిలేశారు. చిన్న చిన్న పనులు చేసి లెక్కల్లో మాత్రం నిధులు మొత్తం ఖర్చు చేసినట్లు చూపించారు.

తట్టేపల్లిలో రెండు అంగన్‌వాడీ కేంద్రాల ముందు భాగంలో రంగులు వేసి నేమ్ బోర్డులు రాశారు. ఇతర పనులేమీ చేయలేదు. నిధులు మాత్రం అయిపోయాయి.

పాషాపూరులో మరుగుదొడ్డి నిర్మాణానికి గుంత తవ్వి వదిలేశారు. కిచెన్ కట్ట కోసం రూ.5 వేలు మంజూరయ్యాయి. స్థానిక అధికారుల సూచనతో అంగన్‌వాడీ టీచర్ కిచెన్ ప్లాట్‌ఫాం కట్టించారు. ఇప్పటి వరకు ఆమెకు డబ్బులు చెల్లింపు జరగలేదు.

బుద్దారంలో సగం పనులు చేసి వదిలేశారు. స్థానికులు ప్రశ్నించడంతో దిద్దుబాటు చర్యలు చేపట్టారు.

జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల వివరాలు
మొత్తం: 1,106
7 నెలల నుంచి 3 సంవత్సరాల పిల్లలు: 32,583
3 సంవత్సరాల నుంచి 6 లోపు చిన్నారులు: 18,880
గర్భిణులు: 6,258
బాలింతలు: 5,379

**పర్యవేక్షణ కొనసాగుతోంది: శ్రీలక్ష్మి, ఏసీడీపీఓ, తాండూరు**

అంగన్‌వాడీల్లో సూపర్‌వైజర్లతో పర్యవేక్షణ కొనసాగుతోంది. పనులు సక్రమంగా జరగని కేంద్రాల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా అధికారులకు నివేదిస్తున్నాం. వారి సూచనల మేరకు చర్యలు చేపడుతున్నాం.

# స్టడీ హాళ్లు ఎందుకు.. సిటీ సెంట్రల్ లైబ్రరీ ఉండగా

హైదరాబాద్ : నగరంలో ప్రముఖ గ్రంథాలయాల్లో సిటీ సెంట్రల్ లైబ్రరీ ఒకటి. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే యువత నిత్యం పెద్దసంఖ్యలో ఇక్కడకు వస్తుంటారు. గ్రంథాలయంలో పుస్తకాలు, గ్రంథాలయ సంస్థ ఉచితంగా కల్పించే సౌకర్యాలపై అవగాహన లేక చాలామంది ఉద్యోగార్థులు అద్దె చెల్లిస్తూ స్టడీ హాళ్లను ఆశ్రయిస్తున్నారు. ఉద్యోగార్థుల కోసమే కాకుండా వృద్ధులు, చిన్న పిల్లలకు సైతం ఇక్కడ ప్రత్యేక విభాగాలున్నాయి. సుమారు 2.40 లక్షల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

**అంతర్జాల సదుపాయం..** యువతీయువకులు ఉద్యోగ నోటిఫికేషన్లు చూసుకోవడానికి, వాటికి దరఖాస్తు చేసుకోవడానికి సిటీ సెంట్రల్ లైబ్రరీలో 25 కంప్యూటర్లున్నాయి. సోమవారం, రెండో శనివారం మినహా అన్నిరోజుల్లో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 వరకు గుర్తింపు కార్డు చూపించి వాడుకోవచ్చు. గంటకు రూ.5 చెల్లించాలి. : పోటీ పరీక్షల కేంద్రాలు నిర్వహించే ఆన్‌లైన్ క్లాసులు వినేందుకు ఉచిత హైస్పీడ్ వైఫై కూడా ఉంది.

**రూ.150తో సభ్యత్వం..** పుస్తకాలు అక్కడే ఉండి చదువుకోవడమే కాకుండా ఇంటికి తీసుకెళ్లి చదివే వెసులుబాటు ఉంటుంది. అందుకు రూ.150 చెల్లించి సభ్యత్వం తీసుకోవాలి. రూ.1,250 విలువ గల పోటీ పరీక్షల పుస్తకాలనూ తీసుకెళ్లి ఇంటి దగ్గరే సన్నద్ధమవొచ్చు.

**పుస్తక భాండాగారం..** ఇక్కడ మాస, వార పత్రికలు అందుబాటులో ఉన్నాయి. తత్వశాస్త్ర పుస్తకాలు, నవలలు, జీవిత చరిత్రలు, చారిత్రక, ఆధ్యాత్మిక గ్రంథాలు, వేదాలు, శాస్త్రసాంకేతిక పుస్తకాలు ఇక్కడ ఉన్నాయి. 8 భాషల దినపత్రికలు చదువుకోవచ్చు. మహిళలు, వృద్ధులు, చిన్నారులకు కేటాయించిన ప్రత్యేక ప్రదేశాల్లో ఆయా విభాగాల వారికి అవసరమైన పుస్తకాలున్నాయి.

# కరవు నేలకు.. గోదావరి జలకళ

ఆలేరు : ఆలేరు పెద్దవాగు గోదావరి జలకళ సంతరించుకుంటోంది. పది రోజుల క్రితం మల్లన్నసాగర్ నుంచి బస్వాపూర్ ప్రాజెక్టులోకి వెళ్లే కాలువ నీటిలో కొంత భాగాన్ని సిద్దిపేట జిల్లా జగదేవ్‌పూర్ మండలం పీర్లపల్లి వద్ద కాలువ ద్వారా తుర్కపల్లి మండలం గంధమల్ల చెరువులోకి వదిలారు. వారం రోజులుగా గంధమల్ల చెరువు అలుగు పోస్తుంది. అలుగు ప్రాంతం ఆలేరు వాగుకు అనుసంధానంగా ఉండటంతో ఆలేరు వాగులో గోదావరి జలాలు ప్రవహిస్తున్నాయి. ఫలితంగా వాగు పరిసర ప్రాంతాల్లో భూగర్భ జలమట్టం పెరుగుతోంది. వ్యవసాయ బావులు, బోర్ల నీటి ఊటలు పెరుగుతున్నాయి. ఈ ఏడాది సరైన వర్షాలు లేక భూగర్భ జలమట్టం పడిపోతోంది. వ్యవసాయ బావులు, బోర్లు ఎత్తిపోతున్నాయి. తాగునీటి ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. సమస్యను గుర్తించిన ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. ఈ నెలాఖరు వరకు గంధమల్ల చెరువు అలుగును పారించాలని ప్రభుత్వం ఆదేశించింది. గంధమల్ల చెరువు కింది భాగమైన రాజపేట మండలం బేగంపేట నుంచి గుండాల మండలం వరకు ఉన్న ఆలేరు(బిక్కేరు) వాగులో వివిధ చోట్ల వాగుపై నిర్మించిన చెక్‌డ్యామ్‌లు నీటితో నిండనున్నాయి. నీటి ప్రవాహం ఆలేరు పట్టణ శివారుకు చేరింది. యాసంగి పంటలకు నీటి కొరత ఉండదని, తాగునీటి సమస్య తలెత్తదని అధికారులు అంటున్నారు.

# అమ్మ భాషతో మనో వికాసం



కరీంనగర్ : మాతృభాష మాధుర్యం ఎనలేనిది. భారతీయ భాషల్లో తెలుగుకు విశిష్ట స్థానం ఉంది. అందులో ఎందరో కవులు, గ్రంథ కర్తలు అనేక రచనలు చేశారు. వారు రాసిన పద్యాలు, గద్యాలు, గేయాలు, కథలు, కవితలు మొదలైన ప్రక్రియ రచనలు భావితరాలకు అందేలా చూడాలి. అయితే నేడు ఆంగ్ల మాధ్యమ ప్రభావంతో తెలుగు రాయడంలో కొంత వెనుకబడిపోతున్నారు. కొంతమంది ఉపాధ్యాయులు, రచయితల ప్రోత్సాహంతో విద్యార్థులు, యువత అద్భుత రచనలు చేస్తున్నారు. అంతర్జాతీయ మాతృభాష దినోత్సవం సందర్భంగా తెలుగు భాషాభివృద్ధికి పాటు పడుతున్నవారిపై 'న్యూస్‌టుడే' కథనం.

మధువులొల్కు భాష
మధురమైన తెలుగు
తెలుగు భాష గూర్చి
తెలుసుకొనుముజి
మాతృభాషనెప్పుడు మరువబోకుము నీవు
భవ్యమైన మాట దివ్య నోట

ఈ పద్యాన్ని రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఏడో తరగతి విద్యార్థి పి.దివ్యజ్యోతి రాశారు.

సాహిత్య పఠనానికి సమయం

వేములవాడ పట్టణం శాత్రాజుపల్లిలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల మహిళా డిగ్రీ కళాశాలలో రీడర్స్ క్లబ్ ఏర్పాటుచేశారు. విద్యార్థుల్లో పఠనాసక్తి, సాహిత్యాభిలాష, వ్యక్తిత్వ వికాసం, పరిపక్వత పెంపొందించేందుకు ఈనెల 3న వసంత పంచమి రోజున క్లబ్‌ను కేంద్ర సాహిత్య అవార్డు గ్రహీత వారాల ఆనంద్‌చే ప్రారంభించారు. చదివిన పుస్తకాలపై సమీక్షించడం వంటివి చేస్తున్నామని ప్రిన్సిపల్ డాక్టర్ లావణ్య, ఉప ప్రిన్సిపల్ సుమలత, గ్రంథపాలకురాలు డా.శ్రీలత తెలిపారు.

**ఆత్మకథల రూపంలో..**

పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం నర్సింహులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఆత్మకథల రూపంలో రాసిన పుస్తకం తెలంగాణలో మొదటిది. పిల్లలు సృజనాత్మక శక్తికి ప్రతిరూపం ఈ 'పల్లెటూరి పిల్లగాండ్లు'. ఆ పాఠశాల తెలుగు ఉపాధ్యాయులు కందుకూరి భాస్కర్ సంపాదకత్వంలో దీనిని తీసుకొచ్చారు. గేయం, గద్యం, పద్యం మొదలగు ప్రక్రియల్లో ఉన్న పాఠ్యాంశాలను ఆత్మకథ ప్రక్రియలోకి మార్చి రాశారు. 19 మంది విద్యార్థులు రాసిన 19 ఆత్మకథలను నేడు పాఠశాలలో ఆవిష్కరించనున్నారు.

**ఆధునిక పద్ధతిలో బోధన**

పాఠం చెప్పామా.. ఇంటికి వెళ్లామా అని కాకుండా విద్యార్థుల విద్యా వికాసానికి ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు అంజయ్య కృషి చేస్తున్నారు. పాఠ్యాంశాలకు అనుగుణంగా కృత్యాలు తయారు చేయడం.. సులభంగా అర్థమయ్యేలా డిజిటల్ పాఠ్యంశాల రూపకల్పన, సాహిత్య పత్రిక నిర్వహణతోపాటు టీ-సాట్ విద్యా కార్యక్రమాల్లో డిజిటల్ తరగతులు బోధిస్తున్నారు. పలు అవార్డులు, అంతర్జాతీయ ప్రశంసా పత్రాలు అందుకున్నారు.

**సాంకేతికతను అందిపుచ్చుకోవాలి**

యూపీఐ పిన్ ద్వారా అన్ని బ్యాంకుల లావాదేవీలు జరిగినట్టే ఆయా భాషల అవుట్‌పుట్ రావాలని కోరుకుంటున్నా. దీనిపై ఈనెల 24 నుంచి 26 వరకు పారిస్‌లో జరిగే యూనెస్కో సదస్సులో మాట్లాడబోతున్నా. 'యూనిఫైడ్ లాంగ్వేజెస్ ఇంటర్‌ఫేస్' పేరుతో ఒక సాఫ్ట్‌వేర్ రూపొందించాల్సిన అవసరముంది. మన దేశంలో 700లకు పైగా భాషలు మాట్లాడుతున్నా కేవలం 22 భాషలనే ఇంటర్నెట్ అనుమతిస్తుంది. 2047 నాటికి వికసిత్ భారత్ కావాలంటే అన్ని భాషల వాళ్లను భాగస్వామ్యం చేసినప్పుడే సాధ్యమవుతుంది. ప్రొఫెసర్ డా.మల్లారెడ్డి

**ఎంబీఏ చదువుతున్న రోజుల్లోనే..**

2013-2014లో ఎంబీఏ చదువుతున్న రోజుల్లో సాహిత్యంపై మక్కువ పెరిగింది. పలు రచయితల పుస్తకాలు చదివా. పాఠశాల స్థాయిలో వ్యాసరచన పోటీల్లో బహుమతులు సాధించా. రవి కిరణాలు, ద ఫ్యూచర్ ఇన్ వెరీ బ్యాడ్, కచ్చురం, ఒక వీర జవాన్ కథ, ఆజాదికా అమృత మహోత్సవం, దేశభాషలందు తెలుగు లెస్స అనే పుస్తకాలు రాశారు. వచన కవితలు, బాలల కథలు రాస్తున్నా. సాహితీ, కళా సంస్థలు యువ కవిగా, ఉత్తమ సాహిత్య, తదితర పురస్కారాలతో సత్కరాలు అందుకున్నారు.

**సత్కారం అందుకుంటున్న రవి**

పట్టుదలతో పరిశోధన చేసి..

తెలుగు భాషపై పట్టు కోల్పోకుండా గిరిజన సంస్కృతీ సాంప్రదాయాలు అందరికీ తెలియజేయాలనుకున్నారు హుజూరాబాద్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు అంజనీదేవి. దీంతో పరిశోధనచేసి సమ్మక్క-సారలమ్మ జాతరపై మొట్టమొదటిసారిగా రాసిన 182 పేజీల పుస్తకానికి 2003లో గౌరవ డాక్టరేట్‌ను అందుకున్నారు. నేటికి భాషాభివృద్ధికి కృషి చేస్తున్నందుకుగానూ.. భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో నేడు రవీంద్రభారతిలో అవార్డును అందుకోనున్నారు. కాంతి కిరణాలు, అంజనమ్మ శతకం లాంటి కవితా సంపుటిలతో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సైతం అవార్డులు అందుకున్నారు. హుజూరాబాద్

# చెరువుల్లో నిర్మాణాలకు రైతుబంధు



మల్యాల : మండలంలోని పలు గ్రామాల పరిధిలోని చెరువుల్లో అక్రమ నిర్మాణాలు జరిగినప్పటికీ.. ఆ స్థలాలను వ్యవసాయ భూములుగా పేర్కొంటూ గతంలో రైతుబంధు నిధులు పొందినట్లు రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. మండలంలోని సూరప్ప, మల్యాల చెరువులతో పాటు ముత్యంపేట శివారులోని భీమన్న, తుమ్మల చెరువు, రాజారం శివారులోని కుంటలో పలు నిర్మాణాలకు అధికారులు అనుమతులు ఇవ్వడం విశేషం. వర్షాకాలంలో చెరువు పూర్తిగా నిండితే ఏ స్థాయిలో నీరు నిలువ ఉంటుందో ఆ స్థాయిని ఎఫ్‌టీఎల్‌గా పేర్కొంటారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదన్న నిబంధనలు ఉన్నప్పటికీ అధికారులు ఏళ్ల కిందట నుంచి ఇళ్లు, భవన నిర్మాణాలకు అనుమతులు ఇవ్వడం ప్రస్తుతం పెద్ద సమస్యగా మారింది.

మండలంలోని 19 గ్రామాల పరిధిలో వ్యవసాయయోగ్యంకాని దాదాపు 687 ఎకరాల భూములకు గతంలో రైతుబంధు పొందినట్లు గుర్తించి ఆయా భూముల సర్వే నంబర్లవారీగా ఉన్నతాధికారులకు నివేదిక అందజేసినట్లు తహసీల్దారు మునిందర్ తెలిపారు. వాటిలో చెరువుల్లోని ఎఫ్‌టీఎల్, వ్యవసాయేతర భూములు కూడా ఉన్నట్లు వివరించారు. మల్యాల, సూరప్ప చెరువుల్లోనూ వ్యవసాయయోగ్యం కాని భూములకు రైతుబంధు పొందినట్లు పేర్కొన్నారు. ఇప్పటికీ పలు చెరువుల పరిధిలో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వ్యక్తులు తమ వ్యవసాయ భూములను ఇళ్లపట్టాలుగా విక్రయించగా వాటిలో పలువురు ఇళ్లు నిర్మించుకున్నప్పటికీ సదరు భూములను వ్యవసాయేతర భూములుగా రెవెన్యూ రికార్డుల్లో మార్చకపోవడంతో రైతుబంధు పొందారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణాలు చేపట్టేవారికి ఓ శాఖకు చెందిన సిబ్బంది నామమాత్రంగా నోటీసులు జారీచేసి వారి నుంచి అందినకాడికి దండుకొని వెళ్తున్నట్లు సమాచారం.

# అభివృద్ధి పనులు వేగవంతం

గోదావరిఖని : రామగుండం నగరపాలక ప్రాంతంలో వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్, మేదరిబస్తీ, కల్యాణ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతమయ్యాయి. సుమారుగా మూడు నెలలుగా కూల్చివేతలు, రహదారుల విస్తరణతో ఆయా ప్రాంతాల్లో అస్తవ్యస్త పరిస్థితులు నెలకొనగా వ్యాపారాలు నిలిచిపోయాయి. వ్యాపారాలు నడవక ఇబ్బంది పడ్డప్పటికీ అభివృద్ధి పనులకు వ్యాపారులు సహకరిస్తున్నారు. ఎమ్మెల్యే చొరవతో రామగుండం ప్రాంతాభివృద్ధికి టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.100 కోట్లు కేటాయించగా.. అందులో రూ.29.5 కోట్లు లక్ష్మీనగర్, మేదరిబస్తీ, కల్యాణ్‌నగర్ తదితర ప్రాంతాలకు కేటాయించారు. ఆయా ప్రాంతాల్లో భూగర్భ మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్ల నిర్మాణ పనులు దాదాపుగా పూర్తికాగా కల్యాణ్‌నగర్ నుంచి లక్ష్మీనగర్ వైపు రహదారి నిర్మాణం పనులు మొదలయ్యాయి. నగరపాలక ఇన్‌ఛార్జి కమిషనర్, జిల్లా అదనపు కలెక్టర్ నిరంతరంగా ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులను సమీక్షిస్తూ వేగవంతం చేస్తున్నారు.

**రూ.29.5 కోట్లు.. వివిధ పనులు**

నగరంలోని ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీనగర్, మేదరిబస్తీ, కల్యాణ్‌నగర్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనులు చేపట్టేందుకు టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.29.5 కోట్లు కేటాయించారు. అంచనాల ప్రకారంగా రహదారుల నిర్మాణం, భూగర్భ, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు, కేంద్రీకృత విద్యుత్తు దీపాల ఏర్పాటు తదితర విభాగాలుగా నిధులు కేటాయించి పనులు వేగవంతం చేశారు. లక్ష్మీనగర్ ప్రాంతంలో భూగర్భ మురుగు కాలువ నిర్మాణంతో మొదలైన పనులు మిగతా వ్యాపార కేంద్రాల్లోనూ సాగుతున్నాయి. రహదారికి ఇరువైపులా తాగునీటి పైపులైన్లు



వేయడంతో పాటు కనెక్షన్లు ఇస్తున్నారు. భూగర్భ మురుగు కాలువలు, తాగునీటి పైపులైన్ల ఏర్పాటు పనులు పూర్తయ్యాయి. కల్యాణ్‌నగర్ కూడలి నుంచి లక్ష్మీనగర్ వైపునకు రహదారి నిర్మాణం పనులు మొదలుపెట్టారు. రహదారుల నిర్మాణం పూర్తయితే నాలుగైదు నెలలుగా జరగని వ్యాపారాలు పుంజుకునే అవకాశముంది.

కేటాయించిన నిధులు (రూ.కోట్లలో)
భూగర్భ మురుగు కాలువలు: 10
విద్యుత్తు స్తంభాల ఏర్పాటు: 7.5
రహదారుల నిర్మాణం: 12

# తవ్వింది మట్టి.. లెక్కల్లో రాళ్లు!

కరీంనగర్ : మట్టిని రాయిగా చేయగలుగుతామా.. సాధ్యం కాదు.. కానీ గుత్తేదారులు తలుచుకుంటే నిజమేనని అనిపిస్తోంది.. లేని పనికి ఉన్నట్లుగా కనికట్టు చేసి 'తవ్వింది మట్టి.. లెక్కకు రాళ్ళ'గానే రాయాలని ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకటెండ్రు రూ.లక్షలు కాదు.. పాతిక లక్షలు బల్దియా సొమ్ము దండుకునేందుకు వ్యూహం రచించారు. కరీంనగర్ నగర పాలక సంస్థ పరిధిలోని కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణ పనులను ఆరు నెలల కిందట ప్రారంభించారు. స్మార్ట్‌సిటీ కింద రూ.10 కోట్లు కేటాయించారు. మొదట పాత రేకుల షెడ్డు కూల్చివేశారు. ఆ తర్వాత కింది అంతస్తు కోసం భారీగా మట్టి తీశారు. పునాదులు తవ్వి ఫిల్లర్ల దశలో పనులు కొనసాగుతున్నాయి. ఈ పనులు జరుగుతుండగా ఎప్పటికప్పుడు రికార్డు చేసుకోవడం తప్పనిసరి. నగరపాలక ఇంజినీరింగ్ అధికారులతోపాటు పీఎంసీ, గుత్తేదారుల తరఫున ఏజెన్సీ పర్యవేక్షణ చేసి ఏ పని ఎంత మంది జరిగిందే వివరాలను నమోదు చేసుకోవాల్సి ఉంటుంది.

**తవ్వితే చాలు.. అంచనాలు మారడమే..**

రెండేళ్ల కిందట వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో సమీకృత మార్కెట్ నిర్మాణ పనులు ప్రారంభించగా ఆ సమయంలో అక్కడా తవ్వడం ప్రారంభించారు. కొంతమేర గుట్ట వచ్చినట్లుగా చెబుతుండగా దీనిని అంచనాలకు మించి రికార్డు చేసుకోవడం, ఎంబీ పుస్తకం ఇప్పటికీ దొరకకపోవడం చరిత్రగా మారింది. దీనిపై పలువురు విజిలెన్స్‌తో పాటు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశారు. బిల్లులు రాకపోవడంతో తుది దశలో పనులకు ఆగిపోయాయి. ప్రస్తుతం కశ్మీర్‌గడ్డ మార్కెట్ పనుల కోసం తవ్వగా అదే పరిస్థితిలో వాస్తవ పరిస్థితిని పరిగణనలోకి తీసుకోకుండా బిల్లులు రికార్డు చేసుకోవడానికి తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మొదట్లోనే తొలగించిన రేకులు బల్దియాకు అప్పగించలేదని



తేలడంతో అప్పటి కమిషనర్ రికవరీ చేయించారు.

**గట్టి భూమి.. కాదు బండ..**

కశ్మీర్‌గడ్డ సమీకృత మార్కెట్ నిర్మాణం తవ్వే సమయంలో గట్టి భూమి(హార్డ్ సాయిల్) వచ్చింది. తవ్వడంలో కాస్తా అధిక సమయం పట్టడంతో సంబంధిత ఏజెన్సీ నిర్వాహకులు రాక్ కట్టింగ్ చేసినట్లుగా రాసుకున్నారు. సుమారు 200-300 క్యూబిక్ మీటర్లుగా నమోదు చేసుకున్నట్లు తెలుస్తోంది. దీనిని బిల్లుగా రికార్డు చేసుకునేందుకు కసరత్తు చేశారు. ఒకరిద్దరు అధికారులను కలిసి ఒప్పందం కుదుర్చుకున్నారనే ప్రచారం జరుగుతోంది. ఇంకేముంది ఎంబీ రికార్డు చేయాలని మరో ఇద్దరు ఇంజినీరింగ్ అధికారులపై ఒత్తిడి పెంచారు. ఇక్కడి నుంచి బదిలీపై వెళ్లిన ఉన్నతాధికారికి తెలియకుండా అప్పటి అధికారి సమయంలో పనులు జరిగాయని సంతకం చేయించేందుకు కూడా సిద్ధమయ్యారు. అయితే బిల్లులో ఏముందని పరిశీలిస్తే రాక్(రాయి) తొలగించినట్లుగా పేర్కొంటూ సుమారు రూ.22 లక్షలకు కాగితంపై రికార్డు చేశారు. అక్కడ రాయి ఎక్కడి నుంచి వచ్చిందో చెప్పాలని పట్టుబడటంతో బెదిరింపులు మొదలయ్యాయి. అయినప్పటికీ ఎంబీలో గట్టి భూమి తప్ప రాయి అని రాసేదీ లేదంటూ తేల్చి చెబుతున్నట్లు సమాచారం.

**ఉదాసీనంగా ఉంటే రూ.లక్షలు స్వాహా**

గుత్తేదారులు రాసిందే లెక్క అన్నట్లుగా ఇంజినీరింగ్ అధికారులు పట్టించుకోకుండా ఉంటే కమీషన్ల చాటున అక్రమాలకు తావిచ్చినట్లుగా ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. కొందరు తిమ్మిని బమ్మిని చేస్తుండటం, అంచనాలకు మించి బిల్లులు రికార్డు చేయడంపై ఇటీవల తీవ్ర విమర్శలు వచ్చాయి. ఇప్పటికైనా అధికారులు పరిశీలించి ఎంబీలు రికార్డు చేస్తే అక్రమాలకు కళ్లెం పడనుంది.

**అనుమానం వచ్చి తనిఖీకి ఆదేశించాం**

అలాంటిది ఏమి లేదు. సదరు ఏఈకి అనుమానం రావడంతో సమగ్రంగా తనిఖీ చేయాలని ఆదేశించాం. కాగితంపై రికార్డు చేసుకున్నారు. ఎంబీ రికార్డు కాలేదు. స్మార్ట్‌సిటీ ఏజెన్సీ దగ్గర అన్ని వివరాలు ఉన్నాయి. పూర్తి స్థాయి పరిశీలన ఉంటుంది. చాహత్ బాజ్‌పాయ్, కమిషనర్, కరీంనగర్ నగరపాలిక

# ఉర్సుకు వేళాయె..!

నేరేడుచర్ల : జాన్‌పహాడ్ దర్గా ఉర్సును ఈ నెల 23, 24, 25 తేదీల్లో నిర్వహించేందుకు అధికార యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసింది. 23 తెల్లవారుజామున 3 నుంచి 5 గంటల మధ్య గుసుల్ ఏ షరీఫ్ అనంతరం గంధంతో అలంకరణ, కొత్త దట్టీల ఏర్పాటు, పూల అలంకరణతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. 24న జరిగే కీలక ఘట్టమైన గంధం ఊరేగింపులో గుర్రం ప్రధాన ఆకర్షణ. హైదరాబాద్ నుంచి తెచ్చిన గంధం, ముజావర్ ఇంటివద్ద నుంచి తెచ్చిన గంధాన్ని ఊరేగింపుగా సాండల్ ఖానా వద్దకు తీసుకువచ్చి ప్రార్థనల అనంతరం భారీ పోలీసు బందోబస్తుతో ఊరేగింపుగా జాన్‌పహాడ్ కల్మెడతండా, చెర్వుతండాల దాకా, మధ్యాహ్నం రెండు గంటల ప్రాంతంలో దర్గాకి తీసుకువస్తారు. 25న దీపారాధనతో ఉత్సవాలు ముగుస్తాయి. రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ సయ్యద్ హజ్మతుల్లా హుస్సేని హాజరయ్యే అవకాశం ఉంది.

**ప్రతి శుక్రవారం వేల సంఖ్యలో భక్తులు** సయ్యద్ మొహియిద్దీన్‌షా ఉరఫ్ జాన్‌పాక్ షహీద్ ఇస్లాం మతవ్యాప్తి చేస్తూ ఇక్కడ అమరుడయ్యాడని చెబుతారు. అతడితో పాటు అతడి అనుచరుల సమాధులు సైతం దర్గా లోపల, పక్కన దర్శనమిస్తాయి. దర్గా పరిసరాల్లోని సఫాయి బావి నీరు పవిత్రమైందిగా భావించి ఆ నీటితో స్నానాలు చేయడానికి భక్తులు ఇష్టపడతారు. పిల్లలు లేని వారు జాన్‌పహాడ్ సైదులుకి మొక్కి, సంతానం కలిగిన తర్వాత ఆయన పేరే పెడుతుంటారు. ప్రతి శుక్రవారం వేల సంఖ్యలో భక్తులు వచ్చి తలనీలాలు సమర్పించి, మొక్కులు చెల్లిస్తారు. ఉర్సు నిర్వహణకు ఈ ఏడాది రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ రూ.30 లక్షలు విడుదల చేశారు. దీనికి తోడు మంత్రి రూ.1.14 కోట్లు అభివృద్ధి పనుల కోసం మంజూరు చేయడంతో దర్గా ఆవరణలో, మసీదు ప్రాంతంలో పనులు చేపట్టారు. పోలీసు శాఖ 500 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేస్తోంది. నిఘా కోసం దర్గా వద్ద 16 సీసీ కెమెరాలు ఉండగా మరో 20 ఏర్పాటు చేస్తున్నట్లు ఎస్సై లక్ష్మీనర్సయ్య తెలిపారు. నేరేడుచర్ల మీదుగా భక్తుల రద్దీని బట్టి కోదాడ డిపో నుంచి 15-20, సూర్యాపేట డిపో నుంచి 3 బస్సులు నడుపుతామని కోదాడ డిపో మేనేజర్ శ్రీహర్ష తెలిపారు. మిర్యాలగూడ డిపో నుంచి దామరచర్ల మీదుగా 15-20 బస్సులు నడపనున్నట్లు డిపో మేనేజర్ రామ్మోహన్‌రెడ్డి తెలిపారు.

# వడపోద్దాం.. వాడేద్దాం

హైదరాబాద్ : నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లో శుద్ధి చేసిన మురుగునీరు పునర్వినియోగంతో నీటి కొరతకు కొంతమేర పరిష్కారం చూపేందుకు జలమండలి కార్యాచరణను సిద్ధం చేసింది. బల్దియాలో నీటి అవసరాలు పెరుగుతుండటంతో ప్రత్యామ్నాయాల వైపు దృష్టిసారిస్తోంది. నగరంలోని గేటెడ్ కమ్యూనిటీల్లోని మురుగునీటి శుద్ధి కేంద్రాలు(ఎస్టీపీ)ల నిర్వహణను ప్రత్యేకంగా పరిశీలించనుంది. వీటిని నిబంధనల ప్రకారం ఏర్పాటు చేసుకోవడంతో పాటు మురుగుజలాలను శుద్ధి చేసి వాటిని తాగునీటికి కాకుండా ఇతర అవసరాలకు ఉపయోగించుకోవాల్సి ఉంది. ప్రాథమిక అంచనాల ప్రకారం ఇలాంటి ఎస్టీపీలు నగరంలో వెయ్యిదాకా ఉన్నట్లు జలమండలి గుర్తించింది. ఇవి పనిచేస్తున్నాయా? లేదా? పని చేస్తే ఏ ప్రమాణాల మేర శుద్ధి చేస్తున్నారు? ఆ నీటిని వినియోగిస్తున్నారా? లేదా? అనే అంశాలు పరిశీలించనుంది.

**పనితీరు మదింపు**



నగరంలోని ప్రైవేటు ఎస్టీపీలను గుర్తించి డేటాను రూపొందించడంతో పాటు వాటి పనితీరును థర్డ్‌పార్టీతో మదింపు చేసేందుకు జలమండలి రంగం సిద్ధం చేసింది. వందశాతం నిబంధల మేరకు నిర్వహించాలని జలమండలి ఇప్పటికే గేటెడ్ కమ్యూనిటీలను ఆదేశించింది. ఆస్కి లేదా ఈపీటీటీఆర్ఐ వంటి సంస్థలతో ప్రైవేటు ఎస్టీపీలను మదింపు చేయనున్నారు. నిబంధనల మేరకు లేని గేటెడ్ కమ్యూనిటీలపై చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే జరిమానా విధించాలని జలమండలి భావిస్తోంది.

**50 శాతం రాయితీ..**

కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి (సీపీసీబీ) నిబంధనల మేరకు శుద్ధి చేసిన మురుగునీటి జలాలను కనీసం 50 శాతం పునర్వినియోగించుకోవాలి. ఇటీవల జలమండలి ఎండీ కె.అశోక్‌రెడ్డి నగరంలోని బిల్డర్లతో సమావేశమైనప్పుడు గేటెడ్ కమ్యూనిటీల్లోని ఎస్టీపీల నిర్వహణపై ప్రత్యేకంగా చర్చించారు. నిర్వహణ, మురుగునీటి శుద్ధి ప్రమాణాలను జలమండలి పర్యవేక్షిస్తుందని స్పష్టం చేశారు. పూర్తి స్థాయిలో ఎస్టీపీలను ఏర్పాటు చేసుకున్నవారికి సీవరేజీ ఛార్జీల్లో 50 శాతం దాకా రాయితీ ఇవ్వనున్నారు.

# అభయహస్తంపై ఆశలు

పెద్దపల్లి : కొన్నేళ్లుగా నిలిచిపోయిన అభయ హస్తం సొమ్ము చెల్లించనున్నట్లు ప్రభుత్వం చేసిన ప్రకటన ఖాతాదారులకు ఊరట కలిగిస్తోంది. ఈ మేరకు ఏళ్ల తరబడి నిరీక్షిస్తున్న స్వయం సహాయక మహిళలకు ఇబ్బందులు తీరనున్నాయి. నెలాఖారులోపు అర్హుల ఖాతాలో డబ్బులు జమ చేసేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. దీనికి సంబంధించి పేదరిక నిర్మూలన సంస్థ(సెర్ప్) ఆధ్వర్యంలో గ్రామాల వారీగా లబ్ధిదారుల జాబితా రూపొందించనున్నారు. దశాబ్ద కాలం తర్వాత మహిళలు పొదుపు చేసిన సొమ్ము తిరిగి జమ కానుండటంతో హర్షం వ్యక్తమవుతోంది.

**పింఛను.. ఉపకార వేతనాలు**

స్వశక్తి సంఘాల సభ్యుల కుటుంబాలకు ఆర్థికంగా అండగా నిలిచేందుకు 2009లో అప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని ప్రవేశపెట్టింది. సంఘంలో చేరిన ప్రతి మహిళ ఏడాదికి రూ.365 చొప్పున ప్రీమియం చెల్లిస్తే ప్రభుత్వం మరికొంత నగదు జమచేసేది. 60 ఏళ్లు దాటిన మహిళలకు ప్రతి నెలా రూ.500 పింఛను చెల్లించాలన్నది లక్ష్యం. అలాగే కుటుంబంలో 9, 10 తరగతులు, ఇంటర్, ఐటీఐ చదివే విద్యార్థులు ఉంటే ఏడాదికి రూ.1200 చొప్పున ఇద్దరు పిల్లలకు ఉపకార వేతనాలు అందించేవారు. అభయ హస్తం



లబ్ధిదారులు సహజ మరణం పొందితే రూ.30 వేలు, ప్రమాదవశావత్తు మరణిస్తే రూ.70 వేల పరిహారాన్ని కుటుంబాలకు అందించేవారు.

**పదేళ్లుగా నిరీక్షణ**

2014లో రాష్ట్ర పునర్విభజన తర్వాత అధికారంలోకి వచ్చిన తెరాస ప్రభుత్వం అభయహస్తం పథకాన్ని నిలిపివేసింది. ఆసరా పథకాన్ని ప్రారంభించి పింఛను సొమ్ము రెట్టింపు చేసింది. అంతకుముందు అభయహస్తం పథకానికి పదేళ్ల పాటు కట్టిన డబ్బులు తిరిగి చెల్లిస్తామని పలుమార్లు చెప్పినా కార్యరూపం దాల్చలేదు. 60 ఏళ్లు దాటిన మహిళల్లో చాలా మందికి అటు ఆసరా, ఇటు అభయహస్తం సొమ్ము అందకపోవడంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. జీవిత చరమాంకంలో ఆర్థిక భరోసా ఇస్తుందని ఆశించిన మహిళలు నిరాశకు గురవుతున్నారు.

**మొత్తం 3,34,232 మంది**

ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో 3,34,232 మంది మహిళలు అభయహస్తం పథకానికి ప్రీమియం సొమ్ము చెల్లించారు. వీరిలో ఎంతమంది 60 ఏళ్లు పైబడి ఉన్నారో క్షేత్ర స్థాయిలో సెర్ప్ అధికారులు తేల్చనున్నారు. మృతుల పేర్లను జాబితా నుంచి తొలగించి, గ్రామాల వారీగా వివరాలు సేకరించనున్నారు. ఈ మేరకు అర్హుల లెక్క తేలనుంది. స్వశక్తి సంఘాల్లోని మహిళల ఆధార్, బ్యాంకు ఖాతాల వివరాలు తీసుకొని ప్రభుత్వానికి నివేదించనున్నారు. గతంలో మాదిరిగానే పిల్లలకు ఉపకార వేతనాలు అందనున్నాయి.నాలుగేళ్లు క్రమం తప్పకుండా చెల్లించా..మా సంఘంలో నాలుగేళ్లు క్రమం తప్పకుండా ఏడాదికి రూ.365 చొప్పున చెల్లించా. నాకు 60 ఏళ్లు దాటడంతో అభయహస్తం పింఛన్ కోసం ఎదురుచూస్తున్నా. మంజూరుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.కనకమ్మ, కమాన్‌పూర్ మండలం

# భద్రతతోనే భరోసా.. భవిత



హైదరాబాద్: అల్వాల్‌కు చెందిన ఓ మహిళ డబ్బు కోసం సొంత కూతుర్ని వ్యభిచార కూపంలోకి దింపాలని పథకం వేసింది. తల్లి వేధింపులు ఎక్కువవడంతో బాలిక ఇంటి నుంచి పారిపోయి పోలీసుల్ని ఆశ్రయించింది. తల్లిని అరెస్టు చేశారు.మియాపూర్ బాలికకు ఇన్‌స్టాగ్రామ్‌లో పరిచయమైన ఒకడు స్నేహం పేరుతో దగ్గరై పెళ్లి చేసుకుంటానని చెప్పి శారీరక అవసరం తీర్చుకున్నాడు. బాలిక పెళ్లి చేసుకోమంటే చంపి మృతదేహాన్ని శివారులో పారేశాడు. ఇంటి పక్కన ఆరేళ్ల బాలిక మీద కన్నేసిన ఓ యువకుడు ఎవరూ లేని సమయం చూసి లైంగిక దాడికి పాల్పడ్డాడు. బాలిక గట్టిగా కేకలు వేయడంతో పారిపోయి చివరకు పోలీసులకు చిక్కాడు.బాలికలపై జరుగుతున్న ఘోరాలకు మచ్చుతునకలీ ఘటనలు. ఓవైపు కిశోర బాలికల అభ్యున్నతికి ఎన్నో కార్యక్రమాలు చేపడుతున్నా.. చట్టపరంగా ఎన్నో రక్షణలున్నా దారుణాలు కొనసాగుతూనే ఉన్నాయి. ముఖ్యంగా బాలికల అమాయకత్వం ఆసరాగా ఎక్కువ నేరాలు జరుగుతున్నాయి. స్నేహం, ప్రేమ పేరుతో ముగ్గులోకి దించుతున్న నేరగాళ్లు అవసరం తీరాక దారుణాలకు తెగబడుతున్నారు. రాష్ట్రంలో గతేడాది నమోదైన అత్యాచార కేసుల్లో 69 శాతం 18 ఏళ్లలోపు బాలికలే బాధితులు. శుక్రవారం జాతీయ బాలికా దినోత్సవం నేపథ్యంలో వారి సంరక్షణకు పోలీసులు, నిపుణులు జాగ్రత్తలు సూచిస్తున్నారు.

**బాలికలూ.. ఈ జాగ్రత్తలు ముఖ్యం**

యుక్త వయసులో ఎక్కువ మంది ఇన్‌స్టాగ్రామ్, స్నాప్‌చాట్, ఫేస్‌బుక్ వాడుతుంటారు. వాటిల్లో వ్యక్తిగత ఫొటోలు పెట్టొద్దు.కళాశాలలో, పాఠశాలలో ఎవరైనా అసభ్యంగా ప్రవర్తించినా, సామాజిక మాధ్యమాల్లో వేధింపులు ఎదురైనా ఉపాధ్యాయులకు, తల్లిదండ్రులకు చెప్పాలి.

కొందరు విపరీతంగా డబ్బు ఖర్చు చేస్తూ అడిగినవి తెచ్చిపెడుతూ ముగ్గులోకి దించుతారు. ఇలాంటివి మోసమని గుర్తించాలి.

కొత్తగా స్నేహం, డేటింగ్ యాప్‌లు వస్తున్నాయి. వాటి ద్వారా సరదా కోసమని అపరిచితులతో స్నేహం చేయొద్దు.

**తల్లిదండ్రులూ.. స్నేహంగా మెలగండి**

బాలికలకు చిన్నతనం నుంచే మంచి, చెడు స్పర్శ (గుడ్ టచ్, బ్యాడ్ టచ్)లు, ఇతరులతో ప్రవర్తించాల్సిన పరిమితుల గురించి స్పష్టంగా చెప్పాలి. అపరిచితులు, తెలిసినవారు, సొంత కుటుంబ సభ్యులైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే చెప్పేలా ప్రోత్సహించాలి.

పిల్లలతో తల్లిదండ్రులు స్నేహితుల్లా ప్రవర్తిస్తేనే వారు మనసులో మాట బయటపెడతారు. మంచి, చెడు ఏం చెప్పినా సావధానంగా వినాలి. దారి తప్పుతున్నట్లు తెలిస్తే కటువుగా కాకుండా దుష్పరిణామాలు వివరిస్తూ నచ్చజెప్పాలి.పాఠశాల, కళాశాలలో వేధింపులు ఎదురైనప్పుడు ఇంట్లో చెబితే ఏం జరుగుతుందోనని భయంతో 60 శాతం మంది పిల్లలు మిన్నకుండిపోతారు. ఆ తర్వాత పరిస్థితి శ్రుతి మించి అనర్థాలకు దారి తీస్తుంది. అందుకే ఎవరైనా ప్రేమ, స్నేహం పేరుతో పరిచయమైనప్పుడు తల్లిదండ్రులకు నిర్భయంగా చెప్పేలా ప్రోత్సహించాలి. హాస్టల్‌లో ఉండి చదువుతున్న వారిని వీలైనప్పుడల్లా వెళ్లి కలిసి వారి మనోగతాన్ని తెలుసుకోవాలి. వారు అక్కడ ఎలా ఉంటున్నారో తెలుసుకోవాలి. స్మార్ట్ ఫోన్లలో ఏం చేస్తున్నారు.. సామాజిక మాధ్యమాల్లో ఎవరెవరితో మాట్లాడుతున్నారో గమనించాలి. హద్దు మీరినట్లు తెలిస్తే పరిమితులేంటో చెప్పాలి.

# బాలలతో పని చేయిస్తే తప్పదు కేసు



కరీంనగర్ : హుజూరాబాద్‌లోని రంగాపూర్‌లో ఇటుక బట్టీలో ఆపరేషన్ స్మైల్ బృందం తనిఖీలు చేయగా.. అక్కడ ఓ బాలుడు(15) పని చేస్తూ కనిపించాడు. వివరాలు తెలుసుకొని.. బాలుడితో కఠినమైన పనిచేయిస్తున్న నిర్వాహకుడిపై కేసు నమోదు చేయించారు.కరీంనగర్‌లోని కమాన్ సమీపంలో ఓ హోటల్‌లో రాజస్థాన్‌కు చెందిన బాల కార్మికుడు(14) ఉన్నట్లు సమాచారం మేరకు బృందం తనిఖీ చేసి నిర్వాహకుడిపై కేసు నమోదు చేయించింది.

**ఎంతోమందిలో వెలుగునింపి..**

తప్పిపోయినవారు, భిక్షాటన చేసే పిల్లలను గుర్తించి.. అనాథ పిల్లలను శిశు రక్షణ కేంద్రాల్లో చేర్పిస్తారు. మరికొందరిని వారి తల్లిదండ్రుల దరికి చేర్చడంతోపాటు చదివించేందుకు బాలల సంక్షేమ సమితి సహకారంతో పోలీసుశాఖ ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఆపరేషన్ స్మైల్ కార్యక్రమం ఎంతోమంది జీవితాల్లో వెలుగులు నింపింది.

**ఏటా జనవరిలో..**

2015 నుంచి ఏటా జనవరి 1 నుంచి 31 వరకు ఈ కార్యక్రమం కొనసాగుతోంది. పోలీసుశాఖ, మహిళా శిశు సంక్షేమ, కార్మిక శాఖలు సంయుక్తంగా ఈ ఆపరేషన్ చేపడతారు. ఈ నెలలో జిల్లాలో మూడు బృందాలు 23 మంది పిల్లలను గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించారు. వారితో పని చేయించిన యజమానులపై కేసులు నమోదు చేశారు.

**ప్రధాన ఉద్దేశం**

లైంగిక దాడుల నుంచి విముక్తి, మానవ అక్రమ రవాణా నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు, మత్తుకు బానిసయ్యే వారిని సమాజంలో కలిపి బాధ్యతాయుతంగా మెదిలేలా చేయడంతోపాటు వారికి నాణ్యమైన విద్య అందించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశం. 18 ఏళ్ల వరకు ఉచిత విద్య, సంరక్షణ కల్పించనున్నారు. తల్లిదండ్రుల వద్దకు పంపిన పిల్లలు చదువుకుంటున్నారా లేదా అని సభ్యులు ఆరా తీస్తారు.

**ఆపరేషన్ స్మైల్ బృందం సభ్యులు వీరే..**

కరీంనగర్ పోలీస్ కమిషనర్ పర్యవేక్షణలో కరీంనగర్ అర్బన్, కరీంనగర్ రూరల్, హుజూరాబాద్ ఒక్కో డివిజన్‌లో ఒక ఎస్సై, ముగ్గురు కానిస్టేబుళ్లు (ఒక మహిళ, ఇద్దరు పురుషులు), ముగ్గురు ఎస్సైలు, 9 మంది కానిస్టేబుళ్లు, కార్మికశాఖ అధికారి, బాలల పరిరక్షణ సమితి ఉద్యోగి, చైల్డ్ హెల్ప్‌లైన్ ప్రతినిధి ఆపరేషన్ స్మైల్ బృందంలో ఉంటారు. స్థానిక స్వచ్ఛంద సంస్థల ప్రతినిధుల సహాయం తీసుకుంటూ బాలలను గుర్తిస్తారు. ఇలా డివిజన్ల వారీగా గుర్తించిన పిల్లలను బాలల పరిరక్షణ సమితి ఎదుట హాజరుపరిచి బాలల సంరక్షణ సమితి సభ్యులు కౌన్సెలింగ్ నిర్వహించి తల్లిదండ్రులకు అప్పగించారు. ఎవరూ లేని పిల్లలను శిశు రక్షణ కేంద్రాల్లో చేర్పించారు. తల్లిదండ్రుల వద్దకు పంపిన పిల్లలు చదువుకుంటున్నారా.. ఎలా చదువుతున్నారని సమితి సభ్యులు పర్యవేక్షిస్తారు.

**కేసుతోపాటు జరిమానా**

18 ఏళ్లలోపు పిల్లలను పనిలో చేర్చుకుంటే యజమానులపై కేసు, రూ.25 వేల జరిమానా విధిస్తాం. బడి ఈడు పిల్లలు పాఠశాలలో ఉండేలా తల్లిదండ్రులు బాధ్యత వహించాలి. బలవంతంగా పిల్లలను పనిలో చేర్పిస్తే తల్లిదండ్రులు సైతం శిక్షార్హులు అవుతారు. కె.సబితా కుమారి, జిల్లా సంక్షేమ అధికారి

**బాలల రక్షణకు 1098 హెల్ప్‌లైన్**బాల కార్మికుల గుర్తిస్తే 1098కి సమాచారం అందించండి. సమాచా రం ఇచ్చినవారి పేరు గోప్యంగా ఉంచుతాం. సొంత దుకాణాల్లోనూ పాఠశాల సమయంలో బాలలు పని చేయకూడదు. తల్లిదండ్రులే పూర్తి బాధ్యత వహించాలి.సంపత్, చైల్డ్ హెల్ప్‌లైన్ కోఆర్డినేటర్

# పొలం దారి.. ఇక రహదారి



వికారాబాద్ : జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలు చేసే దిశగా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. ఈక్రమంలోనే నిరంతరం చేసే పనులకు బదులుగా ఈ ఆర్థిక సంవత్సరంలో ప్రధానంగా ప్రజోపయోగకరమైన పనులు చేపట్టాలని భావించింది. ఇందుకోసం గ్రామాల వారీగా ప్రత్యేక పనులను గుర్తించి అమలుకు శ్రీకారం చుట్టింది. వ్యవసాయ పొలాలకు దారులను ఏర్పాటు చేయడం ద్వారా అన్నదాతలకు బాసటగా ఉండాలన్నది లక్ష్యంగా పెట్టుకుంది. ఇందులో భాగంగా జిల్లాకు రూ.2.54 కోట్లను మంజూరు చేశారు.

**మండలానికి ఐదు కి.మీ చొప్పున**జిల్లా వ్యవసాయాధారిత ప్రాంతం కావడం, ప్రధానంగా సన్న,చిన్నకారు రైతులే అధికంగా ఉండటం, చిన్న చిన్న కమతాలు కావడంతో పొలాలకు వెళ్లేందుకు దారులు లేకుండా పోయాయి. కనీసం ఎరువు బస్తా కూడా తీసుకువెళ్లలేని పరిస్థితులు అనేక గ్రామాల్లో నెలకొన్నాయి. ఈ కారణంగా రైతుల మధ్య సమన్వయం రావడంతో అనేక చోట్ల గతంలో దారుల నిర్మాణం జరిగింది. ప్రస్తుతం మళ్లీ అవకాశం రావడం, తొలి దశలో మండలానికి 5 కి.మీ చొప్పున చేపడుతున్నారు.

**మార్చి వరకు లక్ష్యం**మంజూరైన పనులను మార్చి నెలాఖరు నాటికి పూర్తిచేసి అందుబాటులోకి తీసుకురావాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. పనుల పురోగతిపై జిల్లా నుంచి మండల స్థాయి అధికారుల వరకు పర్యవేక్షణ చేపట్టారు.

**పరస్పర సహకారం పెరుగుతుంది** ఏటా చేపట్టే మామూలు ఉపాధి పనులు కాకుండా పొలాలకు దారులు ఏర్పాటు చేయడం శుభ పరిణామం. రైతులు కూడా చాలా చోట్ల సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. అందులో కూలీలు కూడా ఉండటంతో పనులు చేపట్టేందుకు ఉత్సుకత చూపుతున్నారు. పొలాలకు వేసుకునే బాటలతో రైతులు ఏళ్ల తరబడి పడుతున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించినట్లవుతుంది. ఉపయోగం కలుగుతుంది.– శ్రీనివాస్, జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి.

# పట్టణాల అభివృద్ధిపై నిర్లక్ష్యం

జగిత్యాల : జిల్లాలోని జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి పట్టణాల్లో అభివృద్ధి కుంటుపడింది. పట్టణాల సుందరీకరణ, అభివృద్ధి కోసం ఆరేళ్ల కిందట టీయూఎఫ్ఐడీసీ కింద నిధులు మంజూరయ్యాయి. సకాలంలో పూర్తిచేయకపోవడంతో పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి.

**రూ.75 కోట్లలో 50 శాతం మాత్రమే**

జగిత్యాల పట్టణానికి టీయూఎఫ్ఐడీసీ కింద మూడు విడతల్లో రూ.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఇందులో 50 శాతం నిధులు మాత్రమే వెచ్చించి అభివృద్ధి పనులు పూర్తి చేశారు. రూ.34.59 కోట్ల నిధులకు సంబోంధించిన పనులు అసంపూర్తిగా మిగిలాయి. తొలి విడతలో రూ.2.20 కోట్లతో అంతర్గత రహదారులు, మురుగు కాల్వల నిర్మాణాలు ప్రారంభానికి నోచుకోలేదు. రెండో విడతలో రూ.2.39 కోట్లతో బీటీ రహదారులు, మురుగుకాల్వల నిర్మాణం చేపట్టాలని భావించినా టెండర్ల దశ దాటలేదు. ఇందులోనే రూ.5 కోట్లతో కమ్యూనిటీ భవనాలు, గ్రేవ్‌యార్డు నిర్మించాల్సి ఉండగా వీటికి టెండర్లు సైతం నిర్వహించలేదు. ఇక మూడో విడతలో రూ.25 కోట్లకు సంబంధించి నల్లగుట్ట వద్ద డంపింగ్‌యార్డు ఆధునికీకరణ, అంతర్గత రహదారులు, మురుగుకాల్వలు చేపట్టాల్సి ఉన్నా వాయిదా వేశారు. శాసనసభ ఎన్నికల కోడ్‌తో టెండర్లు కూడా పూర్తి చేయలేకపోయారు. ప్రభుత్వం మారడంతో టెండర్లు పూర్తి చేయలేకపోయామని పుర అధికారులు చెబుతున్నారు. 48 వార్డుల్లో అత్యధిక వార్డులు అంతర్గత రహదారులు, మురుగుకాల్వల నిర్మాణం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**నిధులు రాక నిలిచిన పనులు**

మెట్‌పల్లి పట్టణంలో అభివృద్ధి పనులకు టీయూఎఫ్ఐడీసీ కింద రెండు విడతల్లో రూ.50 కోట్ల నిధులు ఆరేళ్ల కిందట మంజూరయ్యాయి. మొదటి విడతలో రూ.25 కోట్లతో పనులు పూర్తి చేయగా, రెండో విడతలో మాత్రం పనులను మధ్యలోనే ఆపివేశారు. రూ.8 కోట్లతో ప్రధాన రహదారికి ఇరువైపులా మురుగు కాలువలు, డివైడర్లు, సెంట్రల్



లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉండగా మురుగు కాలువలు అసంపూర్తిగా వదిలేయడంతో అధ్వానంగా తయారయ్యాయి. మెట్‌పల్లి నుంచి రేగుంట వరకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.30 కోట్లు, కూబ్‌సింగ్ పార్కు అభివృద్ధికి రూ.కోటి, చెరువు అభివృద్ధి, మినీట్యాంక్‌బండ్ ఏర్పాటుకు రూ.2.80 కోట్లు, గ్రంథాలయ భవన నిర్మాణానికి రూ.1.10 కోట్లు, శ్మశానవాటికల అభివృద్ధి కోసం రూ.50 లక్షలు, ప్రధాన మురుగు కాలువలు, సీసీరోడ్లకు నిధులు కేటాయించినా పనులను ప్రారంభించకుండా వదిలేశారు. రూ.50 కోట్ల నిధుల్లో 70 శాతం మాత్రమే పనులు పూర్తి చేశామని మిగతా పనులకు నిధులు రాకపోవడంతో మధ్యలోనే నిలిచిపోయాయని అధికారులు చెబుతున్నారు.

**ఏళ్లు గడిచినా అసంపూర్తిగానే!**

పట్టణ అభివృద్ధి కోసం 2019లో టీయూఎఫ్ఐడీసీ కింద రెండు విడతల్లో రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. పట్టణంలో 25 రకాల అభివృద్ధి పనులు చేపట్టేందుకు నిర్ణయించి జులై 1, 2019లో అప్పటి ప్రజాప్రతినిధులు పనులను ప్రారంభించారు. పనులు ప్రారంభించి అయిదున్నరేళ్లు గడుస్తున్నా అసంపూర్తిగా వదిలేశారు. రూ.80 లక్షలతో కొత్తబస్టాండ్ నుంచి గడిబురుజు వరకు తారురోడ్డు, రూ.1.55 కోట్లతో ఐబీరోడ్ నుంచి జగ్జీవన్‌రామ్ విగ్రహం వరకు తారురోడ్డు పనులు ప్రారంభించలేదు. రూ.కోటితో పట్టణంలోని నందిచౌక్, బస్టాండ్ సర్కిల్, ఐబీ గెస్ట్‌హౌజ్ వద్ద కూడళ్ల నిర్మాణాలకు నిర్ణయించి పనులు చేపట్టకుండా వదిలేశారు. రూ.35 లక్షలతో ఫుల్‌వాగులో బతుకమ్మ ఘాట్ నిర్మించేందుకు నిర్ణయించి పనులు చేపట్టలేదు. రూ.50 లక్షలతో జగ్జీవన్‌రామ్ విగ్రహం ఆవరణలోని ఫుల్‌వాగులో ఉద్యానవనం నిర్మించేందుకు పనులు ప్రారంభించినా అర్ధంతరంగా వదిలేశారు. రూ.10 లక్షలతో వేంకటేశ్వరస్వామి దేవాలయం ముందు కూడలి నిర్మించేందుకు నిర్ణయించి పనులు ప్రారంభించలేదు. రూ.8.72 కోట్లతో పట్టణంలోని 4.5 కి.మీ పొడవునా ప్రధాన రహదారి విస్తరణ, మధ్యలో అధునాతన డివైడర్లు, హైమస్ట్ లైటింగ్, ఇరువైపులా మురుగు కాలువ, పాదచారుల నడక మార్గం పనులను ప్రారంభించి 90 శాతం పూర్తిచేసి విడిచిపెట్టారు.

# సంఘాల ప్రగతికి.. కొత్త సారథులు!

చేగుంట: స్వయం సహాయక సంఘాల్లో గ్రామీణ మహిళలు చేరి ఆర్థిక అభ్యున్నతికి బాటలు వేసుకుంటున్నారు. రుణాలు తీసుకుని పొదుపు చేస్తూనే ప్రగతి వైపు అడుగులు వేస్తున్నారు. ఇందులో సంఘాల పాత్ర కీలకం. వీటిల్లో అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నికల ప్రక్రియ మొదలైంది. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు ఇందుకోసం చర్యలు చేపట్టారు.ఎన్నికల నిర్వహణపై మండల ఏపీఎం, సీసీలు, ఇతర సిబ్బందికి జిల్లా స్థాయిలో శిక్షణ ఇచ్చారు. వీరు మండల, గ్రామస్థాయిలో అవగాహన సమావేశాలు నిర్వహించి నెలాఖరు నాటికి ప్రక్రియ పూర్తి చేయనున్నారు.

**కొత్త సభ్యులకు అవకాశం**

జిల్లాలోని సంఘాల సభ్యుల్లో కొత్త వారికి అవకాశం కల్పించనున్నారు. ఒక్కో సంఘంలో 10 నుంచి 15 మంది సభ్యులు ఉంటారు. నిబంధనల ప్రకారం ఆసక్తి ఉన్న మహిళలకు సమావేశం నిర్వహించి ఏకగ్రీవం, చేతులు పైకెత్తి ఎన్నుకోవడం, కాగితాలు రాసి సభ్యురాలి ఎన్నికలకు మద్దతు తెలియజేయడం వంటి పద్ధతుల్లో ఎంపిక నిర్వహించనున్నారు. సంఘాల ద్వారా ఎన్నికైన అధ్యక్షులు గ్రామసంఘం అధ్యక్షురాలిని, గ్రామస్థాయి అధ్యక్షులందరూ కలిసి జిల్లా సమాఖ్యకు అధ్యక్షులను ఇదే పద్ధతిలో ఎన్నుకుంటారు.

మార్చి చివరి నాటికి..: మార్చి చివరిలోగా ఎన్నికల ప్రక్రియ పూర్తిచేసేలా గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ కార్యాచరణ రూపొందించింది. మండల స్థాయి ఎన్నికల ప్రక్రియను ఫిబ్రవరి ఆఖరు వరకు పూర్తి చేయనున్నారు. ఇందుకోసం ఏర్పాట్లు ముమ్మరం చేశారు. మండల స్థాయిలో ఎన్నికలపై మహిళా సంఘాల్లో చర్చ జోరుగా సాగుతోంది.

వీరే కీలకం: తీసుకున్న రుణాలను రుణాలను కొందరు సభ్యులు చెల్లించేందుకు సుముఖంగా ఉండడంలేదు. ఇలాంటి సందర్భంలో సంఘంలోని అధ్యక్ష, ఉపాధ్యక్షులే కీలకంగా వ్యవహరించనున్నారు. గ్రామైక్య సంఘంలో స్త్రీనిధి, కమ్యూనిటీ ఇన్వెస్ట్‌మెంట్, పొదుపు, మహిళా శక్తి రుణం, వాటర్‌షెడ్ రుణాలు వంటివి సంఘంలో అవినీతికి తావులేకుండా పారదర్శకంగా నిర్వహించేలా వీరు చర్యలు తీసుకుంటారు. మండలాలు: 20 గ్రామాలు: 493 వీవోలు: 521 స్వయం సహాయక సంఘాలు: 13,061 సభ్యులు: 1,37,859

# పండ్ల మొక్కల పెంపకంలో భేష్

కళ్యాణదుర్గం : పండ్ల తోటల పెంపకంలో రైతులను కూటమి ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం కింద ఉచితంగా పండ్ల మొక్కలు అందించి తోడ్పాటు కల్పించింది. ఈ పథకం కింద పండ్ల మొక్కల సాగులో కళ్యాణదుర్గం నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. ఎన్నడూ లేని విధంగా ఈ ప్రాంత రైతులు పండ్ల తోటల సాగులో ఆసక్తి చూపడం గమనార్హం. అనంతపురం జిల్లాలో 3,006 మంది రైతులు 9,167.56 ఎకరాల్లో పండ్ల మొక్కలు నాటారు. ఇందులో కళ్యాణదుర్గం నియోజకవర్గంలో 1,394 మంది రైతులు 4,606.23 ఎకరాల్లో మొక్కలు నాటి ప్రథమ స్థానానికి చేరుకున్నట్లు అధికారులు చెబుతు న్నారు.పండ్ల సాగుకు ఉత్సాహంగా ముందుకొచ్చిన రైతులకు ఎకరాకు మామిడి మొక్కలు 70, చీనీ 110, సపోట 60, డ్రాగన్ ఫ్రూట్స్



మొక్కలు 230, దానిమ్మ 235, పూల మొక్కలు అర ఎకరాకు అందజేశా రు. ఈ పంటలు సాగు చేసిన రైతులకు ఎకరాకు నెలకు నీటి బిల్లులు రూ.1,526, సంరక్షణకు రూ.2,500 ప్రభుత్వం అందజేయనుంది.

**రైతులను మరింత ప్రోత్సాహం కల్పిస్తాం: రమేశ్ నాయక్, ఏపీడీ, కళ్యాణదుర్గం** పండ్ల తోటల సాగులో కళ్యాణదుర్గం నియోజకవర్గం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. రాష్ట్రంలోనూ ముందంజలో ఉ ంది. ఇక్కడి రైతులకు పండ్ల మొక్కల సాగుపై అవగాహన కల్పించాం. దాంతో ఎక్కువ మంది మొగ్గు చూపారు. ఉపాధి హామీ పథకం కింద మొక్కలు అందించాం. రైతులకు బిల్లులు సక్రమంగా అందేవిధంగా చూస్తాం. రోజుల్లో మరింత మంది రైతులకు ప్రోత్సాహం కల్పిస్తాం.

# మోసం కనిపెట్టు.. అక్రమార్కుల పనిపట్టు



అనంతపురం : కొన్ని పెట్రోల్ బంకుల్లో మోసాలకు అడ్డూఅ దుపు లేకుండా పోతోంది. కొత్త తరహాలో వాహనదారులను మోసగిస్తు న్నారు. ఫిల్లింగ్ యంత్రాల్లో చిప్‌లు అమర్చి.. రీడింగ్ మీటర్‌పై చూపిన దానికంటే 10 శాతం తక్కువ ఇంధనం పడుతున్న ఉదంతం ఉమ్మడి అనంతపురం జిల్లాలో కలకలం రేగింది. అనుమానం వచ్చి పరీక్షించినా ఎక్కడా దొరక్కుండా అత్యాధునిక సాంకేతికతను వినియోగించుకుంటూ వాహనదారుల జేబులకు చిల్లులు పెడుతున్నారు. మరోవైపు వాహన దారులు అవగాహన, అప్రమత్తతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉంది. జంప్ ట్రిక్: మీటరు జీరోపై ఉన్నంత మాత్రం మోసం జరగదని భావించవద్దు. కొన్ని పెట్రోల్ బంకుల్లో జంప్ ట్రిక్ వినియోగించి మోసాలకు పాల్పడుతున్నారు. సాధారణంగా మీటర్ జంప్ రూ.4-5 మధ్యలో ఉండాలి'గొన్నింటిలో ఇంధనం నింపడం ప్రారంభించగానే ఒకేసారి రూ.10 నుంచి మొదలవుతుంది. డీజిల్ విషయంలో ఇది రూ.20 దాటిపోతుంది. రీడింగ్‌లో వేగం అసాధారణంగా ఉంటే ప్రశ్నించాలి.

**ఇంధన సాంద్రత**

సాంద్రతపై ఇంధన నాణ్యత ఆధారపడి ఉంటుంది. ఫిల్లింగ్ యంత్రంపై సాంద్రత(డెన్సిటీ)కి సంబంధించి మీటర్‌లో ప్రత్యేక విభాగం ఉంటుంది. పెట్రోల్ అయితే లీటర్‌కు 710-770 మధ్య, డీజిల్ 820-860 మధ్యలో ఉండాలి. కొన్ని బంకుల్లో మీటర్లను సైతం ట్యాంపర్ చేస్తున్నా రు. ఇంధనం పట్టేటప్పుడు పైపులో నుంచి వచ్చే ధారను గమనించాలి. అది వేగంగా ఉంటే అనుమానించాల్సిందే.. సున్నా చేస్తేనే.. మనకంటే ముందు ఉన్న వాహనదారు రూ.100 పెట్రోల్ కొట్టించారు. తర్వాత మనం రూ.300 పోయమని అడిగితే... బంకు సిబ్బంది మీటర్‌ను జీరో చేయకుండా అలాగే పడితే రూ.200 పెట్రోల్ మాత్రమే వస్తుంది. అందుకే పంపు మీటరును జీరో (సున్నా) చేశాడో... లేదో కచ్చితంగా గమనించాలి.

**ఫిర్యాదు చేయండిలా..**

పెట్రోల్ బంకుల్లో మోసం జరిగినట్లు గుర్తిస్తే అక్కడే ఫిర్యాదుల పుస్తకంలో నమోదు చేయాలి. ప్రతి పెట్రోల్ బంకులో విధిగా ఫిర్యాదుల పుస్తకం అందుబాటులో ఉంచాలి. ప్రతి ఆయిల్ కంపెనీ ఆడిట్ సమయంలో వాటిని సమీక్షిస్తుంది. ఒకవేళ ఫిర్యాదుల పుస్తకం ఇవ్వడానికి నిర్వాహకులు ఒప్పుకోకపోతే ఆయిల్ కంపెనీ వెబ్‌సైట్‌లో ఫిర్యాదును నమోదు చేయవచ్చు. తూనికలు, కొలతలు శాఖ అసిస్టెంట్ కంట్రోలర్ నంబరు 98490 95707కు నేరుగా ఫిర్యాదు చేయవచ్చు.

**ఉమ్మడి అనంత జిల్లాలో ఇలా..**

పెట్రోల్ బంకులు: 332

రోజువారీ పెట్రోల్ వినియోగం: 4.06 లక్షల లీటర్లు

డీజిల్ వినియోగం: 5.65 లక్షల లీటర్లు

గప్'చిప్'గా దోపిడీ

**అనంతపురంలో ఫిల్లింగ్ యంత్రం ట్యాంపరింగ్**

ధనార్జనే ధ్యేయంగా పెట్రోల్ బంకుల నిర్వాహకులు మోసాలకు బరితెగిస్తున్నారు. విజిలెన్స్ దాడుల్లో ఈ వ్యవహారం బట్టబయలైంది. అనంతపురం విజిలెన్స్ డీఎస్పీ నాగభూషణ నేతృత్వంలోని బృందం సాయంత్రం సోములదొడ్డిలోని విజయలక్ష్మి ఆటోకేర్ పెట్రోల్ బంకులో తనిఖీలు చేశారు. చిప్ అమర్చి ట్యాంపరింగ్‌కు పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఫిల్లింగ్ యంత్రంపై రీడింగ్ చూస్తే అంతా సవ్యంగానే ఉన్నట్లు కనిపిస్తుంది. వాహనంలో పట్టే ఇంధనంలో మాత్రం తేడా ఉంటోంది.

వాహనదారులకు అనుమానం వచ్చి పరీక్షించినా దొరక్కుండా ఉ ండేలా.. ఫిల్లింగ్ యంత్రంపై ప్రత్యేక బటన్ నొక్కినప్పుడే లోపలి చిప్ పని చేసేలా డిజైన్ చేశారు.

ప్రతి ఫిల్లింగ్ యంత్రం మదర్‌బోర్డులో పెట్రోల్ రీడింగ్ సెట్ చేసే చిప్ ఉంటుంది. అసలు చిప్‌కు బదులుగా తమకు అనుకూలమైన నకిలీది అమర్చారు. దీనిద్వారా యంత్రంపై చూపించే రీడింగ్‌కు.. వాహనంలో పట్టే ఇంధనానికి 10 శాతం తేడా ఉంటోంది. లీటరుకు 100 మిల్లీ లీటర్ల చొప్పున ఆదా చేసుకుంటున్నారు. పెట్రోల్ బంకుకు వచ్చే భారీ వాహనాలు, కార్లను లక్ష్యంగా చేసుకుని మోసానికి తెగపడుతున్నట్లు విజిలెన్స్ అధికారులు ప్రాథమిక విచారణలో తేలింది.

**హైదరాబాద్‌లో తయారీ!**

ఒక ఫిల్లింగ్ యంత్రానికి సంబంధించి రీడింగ్‌ను పరిశీలించగా ఏడాదిలో 28,07,981 లీటర్ల డీజిల్ పట్టినట్లు తేలింది. ఈ లెక్కన 2,80,798 లీటర్ల డీజిల్‌ను ఆదా చేసుకున్నారు. ప్రస్తుత ధర ప్రకారం లీటరుకు రూ.99 చొప్పున ఏడాదిలో రూ.2.77 కోట్ల మేర నిర్వాహకులు మోసానికి పాల్పడినట్లు స్పష్టమవుతోంది. హైదరాబాద్‌కు చెందిన కొందరు ఈ తరహా నకిలీ చిప్‌లను తయారు చేసి ఒక్కొక్కటి రూ.2 లక్షల చొప్పున బంకు నిర్వాహకులకు విక్రయిస్తున్నట్లు విజిలెన్స్ వర్గాల ద్వారా తెలుస్తోంది.

# ఉక్కు విశ్రాంత ఉద్యోగులపై పిడుగుపాటు

విశాఖపట్నం: విశాఖ స్టీలు ప్లాంటు యాజమాన్య నిర్ణయాలు విశ్రాంత ఉద్యోగుల్లో కలవరం రేపుతున్నాయి. రాష్ట్రీయ ఇస్పాత్ నిగమ్ లిమిటెడ్ (ఆర్ఐఎన్ఎల్) 'మెడికల్ స్కీం'లో భారీ కోతలకు ప్రతిపాదన లు చేసింది. ఆమోదం దీనిపై త్వరలో నిర్ణయం వెలువడ నుంది.

**ప్రస్తుత విధానం ఇదీ:** విశ్రాంత ఉద్యోగులకు గ్రూప్ మెడికల్ ఇన్సూరెన్స్ స్కీం (జీఎంఐఎస్) అందిస్తున్నారు. ఈ పథకంలో దంపతులకు రూ.6 లక్షల వరకూ వైద్య బీమా అందుతుంది. దంపతులిద్దరూ రూ.2,600 ఏటా చెల్లించాలి. మిగిలిన నగదు ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం భరిస్తుంది. దీంతోపాటు ఏటా ఓపీడీ (అవుట్ సైడ్ పర్చేజ్ రీయింబర్స్‌మెంట్) ఇద్దరికి రూ.16వేలు ఇస్తారు. ఆర్ఐఎన్ఎల్ ఆసుపత్రిలో వైద్యం చేసుకుంటే ఉచితం. బయట ఎక్కడ పరీక్షలు చేయించుకున్నా, మందులు కొనుగోలు చేసినా ఓపీడీ నగదు రీయింబర్స్‌మెంట్ చేస్తారు.

ఉద్యోగులే 30 శాతం చెల్లించాలని: పాలసీ సంస్థలకు చెల్లించాల్సిన నగదులో ఇకపై విశ్రాంత ఉద్యోగులు 30 శాతం కట్టాలని, కంపెనీ 70 శాతం చెల్లిస్తుందని తాజాగా ప్రతిపాదన చేశారు. ఓపీడీ సదుపాయం రూ.16 వేలలోనూ సగానికి కోత పెట్టారు. ఇప్పటి వరకు దాదాపు 10 వేల మందికి బీమా నిమిత్తం ఏటా రూ.30 కోట్లు కడుతున్నారు. ఇకపై 30 శాతం... సుమారు సుమారు రూ.9 కోట్లు విశ్రాంత ఉద్యోగుల కుటుంబాలు భరించాల్సి ఉంటుంది.



2015-17లో పదవీ విరమణ పొందిన ఉక్కు ఉద్యోగులకు నెలకు రూ.1200-1500 పింఛను వస్తుంది. వైద్య బీమాకు కంపెనీలు కోట్ చేసిన ప్రకారం భార్య, భర్తలకు కలిపి ఏటా రూ.18-20 వేలు కట్టాల్సి వస్తే వాళ్ళు ఎలా బతకాలి? అంటూ కార్మిక, ఉద్యోగ సంఘాలు మండిపడుతున్నాయి. విశ్రాంత ఉద్యోగుల్లో నిర్వాసిత కుటుంబాల సభ్యులే ఎక్కువ మంది. 'ఉక్కు'కు భూమి ఇచ్చినా కనీస ఆరోగ్య భద్రత లేకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**భద్రతా సిబ్బంది తగ్గింపు**

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో భద్రతా సిబ్బందిని తాజాగా మళ్లీ తగ్గించారు. ప్రధాన గేటు వద్ద ఉండే సీఐఎస్ఎఫ్ భద్రతా సిబ్బందిని 22వ తేదీ నుంచి తగ్గిస్తున్నట్లు సీజీఎం (వర్క్స్)కు సీనియర్ కమాండెంట్ లేఖ రాశారు. సాధారణ షిఫ్టుల్లో లోపలికి, బయటకు వచ్చే సమయంలో వాహనాల తనిఖీలు చేసే సిబ్బందిని కుదించనున్నారు. దీంతో 10-12 మంది ఉండే సీఐఎస్ఎఫ్ సిబ్బంది నలుగురిద్దరు మాత్రమే పనిచేయనున్నారు. ఈ నేపథ్యంలో విధుల్లో ఉండే సిబ్బందికి ఉ ద్యోగులు, అవుట్ సోర్సింగ్ కార్మికులు సహకరించాలని పేర్కొన్నారు. సాధారణంగా ప్రధాన గేటు నుంచి ఉద్యోగులు, కార్మికులు 15 నిమిషాల్లో వాహనాల తనిఖీలు పూర్తయి బయటకు వస్తారు. భద్రత సిబ్బంది తగ్గింపుతో మరింత జాప్యమయ్యే అవకాశాలున్నాయి. అలాగే ప్లాంటు భద్రతపైనా నీలినీడలు కమ్ముకుంటున్నాయి.

# అక్రమ లేఅవుట్లు.. అదుపులేని ధరలు

పలమనేరు : 'ఆ పక్కా నాదే.. ఈ పక్కా నాదే.. తలపైనా ఆకాశంలోని ముక్కా నాదే.. హే బిడ్డా.. ఇది నా(అక్రమాల) అడ్డా' అన్న ధోరణిలో రియల్ ఎస్టేట్ వ్యాపారులు వ్యవసాయ భూములన్నీ ఆక్రమించేశారు. గత ఐదేళ్లు అడ్డదిడ్డంగా వ్యవహరించారు. పలమనే రు, గంగవరం మండలాలు రికార్డుల పరంగా వేర్వేరుగా ఉన్నా భౌగోళికంగా కలిసిపోయాయి. ఇక్కడ రియల్ భూమ్ అమాంతం పెరిగినా ప్రభుత్వానికి ఏమాత్రం ఆదాయం రావడం లేదు. అక్రమ లేఅవుట్లకు ఇటు పలమనేరు పురపాలిక నుంచి అటు గంగవరం పంచాయతీ నుంచి అనుమతులు ఉండవు. చెరువు మొరవ, చెరువుకట్ట ప్రాంతాల్లోనూ ఆవాస స్థలాలుగా మార్చి విక్రయాలు సాగిస్తున్నారు. తాజాగా పలమనేరు పరిధిలోని బొమ్మదొడ్డి వద్ద ఓ లేఅవుట్‌ను చెరువు మొరవలోనే వేశారు. గంగవరం మొత్తం పలమనేరులో కలవడంతో ఒకప్పుడు ఎకరా రూ.5 లక్షల వరకు ఉండగా ప్రస్తుతం రూ.4 కోట్ల వరకు పలుకుతోంది. ఇటీవల ఓ బడా వ్యాపారి బెంగళూరు నుంచి ఇక్కడికొచ్చి భూముల ధరలు విని విస్తుపోయారు. ఇదే ధరకు బెంగళూరు శివారులో కొనుగోలు చేయొచ్చంటూ వెళ్లిపోవడం పరిస్థితి కి అద్దం పడుతోంది. వైకాపా హయాంలో రియల్టర్లు తమకిష్టమొచ్చి నట్లు వ్యవహరించగా అధికారులు వారికే అంటకాగారు.

**36 లేఅవుట్లపై ఆంక్షల విధించాం**

36 లేఅవుట్లకు నోటీసులిచ్చి బ్లాక్‌లిస్టులో పెట్టాం. ప్రభుత్వ నిబంధనల ప్రకారం తప్పనిసరిగా వ్యవసాయ భూమి మార్పిడికి భూమి విలువలో 5 శాతం రుసుం చెల్లించాలి. నిబంధనలకు అనుగుణంగా వసతులు, 30 అడుగుల రోడ్డు ఉంటే అనుమతులిస్తాం. లేకపోతే బ్లాక్‌లిస్టులో ఉంచి పనులు ఆపేస్తాం. ఎన్వీరమణారెడ్డి, కమిషనర్, పలమనేరు

# యోగాలో శిల్పా'రాణి'



హిందూపురం : అదో మారుమూల గ్రామం.. హిందూపురం గ్రామీణ మండలం సంతేబిదనూరు.. అక్కడ ప్రభుత్వం జాతీయ ఆయుష్ మిషన్ కింద ఆయుష్మాన్ ఆరోగ్య మందిరం ఏర్పాటు చేసింది. ఆయుర్వేద వైద్యశాల, పంచకర్మ వైద్యసేవలు అందిస్తూ వ్యాధి బాధితులకు యోగా థెరపీ, యోగాపై ఉచిత శిక్షణ ఇస్తున్నారు. కేంద్రంలో వైద్యురాలు అనురాధ పంచకర్మ వైద్య సేవలు అందిస్తుండగా కె.ఎస్.శిల్పారాణి అనే యువతి యోగాలో ఉన్నత విద్య అభ్యసిస్తూనే వ్యాధి బాధితులకు యోగాలో శిక్షణ ఇస్తున్నారు. ఆసక్తితో యోగాలో పైజీ, క్యూసీఐ విద్యను అభ్యసించి ప్రస్తుతం యోగాలో ఎస్‌వీవైఎస్ ఎం విశ్వవిద్యాలయం బెంగళూరులో ఎంఎస్సీ ద్వితీయ సంవత్సరం చదువుతున్నారు. ఈమె ప్రతి రోజు చికిత్సలకు వచ్చేవారికి, స్థానికులకు ఉచితంగా యోగాథెరపీ, యోగాసనాలు అభ్యసనం చేయిస్తున్నారు. దీనివలన వారికి ఉపశమనం కలుగుతుండటంతో నిత్యం ఈ ఆసనాలు వేయటానికి యువకులు, పండుటాకులు ముందుకొచ్చి కేంద్రంలో ఆసక్తిగా యోగాసనాలు వేస్తున్నారు. ఇంట్లో కూడా ఏకాంతంగా మెడిటేషన్, క్లిప్ థెరపీ, ప్రాణాయామ, సూర్యనమస్కారాలు చేసుకొనేలా అభ్యసం చేయిస్తూ అందరి మన్ననలు పొందుతున్నారు. **విదేశీయులకు సైతం..**ఉదయం, సాయంత్రం వేళల్లో అంతర్జాలంలో యోగాసనాలపై దేశ, ఇతర దేశాలకు చెందిన వారికి శిక్షణ ఇస్తున్నారు. దీంతోపాటు ఈ యోగా పోటీల్లో పాల్గొని పురస్కారాలు సొంతం చేసుకొంటోంది. ఇటీవల పుట్టపర్తిలో నిర్వహించిన యోగా పోటీల్లో ప్రథమ స్థానం, రాష్ట్రస్థాయిలో తొమ్మిదోస్థానం సొంతం చేసుకున్నారు. యోగాను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి వారు దీని ద్వారా లబ్ధిపొంది ఆరోగ్యంగా ఉండాలన్నదే తన ధ్యేయం అంటున్నారు శిల్పారాణి.

# వ్యాధి నిర్ధారణలో మరింత కచ్చితత్వం

నర్సీపట్నం : ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఎక్స్‌రేకు ఏళ్ల తరబడి పాత యంత్రాలే వినియోగిస్తున్నారు. వీటి స్థానంలో ఆధునిక ఎక్స్‌రేలను అమర్చాలని కూటమి ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ నేపథ్యంలో జిల్లాలోని ఆసుపత్రుల్లో 300 మెగా యాంప్స్ సామర్థ్యంతో కూడిన ఎక్స్‌రే యంత్రాల ఏర్పాటుకు వీలుగా చర్యలు తీసుకుంటున్నారు. ఇప్పటి వరకు వినియోగిస్తున్న పాత వాటితో నివేదికలకు అధిక సమయం వెచ్చించాల్సి వస్తోంది. కొత్తవి కేవలం 15 నిముషాల్లోనే ఫలితాన్ని అందిస్తాయని చెబుతున్నారు. ఇవి రోగాన్ని, లోపాన్ని ఎంతో నిశితంగా గుర్తించి నివేదికలు ఇస్తాయని చెబుతు న్నారు. దీని వల్ల రోగాలను త్వరితగతిన నయం చేసేందుకు వీలుంటుం ది. న్యూమోనియా, మూత్రపిండాల్లో రాళ్లు, గుండె సంబంధిత సమస్యలు వీటితో స్పష్టంగా గుర్తించవచ్చని అంటున్నారు. వీటిని బయట ప్రైవేటు కేంద్రాల్లో రూ. 1800 వరకు వెచ్చించాల్సి వస్తోంది. వీటి సేవలను ఇకపై ప్రభుత్వ ఆసుపత్రుల్లో ఉచితంగానే పొందవచ్చు.

కొత్త యంత్రాల కిరణాలు తీవ్రత మరింత అధికంగా ఉంటుందని చెబుతున్నారు. దీని రేడియేషన్ ప్రభావం హానికరం కావడంతో ఆసుపత్రుల్లోని ఎక్స్‌రే గదుల్లో గాలి సైతం ప్రవేశించని విధంగా వాటిని కట్టుదిట్టం చేసే పనులు ఇప్పటికే చేపట్టారు. ముఖ్యంగా వీటికి లెడ్ తలుపులను ఏర్పాటు చేసి రోగి ఒక్కరు మాత్రమే లోపల ఉండేలా చర్యలు తీసుకోనున్నారు. జిల్లాలో అనకాపల్లి, నర్సీపట్నం ప్రభుత్వ వైద్యాలయాలు,



ఎలమంచిలి, నక్కపల్లి, కోటపాడు, అగనంపూడి ఆసుపత్రులలో కొత్తవి సమకూరనున్నాయి. ఒక్కోదాని ఖరీదు రూ. 18 లక్షల వరకు ఉంటుంది. వీటిని గదుల్లో బిగించడానికి ముందుగా పూర్తి చేయాల్సిన పనులను ఆంధ్రప్రదేశ్ వైద్య సేవలు, మౌలిక వసతుల అభివృద్ధి సంస్థ (ఏపీఎంఎస్ఐడీసీ) ఇంజినీర్లు చేపడుతున్నారు.నర్సీపట్నంలో ముందస్తు పనులు పూర్తి: ఆధునిక ఎక్స్‌రే మిషన్లు అమర్చడానికి ముందుగా చేపట్టాల్సిన పనులను నర్సీపట్నం ప్రాంతీయ ఆసుపత్రిలో పూర్తి చేశాం. వీటికి రూ.రెండు న్నర లక్షలు ఖర్చు అయింది. ఎలమంచిలి, కె.కోటపాడుల్లోనూ ఈ పనులు ముగిశాయి. ఇక్కడ త్వరలోనే యంత్రాలు ఏర్పాటు చేసే అవకాశం ఉంది.నాయుడు, ఏపీఎంఎస్ఐడీసీ ఈఈ

అత్యుత్తమంగా ఎక్స్‌రే సేవలు: ఆధునిక ఎక్స్‌రే యంత్రాలు ఏర్పాటైతే రోగులకు మరింత అత్యుత్తమ సేవలు అందుబాటులోకి వస్తాయి. వీటితో వెన్నుపూసలోని సమస్యలు, లోపాలను సైతం సులువుగా ఎంతో స్పష్టంగా గుర్తించే వెసులుబాటు ఉంది. అన్ని ఆసుపత్రుల్లో లెడ్ తలుపుల ఏర్పాటు పనులు పూర్తయిన తరవాత వీటిని అమర్చనున్నారు.

శ్రీనివాస్, జిల్లా వైద్య విధాన పరిషత్తు సమన్వయకర్త

# భారం మోయలేం

పుత్తూరు : భూముల రిజిస్ట్రేషన్ దస్తావేజులకు ఆన్‌లైన్‌లో స్టాంపులు జారీ చేసేలా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్స్ శాఖ నూతన విధానం అమలులోకి తెచ్చింది. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వెండర్ల నుంచి దరఖాస్తులు స్వీకరించి స్టాంపులు జారీ చేయటంతోపాటు ఆన్‌లైన్‌లో వెండర్లే స్వయంగా కొనుగోలుదారుల వివరాలు నమోదుచేసి విక్రయించాల్సి ఉంటుంది. **వివరాలు కోసమే..** ఇప్పటివరకు స్టాంప్ వెండర్లు కొనుగోలుదారులు కోరిన స్టాంపుల మేరకు దరఖాస్తు రాసి చలానా చెల్లించి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల నుంచి స్టాంపులు పొందేవారు. అలా పొందిన వాటిని కొనుగోలుదారుల పేర్లతో రిజిస్టర్లలో నమోదుచేసి విక్రయించేవారు. అనంతరం వాటిని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయంలో వారానికోసారి తనిఖీ చేసేవారు. అయితే ఈ దరఖాస్తులను సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో భద్రపరచటం కష్టంగా మారుతోందని ఉన్నతాధికారులు భావించారు. దరఖాస్తుపోతే ఆ స్టాంప్ ఎవరు కొనుగోలు చేశారన్న వివరాలు లభించనందున ఆన్‌లైన్‌లో వెండర్లే స్టాంపులు జారీచేసే విధానాన్ని కొత్తగా ప్రవేశపెట్టారు. ప్రస్తుతం మాన్యువల్‌గా వెండర్లు వీటిని జారీ చేస్తుండగా భవిష్యత్తులో ఆన్‌లైన్ చేయనున్నారు. **అదనపు భారం..** నూతన విధానం ప్రకారం స్టాంపులు విక్రయించాలంటే వెండర్ తప్పనిసరిగా కంప్యూటర్ ఏర్పాటు చేసుకో వాలి. ప్రస్తుతం పుత్తూరులో ఉన్నవారిలో 70 శాతం మందికి లేదు. స్టాంపు కోసం ఎవరైనా వస్తే ముందుగా ఐజీఆర్ఎస్ సైట్‌లో లాగిన్ అవ్వాలి. ఆధార్ నంబరు నమోదు చేయగానే వాళ్ల ఫోన్‌కు ఓటీపీ వస్తుంది. దాన్ని నమోదు చేసి కావాల్సిన విలువగల స్టాంప్‌ను వెండరే ముద్రించి విక్రయించి రుసుం తీసుకోవాలి. ఒక్కోసారి సర్వర్ పనిచేయక గంటల తరబడి వేచిఉండాల్సి వస్తుంది. ఇది అటు కొనుగోలుదారులకు, ఇటు స్టాంప్ వెండర్‌కు ఇబ్బందికరమేనని.. మారిన నిబంధనతో గది అద్దెకు తీసుకుని కంప్యూటర్, ఇంటర్నెట్ ఏర్పాటు చేసుకోవడంతో అదనపు భారం పడుతుందని చెబుతున్నారు.

**నూతన విధానంతో పారదర్శకత..**పారదర్శకత కోసమే ఆన్‌లైన్ విధానాని కి శ్రీకారం చుట్టారు. కొనుగోలుదారుల వివరాలు ఆన్‌లైన్‌లో నిక్షిప్తమై ఉంటాయి. అందరూ నూతన విధానంలోకే మారాల్సిందే. శ్రీరామ్, జిల్లా స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖాధికారి, తిరుపతి

# దిగువ కాల్వ.. రైతుల దిగులు తీరింది


ఎమ్మిగనూరు : పశ్చిమ ప్రాంతానికి జీవనాడి తుంగభద్ర దిగువ కాలువ. మూడేళ్లలో ఎల్లెల్సీకి నీరు రాక చివరి ఆయకట్టు రైతులు నష్టపోయారు. అప్పట్లో చేయి తడిపితే తప్ప చేను తడిచేది కాదు, కూటమి సర్కార్ రాకతో ఎల్లెల్సీలో సాగునీరు నిండుకుండలా పారుతోంది. గత వైకాపా ప్రభుత్వం సరిగా స్పందించకపోవడంతో రావాల్సిన నీటి వాటా పూర్తిగా తగ్గిపోయింది. విడుదల చేసిన నీటిని సైతం కాసులకు అమ్ముకుని సొమ్ము చేసుకున్నారు.

**మార్చి 31 వరకు నీటి సరఫరా**

రబీ కింద 1.07 లక్షల ఎకరాలకు సాగునీరందించాలి. వర్షాలు, బోర్ల కింద ఉన్న ఆయకట్టు పరిధిలో ప్రస్తుతం ఇప్పటికే దాదాపు 60 వేల ఎకరాలకుపైగా వివిధ పంటలు సాగు చేశారు. ఎమ్మిగనూరు, ఆదోని, మంత్రాలయం, కోడుమూరు, కర్నూలు డివిజన్ పరిధిలో రబీ కింద సుమారు మిరప 24 వేలు, పత్తి 16 వేలు, ఇతర 20 వేల ఎకరాల్లో పంటలు సాగు చేశారు. మార్చి 31 వరకు సాగునీరు అందిస్తామని ఇటీవల ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ప్రకటించడంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

"నేను బీటెక్ చదువుతున్నా. మాకు మూడెకరాల పొలం ఉంది. మా అమ్మానాన్నలకు ఆసరా ఉండేందుకు వ్యవసాయం చేస్తున్నా. మిరప సాగు చేశాం. ఎకరానికి 19 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఎల్లెల్సీలో నీరు సమృద్ధిగా ఉండటంతో మరో రెండు కోతలు వస్తాయని" పార్లపల్లికి చెందిన జగదీశ్ సంతోషం వ్యక్తం చేశారు.

**చేనుకు చేరుతున్న నీరు**



ఈరన్న, కలుగట్ల, ఆయకట్టు రైతు

నాకు ఎల్లెల్సీ కింద మూడెకరాల పొలం ఉంది. మూడేళ్లుగా పంట చేతికందే సమయంలో నీళ్లు లేక పంటలు ఎండిపోయాయి. ప్రతి ఏడాది దాదాపు రూ.లక్ష నుంచి రూ.2 లక్షల వరకు నష్టపోయాను. ఈ ఏడాది కాల్వల నిండా నీరు పారుతోంది. పైసా ఖర్చు లేకుండా పొలంలోకి నీరు చేరుతోంది. ఏటా రావాల్సిన నీటి వాటా : 24 టీఎంసీలునీటి విడుదల సమయం : అక్టోబరు 16 నుంచి మార్చి నెలాఖరు వరకు చివరి ఆయకట్టుకు నీళ్లు రాక ఐదేళ్లలో నష్టపోయింది : సుమారు రూ.150 కోట్లకుపైగా 2025 ఫిబ్రవరి 18 నాటికి జలాశయం సామర్థ్యం 50 టీఎంసీలు ఎమ్మిగనూరుకు చేరుకుంటున్న నీరు 375 క్యూసెక్కులు

# కొల్లేరులో కృత్రిమ సాగు

కైకలూరు : నిత్యం పక్షుల కిలకిలరావాలతో సందడిగాఉండే కొల్లేరులో సంప్రదాయం ముసుగులో నిబంధనలను తుంగలో తొక్కి కృత్రిమ సాగుకు తెర తీస్తున్నారు. కొల్లేరు కాంటూర్ పరిధిలో 2006 ఆపరేషన్‌లో కొట్టేసిన భూముల్లో జీరో సైజు చేపపిల్లల సాగు చేస్తున్నారు. పక్షుల ఆవాసాలకు, ఆహార సేకరణకు విఘాతం కలిగించేలా చర్యలు చేపడుతున్నా పట్టించుకున్న నాథ%రి%్నడు కనిపించడం లేదు. కొట్టేసిన చెరువుల్లో గట్లు వేసి వాటిలో నీటిని నింపి చేపలు పెంచుతున్నారు. హాని కారకమైన రసాయనాలతో పాటు తవుడు, ఇతర మేత అందిస్తున్నారు. కొల్లేరులో మేత కర్రలు పెట్టి, పడవలపై మేతలు వేసుకుని మూటలు కడుతున్నారు. అధికారులు చూసీచూడనట్లు వదిలేస్తుండటంతో అక్రమాలకు అదుపు లేకుండా పోతోంది.

**సాగు ఇలా..** కైకలూరు మండలంలోని చెటాకాయ్‌లో 400 ఎకరాలు, నత్తగుల్లపాడు 200, పెంచికలమర్రు, వడ్లకూటితిప్ప 250, పందిరిపల్లిగూడెం, కొల్లేటికోటలో 200, శృంగవరప్పాడు 400, గుమ్మళ్లపాడు 200 ఎకరాల్లో, మండవల్లి మండలంలోని కొవ్వాడలంకలో 250, చింతపాడులో 300, పులపర్రులో 250, నుచ్చుమిల్లి 150, తక్కెళ్లపాడులో 150, పెనుమాకలంకలో 200, నందిగామలంకలో 250 ఎకరాల్లో కృత్రిమ సాగు చేస్తున్నారు.



**విలవిల్లాడుతున్న పక్షులు, పశువులు..**
కొల్లేరుపై ఆధారపడి జీవిస్తున్న పక్షులకు, పశువులకు ప్రస్తుతం గడ్డుకాలం నడుస్తోంది. కొల్లేరులో ఉప్పు నీరు పెరిగిపోవడంతో చేపలు మృత్యువాత పడటంతోపాటు వృద్ధి తగ్గి పోతోంది. దీంతో ఖండాలు దాటి సంతానోత్పత్తికి వస్తున్న పక్షులు అర్ధాంతరంగానే వెనుతిరగాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. విషతుల్యంగా మారిన నీటిలో పక్షులకు పూర్తి స్థాయిలో ఆహారం లభించక పోవడంతో అర్ధాకలితో బక్కచిక్కి పోతున్నాయి.

**జీవో 120కి విఘాతం**
జీవో 120 ప్రకారం కొల్లేరు పరివాహక ప్రాంతంలో కృత్రిమ సాగు చేయడం, భారీ యంత్రాలతో తవ్వకాలు, శబ్దాలు చేసే ఇంజిన్ల ఏర్పాటు నిషిద్ధం. కానీ మండవల్లి, కైకలూరు మండలాల్లోని చాలా గ్రామాల్లో కొల్లేరు మధ్యలో ఆయిల్ ఇంజిన్లు పెట్టి కొట్టేసిన చెరువుల్లో నీటిని బయటకు తోడుతున్నారు. ఆయా చెరువుల వద్దకు వస్తున్న పక్షులను బెదిరిస్తూ చేపల సాగు చేస్తున్నారు. దీనిపై అటవీ రేంజర్ రామలింగాచార్యులును వివరణ కోరగా నిఘాను పెంచి కొల్లేరు పరిరక్షణకు చర్యలు తీసుకుంటామన్నారు. డీఎఫ్‌వో విజయను సంప్రదించగా అక్రమసాగును అరికట్టేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

# జడ్పీలో 'లెక్క'లేనంత నిర్లక్ష్యం!

ఒంగోలు : ప్రజాధనాన్ని బాధ్యతాయుతంగా ఖర్చు చేయడం.. ప్రతి పైసాకు లెక్కలు చూపడం అధికారుల విధి. వైకాపా ప్రభుత్వంలో ఓ అధికారి ఈ విషయాన్ని విస్మరించారు. 'జాలి' గుండెతో నిధులు మళ్లించారు. నిబంధనలకు నీళ్లొదిలి ముందస్తు చెల్లింపులు చేశారు. అకారణంగా ఖర్చవుతున్నా చూస్తుండిపోయారు. తామెవరికీ ఏం చెప్పాల్సింది లేదంటూ 'లెక్క'లేనితనం ప్రదర్శించారు. కూటమి సర్కారు అధికారంలోకి వచ్చిన తర్వాత తప్పులు వెలుగు చూస్తున్నాయి. అప్పటి అధికారులేమో బదిలీ అయ్యారు. ఆ స్థానంలో వచ్చిన వారేమో చర్యలు తీసుకోకుండా 'చిరు'నవ్వులే సమాధానంగా అనిపిస్తు న్నారు.

**ఏం పనులు చేశారో తెలియదు:** బీపీసీఎల్ ఆధ్వర్యంలో కృష్ణపట్నం ఓడరేవుకు మల్టీ ప్రొడక్ట్ పెట్రోలియం పైపులైన్ నిర్మాణాన్ని రెండేళ్ల క్రితం చేపట్టారు. తవ్విన రహదారుల పూడ్చివేతకు సెక్యూరిటీ డిపాజిట్ కింద 2021లో జడ్పీ ఖాతాకు రూ.52 లక్షలు అందించారు. 2022లో అప్పటి జడ్పీ సీఈవో జాలిరెడ్డి వీటిని ఖర్చు పెట్టారు. ఆ నిధులతో ఏం పనులు చేశారని తెలిపే దస్త్రాలు లేవు. లెక్కలు చెప్పలేదు. అధికారులు మాత్రం అప్పటి జడ్పీ సీఈవో బదిలీపై వెళ్లారని, లేఖ రాశామంటూ కాలం వెల్లదీస్తున్నారు.

**బిల్లులు సమర్పించింది లేదు:** జడ్పీ జీపీఎఫ్ గ్రాంట్ నుంచి రూ.2.81 కోట్లను వివిధ పనుల పేరిట పీఆర్ ఇంజినీరింగ్ అధికారులకు రెండేళ్ల క్రితం ముందుగానే చెల్లించారు. నిబంధనలు పాటించలేదు. ఇంజినీరింగ్ అధికారులేమో ఆ నిధులను ఏ పనులకు వెచ్చించారు.. ఎంబీ రికార్డులు, బిల్లులను జడ్పీ అధికారులకు సమర్పించలేదు. నిధుల ఖర్చు, పనుల వివరాలు, నోట్‌కామ్ చిత్రాలు, ఎవరికి, ఎప్పుడు డబ్బు చెల్లించారు, ప్రస్తుత పని స్థితిపై నివేదిక ఇవ్వాలని జడ్పీ సీఈవోనే గత నెల 31న పీఆర్ ఈఈకి లేఖ రాశారు. నేటికీ సమాధానం లేదు.

**ఇష్టారీతిన విధులు:** ఫారిన్ సర్వీస్‌లో భాగంగా జిల్లా పరిషత్ ఉద్యోగులు ఇతర శాఖలో పనిచేస్తుంటారు. ఇందుకు జడ్పీ సీఈవో, తర్వాత కమిషనర్ అనుమతి అవసరం. అయిదేళ్ల అనంతరం తిరిగొచ్చి ఆరు నెలలు పూర్వస్థానంలో పనిచేయాల్సి ఉంటుంది. ఈ నిబంధనలు అమలు కావడం లేదు. సుమారు 15 మంది సీనియర్ అసిస్టెంట్లు, ఈవోలు, సూపరింటెండెంట్లు, టైపిస్టులు ఫారిన్ సర్వీసులో భాగంగా ఎస్సీ, బీసీ, ఎస్టీ, మైనార్టీ కార్పొరేషన్లు, డ్వామా, మెప్మా, మైనార్టీ కార్యాలయాల్లో పనిచేస్తున్నారు. వీరిలో అయిదేళ్లు దాటినా వారూ ఉన్నారు. అయినా చర్యలు లేవు.

**రెండుసార్లు రుణం చెల్లింపు:** రెండేళ్ల కిందట సుమారు పది మంది వరకు జీపీఎఫ్ రుణం తీసుకున్నారు. వీరికి రూ.99.50 లక్షలను రెండుసార్లు చెల్లించారు. ఇందులో ముగ్గురు ఉద్యోగుల పాత్ర ఉంది. తప్పును ఆలస్యంగా తెలుసుకొని.. పది మందిని బతిమిలాడుకొని మళ్లీ రాబట్టారు. ఆ మొత్తానికి జడ్పీ రెండు నెలలపాటు వడ్డీ కోల్పోవాల్సి వచ్చింది. ఏడాది కిందట ఈఎల్(యర్న్ లీవ్స్) పేరిట రూ.1.80 లక్షలను రెండు సార్లు చెల్లించారు. నేటికీ విషయం తెలియదు. ఇటీవల సీఎఫ్ఎంఎస్ అధికారులు గుర్తించి లేఖ ఇచ్చారు.

**విచారించి చర్యలు తీసుకుంటాం:** చిరంజీవి, జడ్పీ సీఈవో
బీపీసీఎల్ నిధులు రూ.52 లక్షలకు సంబంధించి గత జడ్పీ సీఈవో నుంచి బిల్లులు ఇంకా అందలేదు. వచ్చిన వెంటనే పరిశీలించి తదుపరి చర్యలు తీసుకుంటాం. పీఆర్ ఈఈకి ఇచ్చిన ముందస్తు చెల్లింపుల నివేదికపై మరోసారి నివేదిక కోరుతాం. ఫారిన్ సర్వీసు అధికారుల వివరాలు తెలుసుకుని వెనక్కి రప్పిస్తాం. గతంలో సాంకేతిక తప్పిదంతో రెండుసార్లు బిల్లులు చెల్లించడంపై విచారించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

# మాతృభాష.. అమ్మ జోల పాట




కళ్యాణదుర్గం : మన పలుకులోనే మాతృభాష ఉనికి బతికుంటుంది. అమ్మ భాషను కాపాడుకోవడం అందరి బాధ్యత. శిశువు ఊయలలో ఊగుతూనే ఊకొడుతూ భాషా పరిజ్ఞాన్ని సంపాదిస్తాడు. అంత గొప్పతనం అక్కడి నుంచే మొదలవుతుంది. కొందరు అమ్మభాషలో రచనలు చేస్తూ పలువురికి ఆదర్శంగా నిలిచారు. శుక్రవారం అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం. కళ్యాణదుర్గంలోని కరణం చిక్కప్ప ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా పని చేస్తున్న రాఘవేంద్ర యువకవిగా రాణిస్తున్నారు. కంబదూరు మండలం నూతిమడుగు గ్రామానికి చెందిన రాఘవేంద్ర మాతృభాషపై ఉన్న మక్కువతో అనేక రచనలు చేశారు. పిల్లల్లో మాతృభాషకు పునాధులు వేయాలని బాలనేస్తం పత్రికను ప్రారంభించారు. విద్యార్థులు ఉత్సాహంగా రాసిన 'చినుకుల తోట', 'మట్టితీగ' తదితర కవితా సంకలనాలు వెలువరించారు. సామాజిక అంశాలను తీసుకుని కవితలు రాశారు. ఆయన కవితల్లో ఈతకల్లు కార్మికుడు, పాకీడు, చర్మకారుడు, ఇంటి పనిమనిషి, నిరుద్యోగి, ఇవాళ నా పల్లె, అదృశ్య శక్తులు దాచుకునే ఓ ప్రయోగశాల, రైతు శిథిలమైన ఒక చరిత్ర వంటి కవితలు రాసి మన్ననలు పొందారు. 'కల్లంచుల బువ్వ', 'దీర్ఘకవిత' సంపుటికలకు రావి రంగారావు సాహిత్య పీఠం జనరసంజక కవిత ప్రతిభా పురస్కారం, కందికొండ రామస్వామి సాహిత్య పురస్కారం, మల్లవరపు రాజేశ్వరరావు, స్పందన సాహిత్య సాహిత్య పురస్కారాలు అందుకున్నారు.

**జన పదాలతో పదిలం..**
నల్లమాడ మండలం పాతబత్తలపల్లిలో తెలుగు ఉపాధ్యాయుడు ఓబుళపతి అమ్మభాష సేవలో తరిస్తున్నారు. రాయల సీమ రైతు, అమ్మ, అక్షర సంస్కారి గురువు, ఉగాది తెలుగు సంప్రదాయం, ఓటు విలువ వంటి కవితలను రాశారు. అమ్మభాష పరిరక్షణకు జన పదాలను నిరంతరం వాడుకలో ఉండేలా కృషిచేస్తున్నారు.

**పిల్లల్లో ఆసక్తిని రేకెత్తిస్తూ..**
మెట్లు- మెటుకులు, చెప్పులు-మెట్లు లాంటి పదాలెన్నో ఉన్నాయని, వీటిపై పిల్లలకు 'పుస్తక పదాలు- మన పదాలు' అంశంతో పోటీలు పెట్టి బహుమతులు ప్రదానం చేస్తున్నారు. కథలు పోటీలు, భాషా క్రీడలు, పద చాతుర్యంతో రాయించటం వంటి సాధనలతో పిల్లల్లో ఆసక్తిని పెంచుతున్నారు.

# ఆర్థిక సంక్షోభంలో పురం




హిందూపురం : హిందూపురం పట్టణంలో రూపాయి అభివృద్ధి పని చేయాలన్నా పాలకులు, అధికారులు జంకుతున్నారు. పని చేయడానికి గుత్తేదారులు ముందుకు రావడం లేదు. కారణం మున్సిపాలిటీ వద్ద నిధులు లేకనే.. దీనికి తోడుగా రూ.150 కోట్ల బకాయిలు చెల్లించాల్సి ఉంది. పట్టణాలు అభివృద్ధి చెందాలంటే, పురపాలక సంఘాల వద్ద నిధులు తప్పనిసరి. నిధులు సమకూరాలంటే ఆదాయ వనరులు పెంచుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి నిధులు తెచ్చుకోవాలి. అయితే గత ఐదేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం మున్సిపాలిటీలకు ఒక్క రూపాయి నిధులు మంజూరు చేయలేదు. వసూలయ్యే పన్నులు పొరుగు సేవల ఉద్యోగుల వేతనాలకు, విద్యుత్తు ఛార్జీలు, నీటి సరఫరా పథకాల నిర్వహణకు సరిపోవడం లేదు. వివిధ మున్సిపాలిటీలకన్నా హిందూపురానిది అన్ని విషయాల్లోనూ ప్రత్యేకమే. గత 30 ఏళ్లుగా పట్టణంలో తాగునీటి సమస్య జటిలంగా మారింది. సమస్యను తీర్చడానికి అప్పట్లో కాంగ్రెస్ ప్రభుత్వం పీఏబీఆర్ నుంచి రూ.620 కోట్లు వెచ్చించి పైపులైన్ నిర్మించింది. నిర్వహణ సరిగా లేకపోవడం, పనుల్లో నాణ్యతాలోపం కారణంగా పట్టణానికి సగటున 5 మిలియన్ లీటర్ల నీటిని మాత్రమే సరఫరా చేసింది. దీంతో ప్రయోజనం లేదని గుర్తించి, దానిని పక్కన పెట్టి, 2018లో రూ.194 కోట్లతో గొల్లపల్లి నుంచి తాగునీటిని తీసుకొచ్చే పథకాన్ని నిర్మించారు. ఈ రెండు పథకాలు మున్సిపాలిటీపై అంతులేని భారాన్ని మోపాయి. పీఏబీఆర్ నుంచి గతంలో చేసిన నీటి సరఫరాకు రూ.38.5 కోట్లు చెల్లించాల్సి ఉంది. గొల్లపల్లి తాగునీటి పథకానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వాట పోనూ పురపాలిక వాటా రూ.125 కోట్లు చెల్లించాల్సి వచ్చింది. నిధులు లేకపోవడంతో రూ.45 కోట్లు అప్పు చేసి గుత్తేదారుకు చెల్లించారు. ఈ అప్పునకు ప్రతి నెలా ఈఎంఐ రూపంలో రూ.60 లక్షలు సాధారణ నిధుల నుంచి చెల్లిస్తున్నారు. వాటిని కూడా రెండేళ్ల నుంచి నిలిపేశారు.

**నెల్లూరు ప్రయోగం జరిగితేనే ప్రయోజనం**
నెల్లూరు నగరపాలక సంఘం అభివృద్ధి పనుల కోసం చేసిన రూ.50 కోట్లకు పైగా అప్పును రద్దు చేస్తూ పురపాలక శాఖ ఉత్తర్వులు ఇచ్చింది. ఈ సొమ్మును ప్రభుత్వమే చెల్లించేలా పురపాలకశాఖ మంత్రి నారాయణ చర్యలు తీసుకొన్నారు. ఇలాగే హిందూపురం మున్సిపాలిటీకి సంబంధించిన అప్పులను, బకాయిలను మాఫీ చేస్తేనే గట్టెక్కగలదు. లేదంటే ఆర్థిక సంక్షోభం మరింత ముదురుతుంది.

బకాయిలు ఎంతెంత చెల్లించాలంటే.. (రూ.కోట్లలో)
విద్యుత్తు సంస్థకు : 33
ఎల్ఈడీలు సరఫరా చేసిన సంస్థకు : 2.90
పీఏ బీఆర్‌కు : 38.50
గొల్లపల్లి తాగునీటి పథకం ఈఎంఐలు : 13
గుత్తే దారులకు : 12
దీనికి తోడు గొల్లపల్లి తాగునీటి పథకం కోసం చేసిన అప్పు ఇంకా రూ.30 కోట్లు మిగిలి ఉంటుంది.

# విస్తరిస్తున్న ప్రకృతి వ్యవసాయం



మడకశిర : రాష్ట్రంలోనే తక్కువ వర్షపాతం నమోదయ్యే ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా ప్రకృతి వ్యవసాయం రోజురోజుకు విస్తరిస్తోంది. తక్కువ నీరు, సాగు ఖర్చు తక్కువగా ఉండే చిరుధాన్యాలు, కూరగాయాలు, ఆకుకూరల పంటలు విస్తృతంగా సాగుచేస్తూ మంచి దిగుబడులు సాధిస్తున్నారు. బోర్లలో వచ్చే అరకొర నీటికి ఎకరా, రెండెకరాల్లో ఏడాది పొడవున ఆదాయాన్నిచ్చే ఏగ్రేడ్, ఏటీఎం మోడళ్లు, మిశ్రమ పంటలు సాగుచేసి ఆదాయం పెంపొందించుకుంటున్నారు.

**2016లో పైలెట్ ప్రాజెక్టుగా..**
2016లో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పంటలకు సేంద్రీయ ఎరువుల వాడకాన్ని ప్రోత్సహిస్తూ మంచి ఆరోగ్యకర దిగుబడులను సాధించాలనే సదుద్దేశంతో ప్రకృతి వ్యవసాయం ప్రారంభించారు. అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా 26 మండలాల్లో పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో రాప్తాడు, కూడేరు, రాయదుర్గం, తాడిపత్రి, బత్తలపల్లి, కళ్యాణదుర్గం, గుత్తి మండలాలను ఎంపిక చేశారు. మొదట్లో 50 గ్రామాల్లో మాత్రమే ప్రకృతి వ్యవసాయం ఉండేది. 1250 మంది రైతులు 2500 ఎకరాల్లో సాగు చేసేవారు. మంచి నాణ్యమైన దిగుబడులు చేతికందుతుండడంతో క్రమేపి సాగు విస్తరించి రాష్ట్రంలో ఉమ్మడి అనంతపురం జిల్లా ఆదర్శంగా నిలిచింది.

**పనిచేస్తున్న 450 మంది సిబ్బంది:** ప్రకృతి వ్యవసాయ సాగుకు రైతులను ప్రోత్సహిస్తూ అవసరమైన ఎరువుల వాడకం, పంటల మార్పిడి, జీవామృతం, ఘనజీవామృతం, భీజామృతం వంటి ఎరువులను తయారుచేసి నిత్యం రైతులకు జడ్బీఎన్ఎఫ్(జీరోబేస్డ్ నెచురల్ ఫార్మింగ్)సిబ్బంది అండగా ఉంటున్నారు. ఇందులో ఎన్ఎఫ్ఏ, ఎంటీ, ఏఎంఎంటీ, డీఎంఎంటీ, ఎల్1, ఎల్2, ఎల్3 మొత్తం 450 మంది పనిచేస్తున్నారు.

**ఇతర జిల్లాల రైతులకు శిక్షణ**
జడ్బీఎన్ఎఫ్‌లో పనిచేసే ఏఎంఎంటీ, డీఎంఎంటీలు పశ్చిమ గోదావరి, తూర్పుగోదావరి, శ్రీకాకుళం, నెల్లూరు, చిత్తూరు, తిరుపతి, నంద్యాల, కర్నూల్ తదితర జిల్లాల్లో ఇక్కడి ప్రకృతి వ్యవసాయ సాగు విధానంపై రైతులకు అవగాహన కల్పిస్తూ నాణ్యమైన దిగుబడులు సాధించేందుకు కృషి చేస్తున్నారు.

**47 దేశాల శాస్త్రవేత్తలు, ప్రతినిధుల సందర్శన**
ఇక్కడి రైతులు సాగుచేసిన ఏటీఎం మోడళ్లు, మిశ్రమ పంటల సాగును అధ్యయనం చేసేందుకు జర్మనీ, స్పెయిన్, ఇంగ్లాండ్, లండన్, శ్రీలంక, నెదర్‌లాండ్, ఆస్ట్రేలియా తదితర దేశాల ప్రతినిధులు, శాస్త్రవేత్తలు సందర్శించి పరిశీలించారు. పలురకాల కూరగాయలు పండిస్తున్నా..

-మోహన్‌దాస్, జడ్బీఎన్ఎఫ్ రైతు, నీలకంఠాపురం, మడకశిర మండలం నాకున్న రెండున్నరెకరా పొలంలో ముల్లంగి, క్యారెట్, మునగ, బెండ, వంగతో పాటు ఆకు కూరలు పండిస్తున్నా. ఏగ్రేడ్, ఏటీఎం మోడళ్లలో ఏడాదిలో రూ.3లక్షల ఆదాయం వచ్చింది. ప్రత్యేక మార్కెట్ సౌకర్యం కల్పిస్తే మంచి ధరలు లభించి రైతుకు లాభసాటిగా ఉంటుంది. భవిష్యత్తులో కీలక పాత్ర- లక్ష్మానాయక్, సీటీఅండ్ఐఓ డీపీఎం, అనంతపురం ప్రకృతి వ్యవసాయ సాగు పద్ధతులతో వచ్చిన దిగుబడులను ఆహారంగా తీసుకునేందుకు ఎక్కువగా మొగ్గుచూపుతున్నారు. తక్కువ ఖర్చు, తక్కువ నీటి అవశ్యకత ఉండడంతో ప్రకృతి వ్యవసాయాన్ని అవలంబించే రైతులు అధికమవుతున్నారు. రాబోయే ఐదేళ్లలోపు ప్రతి గ్రామానికి ప్రకృతి వ్యవసాయ విస్తరిస్తుంది.

# ఎన్నాళ్లో వేచిన ఉదయం

మద్దిపాడు : పల్లెలే ప్రగతికి పట్టుగొమ్మలన్న మహాత్ముని పలుకులను గత పాలకులు పెడచెవిన పెట్టారు. ఫలితంగా గుంతల రహదారులు..దెబ్బతిన్న మురుగు కాలువలు..అపరిశుభ్రతతో నిండిన పరిసరాలతో పరిస్థితి దుర్భరంగా ఉండేవి. కూటమి ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి సారించింది. ఉపాధి హామీలో భాగంగా రూ.కోట్లు వెచ్చించి కొత్త సీసీ రోడ్లు నిర్మిస్తుండటంతో ఇవన్నీ నందనవనాల్లా మారుతున్నాయి. జిల్లావ్యాప్తంగా పల్లె పండగ మొదలైంది. ఉపాధి హామీ నిధులతో ప్రతి గ్రామంలో అంతర్గత రహదారుల నిర్మాణం శరవేగంగా సాగుతోంది. ఇందుకోసం జిల్లాకు దాదాపు రూ.150 కోట్లు వెచ్చించి 1143 రోడ్ల నిర్మాణానికి సంకల్పించారు. దాదాపు 80 కిలోమీటర్ల మేర నిర్మించాల్సి ఉండగా, ఇప్పటికే 80 శాతం పనులు పూర్తయ్యాయి.

**తప్పిన అవస్థలు:** గతంలో ఏమాత్రం చిన్న వాన పడినా మోకాళ్ల లోతు నీళ్లలో వెళ్లాలంటే మహిళలు, వృద్ధులు, చిన్నారులు నానా అవస్థలు పడేవారు. పాఠశాలలకు వెళ్లాలంటే దాదాపు అసాధ్యమే! ఈ నేపథ్యంలో పల్లె పండగలో భాగంగా పనులు చేపట్టి సంక్రాంతి నాటికి



వాటి దశ మార్చాలన్న లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. జిల్లాకేంద్రానికి ఆనుకుని ఉన్న మండలాల్లో ఇప్పటికే నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. మద్దిపాడు మండలంలో 29 పనులు చేపడుతున్నారు. ఇందులో భాగంగా 7.3 కి మీ మేర సీసీ బాటల నిర్మాణానికి రూ.3.30 కోట్ల నిధులు మంజూరు చేశారు. నాలుగు దశాబ్దాల కిందట ఏర్పడిన మద్దిపాడు బీసీ కాలనీకి ఇప్పటికీ రోడ్డు లేదు. ఇప్పుడు వారు హాయిగా జాతీయ రహదారిని చేరుకునే అవకాశం దక్కింది. మద్దిపాడు, దొడ్డవరం, పెద కొత్తపల్లి, నాగన్నపాలెం, కొలచనకోటలో ఇప్పటికే ఏర్పాటయ్యాయి. బసవన్నపాలెం, ఇనమనమెళ్లూరు, రాచవారిపాలెం తదితర గ్రామాల్లోనూ పనులు పూర్తయ్యాయి. మిగిలినవి సంక్రాంతి నాటికి పూర్తి చేస్తామని అధికారులు తెలిపారు. సంతనూతలపాడు మండలంలో మొత్తం 30 రోడ్లు మంజూరు కాగా, వీటికి రూ.3 కోట్ల నిధులు కేటాయించారు. వీటిలో ఇప్పటి వరకు 25 పనులు పూర్తవ్వగా, మిగిలినవి జరుగుతున్నాయి.

# రూ.60 కోట్లు... బూడిదలో పోసిన పన్నీరు!

కడప: గత వైకాపా ప్రభుత్వ హయాంలో అప్పటి సీఎం జగన్ తన సొంత నియోజకవర్గం పులివెందులలో సైతం అభివృద్ధి పనులు పూర్తి చేసుకోలేకపోయారు. చాలా వరకు పనులు ఎక్కడికక్కడే నిలిచి పోయాయి. చిత్తశుద్ధితో పనులు పూర్తి చేయాలనే ధ్యాస లేకుండా పోయిందనే విమర్శలు మూటగట్టుకున్నారు. రూ.కోట్లు ప్రజాధనం వెచ్చించినా ప్రయోజనం లేకుండా బూడిదలో పోసిన పన్నీరైంది. ఈ కోవకు చెందినదే సూక్ష్మసేద్యం ప్రాజెక్టు. సూక్ష్మసేద్యం ద్వారా ప్రతి ఎకరాకు సాగునీరందించాలనే లక్ష్యాన్ని గత వైకాపా ప్రభుత్వం నీరుగార్చింది. గతంలో అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి పాలనలో పెండింగ్‌లో ఉన్న సూక్ష్మసేద్యం ప్రాజెక్టు నిర్మాణ పనులు పూర్తిచేయాలనే లక్ష్యంతో 2021, మార్చిలో అప్పటి సీఎం జగన్ మరోసారి శిలాఫలకం ఆవిష్కరించారు.

క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు చేపట్టి ఏళ్లు గడిచినా ఎక్కడ వేసిన గొంగలిలా అక్కడే అన్న చందంగా నిలిచిపోయాయి. పులివెందుల నియోజకవర్గంలోని పైడిపాలెం, లింగాల కుడి కాలువ, పీబీఆర్ జలాశయాల పరిధిలోని మొత్తం 1,22,480 ఎకరాలకు సూక్ష్మసేద్యం ద్వారా సాగునీరందించే దిశగా ప్రయత్నాలు జరిగాయి. ఈ నేపథ్యంలో వాటి నిర్మాణపనులు పూర్తిచేసేందుకు రూ.1,256 కోట్ల అంచనాలతో పనులను మెగా కంపెనీకి వైకాపా ప్రభుత్వం కట్టబెట్టింది. 2021,



మార్చిలో చేసుకున్న ఒప్పందం ప్రకారం 2024, మార్చి ఆఖరి నాటికి వాటి పనులు పూర్తి చేయాల్సి ఉంది. ప్రస్తుతానికి 10.50 శాతం పనులు పూర్తి చేసి రూ.60 కోట్ల బిల్లులు గుత్తేదారుకు చెల్లించేశారు. సూక్ష్మసేద్యం పనులు పూర్తయితే కరవు నేలలో పచ్చని పైర్లతో కళకళలాడుతుంది.

**రెండేళ్లుగా ముందుకు సాగని పనులు :** ఆకృతుల మేరకు ఒక సంపు నుంచి సూక్ష్మసేద్యం పద్ధతిలో 100 నుంచి 120 ఎకరాలకు సాగునీరందేలా వాటి నిర్మాణాలు రూపుదిద్దాల్సి ఉంది. ఈ విధంగా 1,22,480 ఎకరాలకు సాగునీరు సరఫరా చేసేందుకు 1,275 సంపులు నిర్మించాల్సి ఉండగా, 60 సంపులు పూర్తి కాగా, మరో 10 వరకు నిర్మాణ దశలో నిలిచిపోయాయి. మిగతా సంపుల నిర్మాణాలు చేపట్టేందుకు కావాల్సిన భూసేకరణ కార్యక్రమం ఆగిపోయింది. ఒక్కో సంపు నిర్మాణానికి 60 సెంట్ల స్థలం కావాల్సి ఉంది. ఈ మేరకు స్థలాన్ని వదులుకునేందుకు చాలామంది రైతులు ముందుకు రాలేదు. ఎక్కువ విస్తీర్ణం భూమి ఉన్న రైతులు మాత్రమే ముందుకొచ్చారు. ఎకరా లేదా రెండు ఎకరాలు భూములు ఉన్న కర్షకులు ఆ మేరకు భూమి కోల్పోయేందుకు ససేమిరా అన్నారు. దీంతో క్షేత్రస్థాయిలో వాటి నిర్మాణాలు ముందుకు సాగలేదు. చేపట్టిన పనుల మేరకు సంపుల నుంచి నీటిని తోడేందుకు మోటార్లు, పొలాల్లో బిందు, తుంపర సేద్యం పరికరాలు అమర్చాల్సి ఉంది. గుత్తేదారు క్షేత్ర స్థాయి నుంచి వెళ్లిపోవడంతో ఎక్కడ పనులు అక్కడే ఆగిపోయాయి. దీంతో వెచ్చించిన రూ.60 కోట్లు వృథాగా పోయాయి.

# ఉల్లి లొల్లి ఉండదిక

కర్నూలు : ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఉల్లి రైతులకు మంచి రోజులు రానున్నాయి. దిగుబడులు భారీగా వస్తున్న నేపథ్యంలో కర్నూలు వ్యవసాయ మార్కెట్‌తోపాటు కోడుమూరులో ఉల్లి మార్కెట్ ఏర్పాటుతోపాటు విస్తరణకు కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. కోడుమూరులో ఉల్లి మార్కెట్ ఏర్పాటైతే సరకు రవాణాతోపాటు ఇతర ఖర్చుల భారం తగ్గనుంది. గూడూరులో ఉల్లి, టమాటా ఆహార శుద్ధి పరిశ్రమల ఏర్పాటుకు సైతం అడుగులు పడనున్నాయి. ఫలితంగా వేలాది మంది రైతులకు మేలు జరుగుతుంది.

రాష్ట్రంలోనే అత్యధికంగా ఉల్లి సాగయ్యే జిల్లాల్లో కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉంది. గతేడాది ఖరీఫ్‌లో రాష్ట్రంలో 68,979 ఎకరాల్లో ఉల్లి సాగవగా.. కర్నూలులో 43,211 ఎకరాలు, నంద్యాలలో 8,988 కలిపి మొత్తం 52,199 ఎకరాల్లో సాగైంది. ఉల్లి పండించిన రైతులు గ్రేడింగ్ చేసుకోవడంతోపాటు వాటిని ఆరబెట్టుకునేందుకు, గిట్టుబాటు ధరలు లభించనప్పుడు నిల్వ చేసుకునేందుకుగాను ఉల్లి గోదాములు



నిర్మించారు. కర్నూలు, కోడుమూరు, గూడూరు, పత్తికొండ మార్కెట్ పరిధిలో కృష్ణగిరిలో కలిపి దశాబ్దం కిందట 6-8 ఉల్లి గోదాములు ఏర్పాటు చేశారు. అప్పట్లో వాటి నిర్మాణానికి రూ. 2 కోట్లు వెచ్చించారు. ఆ గోదాముల్లో రైతులు పంటను నిల్వ చేసుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. గతేడాది నవంబరు వరకు పరిశీలిస్తే 6,65,760 క్వింటాళ్ల దిగుబడులు వచ్చాయి. 2023 నవంబరు నాటికి ఒక్క ఉల్లి అమ్మకాలపైనే కర్నూలు వ్యవసాయ మార్కెట్‌కు రూ. 82.71 లక్షల ఆదాయం రాగా.. గతేడాది నవంబరు వరకు పరిశీలిస్తే రూ. 1.72 కోట్లు సమకూరడం విశేషం.

**కోడుమూరులో క్రయవిక్రయాలు**


కర్నూలు వ్యవసాయ మార్కెట్కు అక్టోబరులో రికార్డు స్థాయిలో ఉల్లి దిగుబడులు వచ్చాయి. మరోవైపు సరకు నాణ్యతగా లేదంటూ వ్యాపారులు తక్కువ ధరకు కొనుగోలు చేశారు. దీనికితోడు సరకు భారీగా రావడంతో మార్కెట్‌లో దిగుబడులు దించలేని పరిస్థితి ఏర్పడింది. ఈ నేపథ్యంలో కోడుమూరు మార్కెట్‌లో వ్యాపారాలు నిర్వహించేందుకు రెండు ఉల్లి గోదాములను ఓపెన్ షెడ్లుగా మార్చాలని.. గోదాము లోపలి భాగాల్లో ఉన్న ఉల్లి నిల్వల అరలు తొలగించేందుకు చర్యలు చేపట్టారు. కర్నూలులో రెండు గోదాముల్లోని ఉల్లి షెడ్లను తొలగించేందుకు అనుమతి కోరుతూ రాష్ట్ర మార్కెటింగ్ శాఖ కమిషనర్‌ను జిల్లా అధికారులు లేఖ పంపారు. త్వరలో ఇవి ఓపెన్ షెడ్లుగా మారనున్నాయి.

# పోరంబోకు స్థలంలో రెవెన్యూ మాయ..!

నందిగాం : నందిగాం మండలంలో రెవెన్యూ గుట్టు బయట పడుతోంది. గతంలో కొండలు, గుట్టలకు పట్టాలిచ్చి వాటిపేరున పంటనష్ట పరిహారం పొందిన వ్యవహారంపై 'ఈనాడు' వెలుగులోకి తెచ్చింది. తాజాగా వైకాపా నేతలకు రూ.కోట్ల విలువైన గోర్జి పోరంబోకు స్థలాన్ని రెవెన్యూ అధికారులు ఫలహారంగా అందించారు.

**చర్యలు శూన్యం..**

ప్రస్తుత ప్రజాప్రతినిధి కుమారుడి వ్యవహారంపై విమర్శలు వస్తున్న నేపథ్యంలో ఒక్కొక్కటిగా అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. నందిగాంలో సర్వేనంబరు 40/6లో దివ్యాంగురాలైన ఓ మహిళకు ఇంటిపట్టా మంజూరు చేశారు. ఈ పట్టాలో లబ్ధిదారు ఫొటోపై ఓ తహసీల్దారు సంతకం, పట్టా వెనుక మరో తహసీల్దారు సంతకం ఉండటంతో అనుమానాలు రేకెత్తుతున్నాయి. ఈ స్థలానికి పంచాయతీ కార్యదర్శి నిరభ్యంతర ధ్రువపత్రం సైతం కొనుగోలుదారు పేరిట జారీచేసి ఉంది. దీనిపై ఆమెను అడిగితే సమాధానం లేదు. మరోసారి పరిశీలిస్తానంటూ ద్వంద్వవైఖరి ప్రదర్శిస్తోంది. మరోవైపు కొనుగోలుదారు తాను ప్రజాప్రతినిధి కుమారుడికి రూ. 3లక్షలు చెల్లించి ఈ స్థలాన్ని కొనుగోలుచేశానని రెవెన్యూ సిబ్బందికి స్టేట్‌మెంట్ ఇచ్చారు. ఇప్పటికే గణేష్ కాలనీలో 30కి పైగా స్థలాలు ప్రజాప్రతినిధి కుమారుడు



కైంకర్యంచేసి నకిలీపట్టాలతో అమ్మకాలు జరిపినట్లు విచారణలో వెలుగుచూసినప్పటికీ అధికారులు చర్యలు తీసుకోకుండా మీనమేషాలు లెక్కిస్తున్నారు. నందిగాం పంచాయతీ స్వామిపేట సర్వేనంబరు 232లో పేదలకు జారీచేసిన పట్టాభూములను ఆక్రమించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి.

**రెండు రకాలుగా నమోదు..**

నందిగాం సర్వేనంబరు 79 ఎస్ఎల్ఆర్‌లో గోర్జిపోరంబోకుగా నమోదై ఉంది. నందిగాంకు చెందిన ఓ మాజీ ప్రజాప్రతినిధికి, మరో ప్రజాప్రతినిధి కుమారుడికి వారసత్వంగా ఆ భూమి దక్కినట్లు తాజా 1బీలో నమోదైంది. 1434 ఫసలీలో పరిశీలిస్తే మాజీ ప్రజాప్రతినిధికి 37 సెంట్లు, ప్రస్తుత ప్రజాప్రతినిధి కుమారుడికి 25 సెంట్ల భూమి దాఖలు పడినట్లు ఉంది. 2020, జూన్ 15న మ్యుటేషన్ ద్వారా దాఖలు పడినట్లు దస్త్రాల్లో పేర్కొన్నారు. గోర్జి పోరంబోకు భూములు వారసత్వభూములుగా ఎలా దాఖలు పడ్డాయని రెవెన్యూ అధికారులను సంప్రదిస్తే మౌనమే వారి సమాధానం అవుతోంది.

**విచారణ చేయిస్తాం**

రెవెన్యూ భూముల్లో అక్రమాలు జరిగినట్లు ఇటీవల ఫిర్యాదులు అందాయి. సర్వేనంబరు 79లో ఇతరుల పేర్లు ఎలా చేరాయో నాకు తెలియదు. వాటిపై పూర్తివిచారణ చేసి అవసరమైన చర్యలు చేపడతాం. ఇటీవల అందిన పలు ఫిర్యాదులపై విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకుంటాం. సోమేశ్వరరావు, తహసీల్దార్, నందిగాం

# పంచాయతీల్లో.. నిధులు పంచుకున్నారు



చిత్తూరు : రామకుప్పం మండలం కొంగనపల్లి పంచాయతీ సర్పంచి గత వైకాపా ప్రభుత్వ హయాంలో పంచాయతీ కార్యదర్శికి తెలియకుండానే రూ. 7 లక్షలు డ్రా చేసినట్లు అధికారులకు ఫిర్యాదులందాయి. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు ఆరోపణలు వాస్తవమని తేల్చారు. అతడి చెక్ పవర్ రద్దుకు కలెక్టర్‌కు నివేదించగా ఆయన ఆమోదం రాగానే ప్రకటించే అవకాశం ఉంది.

బంగారుపాళ్యం మండలం తుంబకుప్పం పంచాయతీలో అక్రమాలు చోటుచేసుకున్నాయని ప్రభుత్వానికి ఫిర్యాదు అందింది. గతంలో పనిచేసిన పంచాయతీ కార్యదర్శి, వైకాపా నాయకులు కుమ్మక్కై పంచాయతీ నిధులు స్వాహా చేశారనేది ఆరోపణ. దీనిపై చిత్తూరు డీఎల్‌పీవో పార్వతిని విచారణకు ఆదేశించగా ఇప్పటికే రూ.లక్షలు దుర్వినియోగం చేసినట్లు వెలుగులోకి వచ్చింది. పన్నులు, అనుమతుల రుసుం పంచాయతీ ఖాతాకు జమకాక పోగా, పారిశుద్ధ్య కార్మికుల పేరుతో అదనంగా జీతాలు చెల్లించారు. ఈ విచారణ పూర్తయితే మరిన్ని అక్రమాలు వెలుగులోకి వస్తాయి.

కుప్పం నియోజకవర్గం.. రామకుప్పం మండలం బందార్లపల్లిలో గత వైకాపా ప్రభుత్వ హయాంలో చేయని పనులు చేసినట్లు చూపి ఆర్థిక సంఘ, సాధారణ నిధులనూ రూ.లక్షల్లో కాజేసినట్లు అధికారులకు ఫిర్యాదులు అందాయి. నిధుల దుర్వినియోగం తేలితే బాధ్యులపై చర్యలు చేపట్టాలని విచారణ బృందాన్ని నియమించారు.

గుడుపల్లె మండలం పీబీవాడ పంచాయతీ, వెదురుకుప్పం మండలం బొమ్మయ్యపల్లి పంచాయతీ, శాంతిపురం మండలం కర్లగట్ట పంచాయతీల్లో వైకాపా హయాంలో అక్రమాలు చోటుచేసుకున్నట్లు ఫిర్యాదులు అందాయి. వీటిని విచారించి నివేదించాలనే ఆదేశాల నేపథ్యంలో విచారణ మొదలైంది. వీటితోపాటు ఉమ్మడి జిల్లాలోని 1,411 గ్రామ పంచాయతీల్లో 200 గ్రామ పంచాయతీల్లో అవినీతి, అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి.

అక్రమార్కులు పల్లె పాలనా నిధులనూ వదల్లేదు. వైకాపా హయాంలో పంచాయతీ నిధులు భారీగా స్వాహా చేశారు. 14, 15వ ఆర్థిక సంఘం నిధులను నాటి వైకాపా ప్రభుత్వం దారి మళ్లించగా, మిగిలిన కాసిన్ని నిధులను ఆ పార్టీ నేతలు, సిబ్బంది పంచుకుతిన్నారు. వైకాపా అధికారం కోల్పోగానే అక్రమాలు వెలుగులోకి వస్తున్నాయి. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరు జిల్లాలోని పలు పంచాయతీల్లో అవినీతి, అక్రమాలు వెలుగులోకి రాగా మరికొన్ని పంచాయతీల్లోనూ వెలుగుచూస్తున్నాయి.

**లెక్కలు తీస్తున్న కూటమి ప్రభుత్వం..**

వైకాపా హయాంలో గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగం, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విడుదల చేసిన నిధులు, స్థానిక ఆదాయ వనరుల నుంచి వచ్చిన పన్నులు, ఇతరత్రా నిధులకు సరైన లెక్కలు లేవని, ఉన్న లెక్కలూ కాకి లెక్కలేననే విమర్శలు ఉన్నాయి. వైకాపా నాయకులతో కుమ్మక్కైన సంబంధిత పంచాయతీ సిబ్బంది నిధుల దుర్వినియోగానికి సహకరించినట్లు ఫిర్యాదులు ఉన్నాయి. ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమాలు నిగ్గు తేల్చే పని ప్రారంభించారు. ఫిర్యాదుల ఆధారంగా విచారణ బృందాలను నియమించి ఆయా పంచాయతీలకు విడుదలైన నిధులు, వాటి ఖర్చులు, లెక్కలు సరిచూస్తున్నారు. అక్రమాలు తేలితే సంబంధీకులపై చర్యలు చేపట్టనున్నారు.

**విచారణ సాగుతోంది..**

గ్రామ పంచాయతీల్లో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదులు అందుతున్నాయి. పలుచోట్ల అక్రమాలు జరిగినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికే విచారణ ప్రారంభించాం. నిధుల దుర్వినియోగం జరిగినట్లు తేలిన పంచాయతీల్లో సంబంధిత సిబ్బంది లేదా బాధ్యులైన సర్పంచులపై చర్యలు చేపడతాం. సుధాకర్‌రావు, డీపీవో

# పునాదులకే పరిమితం



సూళ్లూరుపేట : పట్టణాల్లోని రోగులకు మెరుగైన వైద్య సేవలందించే లక్ష్యంతో నాలుగేళ్ల కిందట కేంద్ర ప్రభుత్వం జాతీయ ఆరోగ్య మిషన్ కింద పురపాలికల్లో పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. తర్వాత సొంత భవనాలుండాలన్న లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం నిధులను రాష్ట్రానికి కేటాయింపులు చేసింది. రాష్ట్ర ప్రభుత్వం టెండర్లు నిర్వహించి గుత్తేదారులకు పనులు అప్పగించింది. గుత్తేదారులకు ప్రభుత్వం బిల్లులు చెల్లించకపోవడంతో పనులు అసంపూర్తిగానే నిలిచిపోయాయి. మరికొన్ని చోట్ల పనులు నేటికీ ప్రారంభం కాలేదు. అద్దె భవనాల్లో ఆరోగ్య కేంద్రాలను నిర్వహిస్తూ ఇటు సిబ్బంది, అటు రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వైకాపా ప్రభుత్వంలో 2020లో తిరుపతి జిల్లాలోని నగరపాలక సంస్థతోపాటు పురపాలక సంఘాల్లో 26, చిత్తూరు జిల్లాలోని నగర పాలక సంస్థతోపాటు పలమనేరు, కుప్పం, నగరి, పుంగనూరు పురపాలక సంఘాల్లో 14 పట్టణ ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేసింది. వీటికి భవనాలు నిర్మించేందుకు 2020 నవంబరులో నిధులు మంజూరు చేసింది. ఒక్కో కొత్త భవన నిర్మాణానికి రూ. 80 లక్షలు చొప్పున కేటాయింపులు చేశారు. పాత భవనాల మరమ్మతులకూ నిధులిచ్చారు.

**ఎక్కడంటే..**

చిత్తూరు 4, పలమనేరు, పుంగనూరు, పుత్తూరు, నగరిలో రెండు చొప్పున, శ్రీకాళహస్తిలో 1, తిరుపతిలో 7, కుప్పం 1, గూడూరులో 1, వెంకటగిరిలో 1, నాయుడుపేట, సూళ్లూరుపేట రెండు చొప్పున కొత్త భవనాలు నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు.

**కొన్నింటిని పరిశీలిస్తే..**

సూళ్లూరుపేట పురపాలకలోని మన్నారుపోలూరులో 75 శాతం పనులు పూర్తయ్యాయి. బిల్లుల చెల్లింపులు లేని కారణంతో గుత్తేదారు పనులను నిలిపేశారు. ఇక్కడే దేగపాలెం పరిధిలో శిలాఫలకం మాత్రమే వేశారు. గూడూరు పురపాలకలో అసంపూర్తిగా పనులున్నాయి. వెంకటగిరిలో పునాదులకే పరిమితమైంది.

పుత్తూరు ఒక భవనాన్ని నిర్మించి పూర్తి చేశారు. మరోచోట నిర్మాణం పూర్తి కాలేదు. పలమనేరులోనూ పనులు పూర్తి కాలేదు.

**పాత భవనాల మరమ్మతులకు..**

చిత్తూరులో 3, శ్రీకాళహస్తిలో 2, తిరుపతిలో 5, గూడూరు 2, వెంకటగిరిలో ఒక భవనం మరమ్మతులకు నిధులు మంజూరు చేశారు.

# సచివాలయాల్లో ఆధార్ శిబిరాలు



చిత్తూరు : ప్రతి ఒక్కరికీ ఆధార్ తప్పనిసరిగా ఉండాలి. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలకు, విద్య, ఉద్యోగాల్లో ప్రవేశాలకు దీనిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తప్పనిసరి చేశాయి. కొందరి కార్డుల్లో తప్పులు ఉన్నాయి. వీటిని సవరించుకోవడానికి ప్రభుత్వం అవకాశం కల్పించింది. సచివాలయాల్లో ప్రత్యేక శిబిరాలను నిర్వహిస్తోంది. ప్రతి పదేళ్లకు ఒకసారి ఆధార్‌కార్డును తప్పనిసరిగా నవీకరణ చేయాలి. వృద్ధుల్లో చాలా మందికి వేలిముద్రలు అరిగిపోతాయి. ఈ క్రమంలో ఐరిస్ వీరికి ఉపయోగపడుతుంది. పింఛన్ల పంపిణీ సమయంలో వేలిముద్రలు నమోదు కాకపోతే వారికి ఐరిస్ ఆధారంగా పింఛను సొమ్ము అందిస్తున్నారు. చాలా మంది ఆధార్‌కార్డు నవీకరణ చేయించుకోకపోవడంతో పథకాల లబ్ధికి దూరమవుతున్నారు. అప్పుడే పుట్టిన బిడ్డ దగ్గర నుంచి అయిదేళ్లలోపు వారికి బాల ఆధార్ కార్డులు ఇస్తున్నారు. ఈ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం కల్పించారు. జిల్లాలోని 56 సచివాలయాల్లో ఆధార్ ప్రత్యేక శిబిరాలు ఈనెల 30 వరకు జరగనున్నాయి. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటలకు వరకు అందుబాటులో ఉంటాయి. ఆధార్ కార్డుల్లో పేరు, ఫొటో, చరవాణి, చిరునామా మార్పులు చేసుకోవచ్చు.

ఇతర ప్రాంతాల నుంచి వలసలు వచ్చి స్థిరపడిన వారికి ఇది సరైన అవకాశం. కార్డుల్లో దొర్లిన తప్పులను సరిచేసుకోవచ్చు. సరైన ధ్రువపత్రాలతో పుట్టిన తేదీ, పేరు మార్పులు చేసుకోవచ్చు. అయిదేళ్లలోపు వారికి కొత్త కార్డులు ఇస్తారు.

**శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలి:** సచివాలయాల్లో నిర్వహిస్తున్న ఆధార్ శిబిరాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి. ఈనెల 30 వరకు శిబిరాలు జరుగుతాయి. కార్డులు తీసుకుని పదేళ్లు దాటిన సమయంలో తప్పనిసరిగా కార్డు నవీకరణ చేసుకోవాలి.. మంజులవాణి, గ్రామ, వార్డు సచివాలయ అధికారిణి

# పన్ను వసూళ్లు పడక

గిద్దలూరు : జిల్లాలోని పురపాలక సంఘాల్లో పన్ను వసూలు నత్తనడకన సాగుతోంది. ఇప్పటికీ లక్ష్యానికి ఆమడ దూరంలో ఉన్నారు. మున్సిపాలిటీలకు ఆదాయం సమకూరకపోతే సిబ్బంది జీతాలు, విద్యుత్తు బిల్లులు చెల్లించేదెలా అని యంత్రాంగంలో ఆందోళన వ్యక్తమవుతోంది. జిల్లాలోని ఒంగోలు నగరపాలికతో పాటు మిగతా పురపాలక సంఘాల్లో ఇంటి పన్ను వసూళ్ల ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ విభాగాల్లో పనిచేస్తున్న అప్కాస్, ఒప్పంద ఉద్యోగుల జీతాలు, విద్యుత్తు బిల్లుల చెల్లింపులకు ఈ నిధులనే వినియోగించాల్సి ఉంది. గతంలో పలు మున్సిపాలిటీల్లో పారిశుద్ధ్య, ఇంజినీరింగ్ సిబ్బందికి జీతాలు నెలల తరబడి చెల్లించలేని దుస్థితి ఎదురైంది. ఈ నేపథ్యంలో వసూళ్లలో వేగం పెంచాల్సిన అవసరముంది. జిల్లావ్యాప్తంగా 1,25,065 అసెస్‌మెంట్లకు గానూ ఈ ఏడాది



మార్చి చివరి నాటికి రూ. 65.69 కోట్లు వసూలు లక్ష్యం కాగాబీ ఈ నెల 22వ తేదీ నాటికి కేవలం రూ. 34.67 కోట్లు మాత్రమే వసూలు చేశారు. ఈ ఏడాది ఆర్థిక సంవత్సరం లక్ష్యంలో ఇది కేవలం 52.78 శాతం మాత్రమే !

**సమావేశాలతో సరి..**

మార్చి చివరి నాటికి రూ. 1.88 కోట్లు వసూలు చేసి 67.80 శాతం లక్ష్యాన్ని చేరుకుని చీమకుర్తిబీ ఒంగోలు నగర పాలక సంస్థ, మిగిలిన వాటి కన్నా ముందంజలో ఉంది. పొదిలి నగర పంచాయతీలో మార్చి చివరి నాటికి రూ. 2.49 కోట్లు వసూలు లక్ష్యం కాగా, ఈ నెల 22వ తేదీ నాటికి కేవలం రూ. 83 లక్షలు మాత్రమే వసూలు చేశారు. జిల్లాలో వసూళ్లు మందగమనంలో ఉండటంతో ఉన్నతాధికారులు వీటిపై దృష్టి సారించారు. సచివాలయ సిబ్బందితో నిత్యం సమావేశాలు నిర్వహిస్తున్నారు. మిగిలింది కేవలం రెండు నెలలేనని చురుగ్గా చేయాలని వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. సచివాలయాల పరిధిలోని గృహ యజమానుల ఇళ్ల వద్దకు వెళ్లి సత్వరం చెల్లించాల్సిందిగా వారికి అవగాహన కల్పించాలని వారికి సూచిస్తున్నారు.

# అతి సర్వత్రా వర్జయేత్!

ఒంగోలు : గత రెండేళ్ల కాలం పొగాకు రైతులకు కలిసొచ్చింది. మార్కెట్‌లో అనూహ్యమైన ధరలు లభించి మంచి లాభాలు తెచ్చి పెట్టింది. ఈ ఏడాదీ అదే ఆశతో అధిక విస్తీర్ణంలో పంట సాగు చేస్తున్నారు. ఈ క్రమంలో బోర్డు అనుమతిని విస్తీర్ణం ఇప్పటికే దాటేసింది. అదును దాటినా ఇంకా కొందరు సాగుకు మొగ్గు చూపుతున్నారు. వచ్చే నెలాఖరు నుంచి అమ్మకాలు ప్రారంభం కానున్నా.. కూలీలతో నాట్లు వేయిస్తున్నారు. మరోవైపు ఆకు కొట్టుడు పనులూ ముమ్మరంగా చేయిస్తున్నారు.



**ఇప్పటికే 83 వేల హెక్టార్లు:** కర్ణాటకలో పంట దిగుబడి తగ్గడం.. అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి డిమాండ్ రావడంతో ఆంధ్రా సీజన్‌కు గత కాలంలో మంచి గిరాకీ లభించింది. ఈ ఏడాది కూడా అదే ఆశతో ఉన్నారు. 2024-25 సీజన్‌కు ఎస్‌బీఎస్, ఎస్ఎల్ఎస్ రీజియన్ల పరిధిలో 67,550 హెక్టార్లలో బోర్డు అనుమతివ్వగా.. అంతకుమించి 83 వేల హెక్టార్లలో సాగు చేశారు. అంటే ఇప్పటికే 15,450 హెక్టార్లు ఎక్కువ. ఇంకా నాట్లు కొనసాగుతుండటంతో ఈ విస్తీర్ణం మరింత పెరగనుంది. **అధిక వడ్డీలకు తెచ్చి పెట్టుబడులు:** సాగు చివరి దశకు చేరుకున్నాక డిసెంబర్ మొదటి వారంలో 'ఫెయింజల్' తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిశాయి. జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల హెక్టార్లలో పంట దెబ్బతింది. పొగాకు బోర్డు, వ్యవసాయ శాఖ నుంచి ఎలాంటి పరిహారం అందలేదు. చేతిలో చిల్లిగవ్వ లేకున్నా... పొగాకు బోర్డు, ప్రభుత్వం ఆదుకోకున్నా రైతులు అధిక వడ్డీలకు ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించారు. దెబ్బతిన్న ప్రాంతాల్లో మళ్లీ సాగు చేశారు. ప్రస్తుతం నాట్లు జాప్యం కావడం... ఈ నెలాఖరు నుంచి పగటి ఉష్ణోగ్రతలు పెరగనుండటం దిగుబడులపై ప్రభావం చూపనుంది. ప్రస్తుత సీజన్‌లో సాగు పెరిగినా.. అందుకు తగ్గట్టు దిగుబడి రాకుంటే నష్టం తప్పదనే ఆందోళనలో రైతులున్నారు.

# ఉపాధిలో 'పండు'గ

గజపతినగరం : జిల్లాలో ఉద్యాన పంటలంటే ఎక్కువగా మామిడి, జీడి సాగే కనిపిస్తోంది. ఇవేకాకుండా కొత్తగా డ్రాగన్ ఫ్రూట్, అరటి, జామ, సీతాఫలం, సపోటా, ఆయిల్‌పామ్, కొబ్బరి తదితర 9 రకాల పంటల సాగుకు వీలుగా రాష్ట్ర ప్రభుత్వం రైతులకు చేయూత అందిస్తోంది. ఉపాధి హామీ పథకంలో పంటకు అయ్యే ఖర్చులో 75 శాతం వరకు రాయితీ ఇస్తోంది.

**ప్రోత్సాహం ఇలా..**

గోతులు తవ్వేందుకు పూర్తి నిధులు అందిస్తారు.

రైతు కోరితే ప్రభుత్వ నర్సరీల్లో మొక్కలు ఉచితంగా సరఫరా చేస్తారు. బయట నర్సరీల్లో కొనుగోలు చేస్తే ప్రభుత్వం ధర నిర్ణయించి, చెల్లిస్తుంది.

ప్రతి నెలా మొక్కకు నీరు పోయడానికి, సంరక్షణకు రూ. 30 వరకు చెల్లిస్తారు.

ఎరువులకు చెల్లింపులు ప్రభుత్వమే చేస్తుంది.

**ఆసక్తి మేరకు ఎంపిక** జిల్లాలో ఉపాధి హామీ పథకంలో రైతులు ఉద్యాన పంటలు సాగు చేస్తున్నారు. పొలం పరిస్థితి, ఆసక్తి మేరకు కోరిన పంటలు వేసుకునేందుకు మంజూరు చేస్తున్నాం. వారికి రాయితీలు కూడా ఇస్తున్నాం. సుభద్రాదేవి, జిల్లా పథక సంచాలకురాలు

# దాహార్తి తీర్చేలా.. ప్రత్యామ్నాయ ప్రణాళిక

చిత్తూరు : తిరుపతి జిల్లా వాకాడు మండలం దుగరాజ పట్నం పంచాయతీ కొండూరుపాళెంలో రూ.90 లక్షలతో ఉపరితల ట్యాంకు నిర్మించారు. బోరు మాత్రం వేయలేదు. ఫలితంగా అంజలాపురం, కొండూరుపాలెం మత్స్యకార గ్రామాల్లోని దాదాపు 500 కుటుంబాలకు ఇబ్బందులు ఎదురవుతున్నాయి. వేసవి వచ్చిందంటే చాలు గ్రామాల్లో నీటి కష్టాలు మొదలవుతాయి. పల్లెల్లోని మహిళలు ట్యాంకర్ల కోసం పడిగాపులు కాయడం రివాజుగా మారుతోంది. గతేడాది నవంబరు, డిసెంబరులో భారీ వర్షాలు కురవడంతో కొంతమేర కష్టాలు తీరాయి. భూగర్భ జలాలు పడిపోయిన ప్రాంతాల్లో ఇబ్బందులు తప్పవని అధికారులు అంచనా వేశారు. నీటి ఎద్దడి నివారణకు ఇప్పటికే జనవరి నుంచి జూన్ వరకు ప్రణాళికలు రూపొందించారు. పూర్తిస్థాయిలో ప్రణాళిక అమలైతే ప్రజల గొంతు ఎండే పరిస్థితి తప్పుతుంది. తిరుపతి జిల్లాలో శ్రీకాళహస్తి, సత్యవేడు,



చంద్రగిరి నియోజకవర్గాల్లో పెద్దగా ఇబ్బందులు లేవు. చాలా చెరువులు ఇప్పటికే నిండిపోయాయి. గూడూరు, వెంకటగిరి, సూళ్లూరుపేటలో మాత్రం అవస్థలు తప్పేలా లేవు. గతంలో ఉపరితల ట్యాంకులు నిర్మించినా కొన్నిచోట్ల బోర్లు, మోటార్లు వేయలేదు. రూ.లక్షలు వెచ్చించిన నిర్మాణాలు దిష్టిబొమ్మలను తలపిస్తున్నాయి. గూడూరు నియోజకవర్గంలో చిల్లకూరు, గూడూరు, వాకాడు.. సూళ్లూరుపేటలో దొరవారి సత్రం, ఓజిలి, పెళ్లకూరులో జలగండం పొంచి ఉంది.

**కష్టాలిలా..**చిత్తూరు జిల్లాలోనే ప్రత్యామ్నాయ ప్రణాళికకు ఎక్కువ ఖర్చవుతోంది. పలమనేరు, కుప్పం నియోజకవర్గాల్లో చెరువులు ఎండిపోవడంతో భూగర్భ జలాలు పడిపోయాయి. ట్యాంకర్ల ద్వారా నీరు సరఫరా చేయాలి. 800-1000 అడుగుల లోతు వరకు బోర్లు తవ్వాల్సిన పరిస్థితి. జనవరి నుంచి జూన్ వరకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లకు రూ.13.56 కోట్లు ఖర్చవుతోందని అంచనా. ఇప్పటికే గుడుపల్లె, బైరెడ్డిపల్లె మండలాల్లో పలుమార్లు మహిళలు రోడ్డెక్కి దాహార్తి తీర్చాలని డిమాండ్ చేశారు.

# ఇంటిపై సౌరభాలు

కర్నూలు : కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పీఎం సూర్యఘర్ పథకాన్ని ఉమ్మడి కర్నూలు జిల్లాలో భారీఎత్తున ప్రోత్సహించాలని నిర్ణయించారు. ఎస్సీ, ఎస్టీలకు ప్రభుత్వం ఉచితంగా ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. ప్రస్తుత సంవత్సరంలో లక్ష మందికి పైగా లబ్ధిదారులకు అందించేలా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టారు. ఫలితంగా వారికి బిల్లు రాయితీ రావడంతోపాటు వారి ఇంటి సౌర ఫలకాల నుంచి ఉత్పత్తి అయ్యే విద్యుత్తుకు ప్రభుత్వమే డబ్బులు చెల్లించనుంది. దీంతోపాటు సూర్యఘర్ పథకానికి సంబంధించి నియోజకవర్గానికి ఒక గ్రామం చొప్పున మోడల్ ప్రాంతంగా తీర్చిదిద్దనున్నారు. ఆయా గ్రామాల్లో అన్ని ఇళ్లకు సౌర విద్యుత్తు యూనిట్లు ఏర్పాటుచేయించే దిశగా చర్యలు తీసుకుంటారు. ఒకసారి ఆ యూనిట్‌తో ఎలాంటి అదనపు ఖర్చు లేకుండా రెండున్నర దశాబ్దాలపాటు సౌర ఫలకల నుంచి విద్యుత్తు ఉత్పత్తి చేసుకోవచ్చు. 25 ఏళ్ల తర్వాత కూడా కొన్నేళ్లపాటు తక్కువ మొత్తాల్లో విద్యుదుత్పత్తి జరుగుతుంది.

**పుచ్చకాయలమడ వాసులకు ఉచితం**

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గతేడాది అక్టోబరు ఒకటో తేదీన పుచ్చకాయలమడ గ్రామానికి వచ్చారు. ఈ నేపథ్యంలో ఆ గ్రామంలోని ప్రతి ఇంటికి పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతోనే సౌర విద్యుత్తు యూనిట్లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. గ్రామంలోని 450 ఇళ్లకు సౌర విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటుచేసేందుకు రూ.27 కోట్లు ఖర్చవుతుందని అంచనావేసి రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రాగానే గ్రామంలోని ప్రతి ఇంటికి సౌర విద్యుత్తు ఉత్పత్తి చేసే వ్యవస్థలను ఏర్పాటుచేస్తారు.

**అంతకు మించితే 78 వేలు**

ఆయా యూనిట్లు ఏర్పాటుచేసుకున్న 15 రోజుల్లోపే రాయితీ మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ చేస్తుంది. ఒక కిలోవాట్ సామర్థ్యమున్న యూనిట్ ఏర్పాటుకు సుమారు రూ.60 వేల చొప్పున ఖర్చవుతుంది. ప్రభుత్వం ఇచ్చిన రాయితీ పోగా మిగిలిన పెట్టుబడి.. విద్యుత్తు వినియోగాన్ని బట్టి సుమారు ఐదారేళ్లలో వెనక్కి వచ్చేస్తుందని అంచనా వేశారు.

**ప్రతినెలా రూ.1,200 వరకు మిగులుబాటు**

– లక్ష్మణ గుప్తా, అధ్యాపకులు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల (బాలురు), కర్నూలు

నేను రూ.1.80 లక్షలు వెచ్చించి కర్నూలు వెంకటరమణ కాలనీలోని ఇంటిపై మూడు కిలోవాట్ల సామర్థ్యమున్న సౌర విద్యుత్ యూనిట్‌ను ఐదు నెలల కిందట ఏర్పాటుచేసుకున్నా. రోజుకు సుమారు 12 యూనిట్ల విద్యుత్తు ఉత్పత్తి అవుతోంది. గతంలో ప్రతి నెలా రూ.1,500 నుంచి రూ.1,800 వరకు విద్యుత్తు బిల్లు వచ్చేది. సౌర విద్యుత్తు వ్యవస్థ ఏర్పాటుచేసుకున్న తర్వాత ప్రస్తుతం నామమాత్రపు బిల్లు రూ.300 వస్తోంది. అదనంగా ఉత్పత్తి అయ్యే విద్యుత్తుకు యూనిట్‌కు రూ.2.09 చొప్పున చెల్లిస్తామన్నారు. నేను యూనిట్ ఏర్పాటుచేసుకున్న 15 రోజుల్లోపే ప్రభుత్వం నుంచి రావాల్సిన రాయితీ రూ.78 వేలు జమైంది.

| సామర్థ్యం | రాయితీ (రూ.లలో) |
|---|---|
| ఒక కిలోవాట్ | 30 వేలు |
| రెండు కిలోవాట్లు | 60 వేలు |

రిజిస్టర్ చేసుకున్న లబ్ధిదారులు
కర్నూలు: 70,885
నంద్యాల: 85,704

ఇప్పటివరకు ఏర్పాటు చేసిన యూనిట్లు
కర్నూలు: 172
నంద్యాల: 88

# విద్యా సమస్యలు పరిష్కారమయ్యేనా!



అనంతపురం : పాఠశాల విద్యాశాఖ కమిషనర్ విజయ రామరాజు ఈ నెల 24న జిల్లాకు రానున్నారు. 117 జీవో రద్దుకు ప్రత్యామ్నాయం, పంచాయతీ పరిధిలో ఆదర్శ ప్రాథమిక పాఠశాలల ఏర్పాటు, స్కూల్ కాంప్లెక్స్ పునర్ నిర్మాణం తదితర అంశాలపై చర్చించడానికి ఆయన అనంతకు రానున్నారు. జేఎన్‌టీయూ ఆడిటోరియంలో అధికారులతో సమావేశం నిర్వహిస్తున్నారు. అనంత జిల్లాలోని సమగ్ర శిక్షా కార్యాలయం, ప్రభుత్వ పాఠశాలల్లో నెలకొన్న సమస్యలపై ఆయన దృష్టిసారిస్తారనిని ఉపాధ్యాయ సంఘాలు ఆశతో ఎదురు చూస్తున్నారు.

**గాడితప్పిన సమగ్రశిక్షా పథకం**

పాఠశాల విద్యావ్యవస్థలో సమగ్రశిక్షా పథకం కీలకం. పాఠశాలల్లో అమలు చేసే ప్రతి సంక్షేమ కార్యక్రమం ఈ పథకం ద్వారానే అమలు చేస్తారు. ఇందులో 8 విభాగాలున్నాయి. కీలకమైన సెక్టోరియల్ అధికారులు లేరు. వైకాపా ప్రభుత్వ హయాంలో అడ్డగోలుగా అధికారులను నియమించారు. వారందరినీ కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత పాఠశాలలకు పంపించారు. కొత్తగా సెక్టోరియల్ అధికారుల నియామకానికి గత సంవత్సరం ఆగస్టు 1న ప్రకటన జారీ చేశారు. దరఖాస్తులు స్వీకరించి, మౌఖిక పరీక్షలు కూడా నిర్వహించారు. అధికారులను మాత్రం నియమించలేదు. కార్యాలయంలోని పోస్టులన్నీ ఖాళీగా ఉన్నాయి. దీంతో కార్యాలయంలో వ్యవహారాలన్నీ గాడితప్పుతున్నాయి.

**నియామకాల్లో అవకతవకలు**

సమగ్రశిక్షా పథకంలోనే కస్తూర్బాగాంధీ బాలికా విద్యాలయాలున్నాయి. వాటి పర్యవేక్షణ బాధ్యత జీసీడీఓ (గర్ల్ ఛైల్డ్ డెవలప్‌మెంట్ అధికారి) నిర్వహించాలి. జీసీడీవో పోస్టును ఓ ఎంఈవోను తాత్కాలికంగా నియమించారు. మౌఖిక పరీక్షలు నిర్వహించి కూడా అధికారిని నియమించకపోవడంతో కేజీబీవీల పర్యవేక్షణ గాలికి వదిలేశారు. కస్తూర్బా బాలికా విద్యాలయాల్లో విద్యార్థినులు వివిధ సమస్యలతో ఇబ్బంది పడుతున్నారు. వాటికి బయటకు రాకుండా కప్పిపెడుతున్నారు. ఇటీవల కేజీబీవీల్లో బోధనేతర సిబ్బంది 64 మందిని నియమించారు. ఈ నియామకాల్లో అడ్డగోలు వ్యవహారాలు చోటుచేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. కేజీబీవీల్లో చదువుకొనే విద్యార్థినులంతా పేద కుటుంబాలకు చెందిన వారే. వారిని పట్టించుకోవడం లేదన్న విమర్శలు వస్తున్నాయి.

**పదోతరగతి విద్యార్థులపై ఏదీ శ్రద్ధ?**

పదో తరగతి విద్యార్థులపై అధికారులు ఏ మాత్రం శ్రద్ధ తీసుకోవడం లేదు. ఉత్తీర్ణత శాతం పెంచాలనే ఉద్దేశంతో 100 రోజుల కార్యాచరణను ప్రవేశపెట్టారు. కార్యాచరణ తూతూమంత్రంగా నిర్వహిస్తున్నారు. ఎంఈవోలు, ఉప విద్యాశాఖాధికారులు 100 రోజుల కార్యాచరణను పర్యవేక్షించాలి. పర్యవేక్షణ లేక పాఠశాలల్లో సక్రమంగా జరగడంలేదు. మధ్యాహ్న భోజన పథకాన్ని కూడా పరిశీలించేవారు కరవయ్యారు.

# నగరమా.. ఊపిరి పీల్చుకో!




విశాఖపట్నం: నగరాన్ని కాలుష్యం కమ్మేయకుండా విశాఖ పోర్టు అథార్టీ (వీపీఏ) రంగం సిద్ధం చేసింది. ఒకవైపు కొండలు, మరోవైపు సాగరం... వీటి మధ్య విస్తరించిన నగరంపైకి సముద్రం మీదుగా నుంచి వచ్చే గాలులతో విశాఖ పోర్టులో నిల్వ చేసిన బొగ్గు, ఇనుప ఖనిజ ధూళికణాలు ఉక్కిరిబిక్కిరి చేస్తున్నాయి. ఇదే విషయంపై కాగ్ గతంలో గట్టిగా ప్రస్తావించింది. ఈ నేపథ్యంలో పోర్టు స్టాకు పాయింట్లలో నిల్వలపై టార్పాలిన్లు కప్పడం, వ్యర్థ జలాలను శుద్ధి చేసి స్ప్రింక్లర్లతో జల్లుతూ దుమ్ము గాల్లోకి లేవకుండా చర్యలు చేపట్టారు. అయితే ఇది శాశ్వత పరిష్కారం కాదని నిపుణుల కమిటీ సూచించింది. ఈ నేపథ్యంలోనే కవర్డ్ షెడ్లు సిద్ధం చేశారు.

**కాలుష్య నియంత్రణకు కట్టుబడి:** పోర్టు పరిసరాలు నైరుతి ప్రాంతంలో ఉండటంతో ఏడాదిలో పది నెలలు ఈ దిశగా గాలులు వీస్తుంటాయి. పోర్టులో ప్రధానంగా బొగ్గు, ఇనుప ఖనిజం రవాణా... నిల్వ సాగుతాయి. దీంతో గాలులకు దుమ్ము...ధూళి నగరం వైపు ఎగిరొస్తాయి. కాలుష్య నియంత్రణకు అత్యాధునికమైన కవర్ షెడ్లు నిర్మించేందుకు పోర్టు నాలుగేళ్ల క్రితం నిర్ణయించింది. ఈ ప్రాజెక్టుకు రూ.117 కోట్లు ఖర్చు చేసి.. 2.94లక్షల మెట్రిక్ టన్నుల ఖనిజాలు నిల్వ చేసుకునేలా నాలుగు షెడ్లు నిర్మించారు. – 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి మూడు త్రైమాసికాల్లో 60 మిలియన్ మెట్రిక్ టన్నుల కార్గో(సరకు రవాణా)ను విశాఖ పోర్టు నిర్వహించింది.

**చర్చించిన తరువాత...**నాలుగు కవర్ షెడ్ల నిర్మాణం పూర్తయినప్పటికీ సరకు నిల్వ చేయలేదు. నిల్వ ప్రదేశానికి స్టీవ్‌డోర్స్ (వ్యాపారులు) కొంత అద్దె చెల్లించాల్సి ఉంటుంది. ఈ అద్దె ధరల విషయంలో వీపీఏకు, వ్యాపారులకు మధ్య సమన్వయం కుదరలేదు. దీంతో పోర్టు ఛైర్మన్ అంగముత్తు ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. అందరికీ ఆమోదయోగ్యంగా ముందుకెళ్లాలని నిర్ణయించడంతో సమస్య పరిష్కారమైంది. ఇకపై ఈ షెడ్లలోనే బొగ్గు, ముడి ఇనుప ఖనిజం వంటివి నిల్వ చేయనున్నారు. అలా చేస్తే ఇప్పటి వరకూ వేధిస్తున్న ధూళి సమస్య తీరనుంది. సమీప కాలనీల్లో ప్రజలు ఊపిరితిత్తుల, శ్వాసకోస, కంటి సమస్యల నుంచి ఉపశమనం పొందుతారు.

# అవినీతి అడ్డా.. అనిశా కొరడా..




అనకాపల్లి : మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అనకాపల్లి జోన్‌లోని ప్రణాళికా విభాగం అవినీతికి అడ్డాగా మారింది. ఈ విభాగంలోని మామూళ్ల మత్తులో నిబంధనలు అన్నీ తుంగలో తొక్కారని అవినీతి నిరోధక శాఖ నిగ్గు తేల్చింది. దీనిపై గతంలో పనిచేసిన జోనల్ కమిషనర్‌తోపాటు మరో పదిమంది ప్రణాళికా విభాగం అధికారులు, సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు పురపాలక శాఖ గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. జీవీఎంసీ అనకాపల్లి జోన్ ప్రణాళికా విభాగంపై ఎప్పటి నుంచో ఫిర్యాదులు ఉన్నాయి. దీంతో 2022 ఆగస్టు 4వ తేదీన అనిశా అకస్మిక తనిఖీలు చేసింది. ఆ శాఖ అధికారులు రెండు రోజులపాటు ప్రణాళికా విభాగం కార్యాలయంలో రికార్డులను నిశితంగా పరిశీలించారు. అనంతరం పట్టణంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. చోడవరం రహదారిలోని గుండాల కూడలి, గాంధీనగరం రామాలయం వీధితోపాటు పలు ప్రాంతాల్లో నూతనంగా నిర్మిస్తున్న భవనాలను పరిశీలించారు. ప్లాన్‌కు విరుద్ధంగా నిర్మాణాలు జరుగుతున్నట్లు గుర్తించారు. దీనికి సంబంధించి ప్రణాళికా విభాగంలోనే పలు లోపాలు ఉన్నట్లు నిర్ధారణకు వచ్చారు. కీలకమైన కొన్ని డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నారు. అప్పట్లో అవినీతికి పాల్పడి బదిలీపై వేరే ప్రాంతాలకు వెళ్లిన అధికారులపై దృష్టి పెట్టారు. బదిలీపై వెళ్లే సమయంలో చివరి నిమిషంలో నిబంధనలకు విరుద్ధంగా కొందరికి అనుమతులు ఇచ్చినట్లు

అనిశా అధికారులు గుర్తించారు. మార్కెట్ యార్డు వెనుకవైపు సరైన రహదారి లేకపోయినా మూడు అంతస్తుల భవనాలకు అనుమతులు ఇవ్వడం, సెల్లార్‌కు అనుమతులు తీసుకొని దర్జాగా గదులు నిర్మించుకోవడం, ఎలాంటి అనుమతులు లేకుండానే పెంట్‌హౌస్ పేరుతో నిర్మాణాలు సాగించడం వంటి పలు అంశాలు అనిశా అధికారుల తనిఖీల్లో బయటపడ్డాయి. **చర్యలు వీరిపైనే...:** ప్రణాళికా విభాగంలో లోపాలకు సంబంధించి 2022లో జోనల్ కమిషనర్‌గా పనిచేసిన కె.కనక మహాలక్ష్మితోపాటు అప్పట్లో ఈ విభాగంలో పనిచేసిన మరో పదిమంది అధికారులు, సిబ్బందిపై చర్యలకు పురపాలక శాఖ ఉన్నతాధికారులు ఆదేశాలిచ్చారు. అసిస్టెంట్ సిటీ ప్లానర్స్ డి.శ్రీనివాసరావు, పి.రోహిణి, పి.అమ్మాజీరావు, టౌన్ ప్లానింగ్ సూపర్‌వైజర్లు జి.విజయ్‌కుమార్, ఎస్.వరప్రసాదరావు, టౌన్ ప్లానింగ్ అధికారి జి.నాగలత, సర్వేయర్ డి.వెంకటరమణ, జూనియర్ అసిస్టెంట్లు పి.శివమూర్తి, ఎన్.రాములు, చైన్‌మెన్ వై.అప్పలరాజుపై చర్యలు తీసుకోనున్నారు.

# సిలికా దోపిడీ రూ. 266 కోట్లు!

చిల్లకూరు : వైకాపా హయాంలో మునుపెన్నడూ లేని విధంగా ప్రకృతి వనరులు విధ్వంసానికి గురయ్యాయి. తీర ప్రాంతంలో రెండేళ్ల కిందట సిలికా దోపిడీకి పథకం రచించారు. లీజుదారులను పక్కన పెట్టి అనుమతులు లేని విస్తీర్ణంలోనూ తవ్వకాలకు తెగబడ్డారు. దాదాపు 30-40 అడుగుల లోతు దర్శనమిస్తున్న గుంతలే ఇందుకు సాక్ష్యం. తీరప్రాంత గ్రామాలైన చింతవరం, బల్లవోలు, వేళ్లపాలెం, తూర్పుకనుపూరు, అద్దేపల్లి, ఏరూరు, మోమిడి, వరగలి, తమ్మినపట్నం, సిద్ధవరం, కర్లపూడిలో దాదాపు 6 వేల హెక్టార్ల ప్రభుత్వ భూముల్లో సిలికా ఖనిజం నిక్షిప్తమై ఉంది. చిల్లకూరు, కోట మండలాల్లో 69 సిలికా గనులకు సంబంధించి 976.824 హెక్టార్లలో లీజుల రూపేణా తవ్వకాలకు అనుమతులున్నాయి. ఒక్కో హెక్టార్‌లో 62.56 వేల టన్నుల ఖనిజాన్ని వెలికితీసే అవకాశాలున్నాయి. నిబంధనల ప్రకారం 2.50 మీటర్ల లోతు వరకే ఖనిజాన్ని తవ్వి తరలించాల్సి ఉంది. యంత్రాలను వినియోగించాలంటే డీడీఎంఎస్ నుంచి అనుమతి



తప్పనిసరి. ఇది ఎక్కడా మచ్చుకైనా కనిపించదు.

**తరలింపు ఎక్కడెక్కడంటే..**

సొనకాలువలు, ప్రభుత్వ, డీకేటీ పట్టా భూములు, శ్మశానాలు ఇలా వేటినీ వదల్లేదు. స్థానికులను మభ్యపెట్టి సర్కారు భూములను తొలిచేశారు. చిల్లకూరు మండలంలోని బల్లవోలు, వేళ్లపాలెం, తూర్పుకనుపూరు, అద్దేపల్లి, మోమిడి, తమ్మినపట్నం, కోట మండలంలోని కర్లపూడి, సిద్ధవరం గ్రామాల్లో వందలాది ఎకరాల ప్రభుత్వ భూముల్లో తవ్వకాలు జరిగాయి.

**సర్వే చేయించిన కూటమి ప్రభుత్వం**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అక్రమాలపై గనులు, రెవెన్యూ శాఖల ఆధ్వర్యంలో సర్వే చేయించింది. దాదాపు 19 లక్షల టన్నుల ఖనిజాన్ని పక్కదారి పట్టించినట్లు అధికారులు లెక్క తేల్చారు. లీజుదారులకు టన్నుకు రూ.100, రాయల్టీ రూ.350 మాత్రమే చెల్లించారు. కొల్లగొట్టిన ఖనిజాన్ని మాత్రం బహిరంగ మార్కెట్‌లో రూ.1400కు విక్రయించారు. ఈ లెక్కన రూ.266 కోట్ల సొమ్ము అక్రమార్కులు బొక్కసం నింపుకొన్నట్లు తెలుస్తోంది.

**నిబంధనలు అమలు చేస్తాం**

ప్రస్తుతానికి సిలికా గనుల్లో కార్యకలాపాలు జరగడం లేదు. ప్రభుత్వ నిబంధనలు కచ్చితంగా అమలు చేస్తాం. అక్రమ తవ్వకాలపై కఠినంగా వ్యవహరిస్తాం. శ్రీనివాసరావు, ఏడీఎంజీ, గూడూరు

# గ్రామకంఠంలో అక్రమంగా మినీగోకులం నిర్మాణం

చిత్తూరు : చిత్తూరు మండలం దిగువమాసాపల్లె పంచాయతీ ఎగువమాసాపల్లెలో ఓ కూటమి పార్టీ నాయకుడు సర్వే నంబరు 184లో 2.68 సెంట్ల గ్రామకంఠ స్థలాన్ని ఆక్రమించి, మినీ గోకులం నిర్మాణం చేపట్టాడు. స్థానికులు, అధికారులు ప్రశ్నించగా.. తననేమీ చేయలేరని బెదిరింపులకు దిగాడు. ఇటీవల కొంత మంది స్థానికులు స్పందన కార్యక్రమంలో కలెక్టరు దృష్టికి తీసుకెళ్లారు. స్పందించిన కలెక్టరు ఆ స్థలం ఆక్రమణపై చర్యలు తీసుకోవాలని మండల రెవెన్యూ అధికారుల్ని ఆదేశించారు. ఈ మేరకు తహసీల్దార్ లోకేశ్వరి, రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లారు. రికార్డులు పరిశీలించి ఆ భూమి గ్రామ కంఠానికి చెందినదని స్పష్టం చేశారు. ఆక్రమణదారుడైన ఆ నేత.. మహిళా అధికారితో వాగ్వాదానికి దిగగా.. ఆమె పోలీసులకు ఫిర్యాదు చేస్తానని చెప్పడంతో వెనక్కి తగ్గాడు. ఇంత జరిగినా ఆ స్థలం తనదేనని, తనకు రాజకీయ పలుకుబడి ఉందని బెదిరించాడు. ఈ భూమిని పరక్షించాల్సిన బాధ్యత పంచాయతీ అధికారులదేనని ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లి, భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ఆదేశించారు.

**అనుమతి లేదు..**ఎగువమాసాపల్లెలో గ్రామకంఠం భూమి ఆక్రమణపై ఫిర్యాదు అందింది. దీన్ని రెవెన్యూ అధికారులు గ్రామకంఠంగా నిర్ధరించారు. ఆ స్థలంలో మినీ గోకులం నిర్మాణానికి అనుమతి లేదు. బిల్లులు చెల్లించబోం. రెవెన్యూ అధికారుల నివేదికను ఉన్నతాధికారులకు పంపి ఆక్రమణకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకుంటాం. శ్రీనివాసన్, ఎంపీడీవో, చిత్తూరు

# ఆయుష్ పోశారు

కర్నూలు : ఆయుష్ విభాగానికి ఎట్టకేలకు మంచి రోజులు వచ్చాయి. గత వైకాపా ప్రభుత్వ హయాంలో ఈ విభాగం పూర్తిగా నిరాదరణకు గురైంది. వైద్యుల నియామకంలోనూ నిర్లక్ష్యం చేసింది. అవసరమైన మందులు సరఫరా చేయలేదు. నిధులు విడుదల చేయలేదు. ఫలితంగా ఆయుష్ విభాగం నిర్వీర్యమైంది. చాలా ప్రాంతాల్లో ఆస్పత్రులు మూతపడ్డాయి. చివరికి బాధితులు ప్రైవేటు వైద్యాలయాలను ఆశ్రయించాల్సి వచ్చింది. ప్రస్తుతం ఆయా ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న వైద్యుల పోస్టులను భర్తీ చేయడంతో ఇప్పటివరకు మూతపడిన ఆస్పత్రులు తెరుచుకోనున్నాయి. రానున్న రోజుల్లో ఉమ్మడి జిల్లాలో ఖాళీగా ఉన్న పోస్టులకు త్వరలో కౌన్సెలింగ్ జరగనుంది. వైద్యులను నియమించడం ద్వారా రోగులకు మెరుగైన సేవలు అందనున్నాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆయుష్ విభాగం ఆధ్వర్యంలో హోమియోపతి ఆస్పత్రులు 12, ఆయుర్వేదిక్ 21, యునాని వైద్యశాలలు 13 వరకు ఉన్నాయి. యునాని మినహా మిగిలిన వైద్యాలయాల్లో ఏళ్ల తరబడి వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ నేపథ్యంలో సమస్యను గుర్తించిన కూటమి ప్రభుత్వం పోస్టుల భర్తీకి చర్యలు చేపట్టింది.

**ఎక్కడెక్కడంటే..**

ఉమ్మడి కర్నూలు జిల్లాలో ఆయుర్వేదిక్ విభాగంలో కర్నూలు జిల్లాలో 8, నంద్యాల జిల్లాలో 13 పోస్టులు ఉన్నాయి. వీటిల్లో ఇప్పటికే 9 మంది వైద్యులు పనిచేస్తున్నారు. ప్రస్తుతం శ్రీశైలం, వెలుగోడు, తుగ్గలి, రామదుర్గం ప్రాంతాల్లో వైద్యుల పోస్టులను భర్తీ చేశారు. ఇంకనూ హాలహర్వి, పెద్దహరివాణం, కౌతాళం, కర్నూలు, అహోబిలం, ఆలమూరు, ఆకుమళ్ల, గుండ్ల శింగవరం ప్రాంతాల్లో పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో హోమియోపతి ఆస్పత్రులు 12 ఉన్నాయి. ఇందులో ఏడుగురు వైద్యులు ఉన్నారు. ప్రస్తుతం కర్నూలు, చనుగొండ్ల, డి.బెళగల్ పోస్టులను భర్తీ చేశారు. ఇంకనూ ఆత్మకూరు, కృష్ణగిరిలో పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

చురకలు



## బ్లాక్ సూట్‌లో సూపర్ స్టైలిష్ గా ఎన్టీఆర్

టాలీవుడ్ స్టార్ హీరోల్లో ఎన్టీఆర్ ఒకడు. మ్యాన్ ఆఫ్ మాసెస్ గా ఎన్టీఆర్ మంచి క్రేజ్ తెచ్చుకున్నాడు. ఆర్ఆర్ఆర్ తో తన క్రేజ్ ను ప్రపంచ వ్యాప్తంగా పెంచుకున్న ఎన్టీఆర్, గతేడాది దేవర సినిమాతో సాలిడ్ హిట్ అందుకున్నాడు. ప్రస్తుతం వార్2 సినిమా షూటింగ్ లో బిజీగా ఉన్న ఎన్టీఆర్ త్వరలోనే ఆ సినిమా షూటింగ్ ను పూర్తి చేయనున్నాడు. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ రీసెంట్ గా దుబాయ్ లోని ఓ ప్రముఖ నిర్మాత కొడుకు పెళ్లికి హాజరైన విషయం తెలిసిందే. ఈ పెళ్లిలో ఎన్టీఆర్ హైలైట్ అయ్యాడు. ఆ వేడుకలో నుంచి తారక్ కు సంబంధించిన కొన్ని ఫోటోలు బయటికొచ్చాయి.

అందులో ఎన్టీఆర్ బ్లాక్ సూట్ ధరించి గాగుల్స్ పెట్టుకుని చాలా స్టైలిష్ గా కనిపిస్తున్నాడు. అంతేకాదు, ఎన్టీఆర్ మునుపటి



కంటే ఈ ఫోటోల్లో మరింత స్లిమ్ గా కనిపిస్తున్నాడు. తమ ఫేవరెట్ హీరోను ఇలా చూసిన తారక్ అభిమానులు ఎన్టీఆర్ లుక్ అదిరిపోయిందని కామెంట్ చేస్తూ ఆ ఫోటోలను వైరల్ చేసే పనిలో బిజీగా ఉన్నారు. ఇక సినిమాల విషయానికొస్తే, రీసెంట్ గానే ఎన్టీఆర్ ప్రశాంత నీల్ తో సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లాడు.

ఓ భారీ యాక్షన్ సీక్వెన్ ను నీల్ తెరకెక్కిస్తున్నాడు. మార్చిలో మొదలుకానున్న నెక్ట్స్ షెడ్యూల్ నుంచి ఎన్టీఆర్ ఈ షూట్ లో జాయిన్ కానున్నాడు. ఎన్టీఆర్ స్లిమ్ గా తయారైంది నీల్ సినిమా కోసమే అని కొందరంటున్నారు. నీల్ సినిమాతో పాటూ ఎన్టీఆర్ కొరటాల దర్శకత్వంలో దేవర2ను కూడా పూర్తి చేయాల్సి ఉంది.

## సూపర్‌స్టార్‌ని చెంప దెబ్బ కొట్టిన నటి

ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ప్రీతి జింటా తన కోస్టార్ షారూఖ్ ని చెంప దెబ్బ కొట్టానని తెలిపారు. అయితే అది సరదా కోసం కాదు.. సన్నివేశం కోసం.. నేను అతడిని కొట్టలేదు. నా పాత్ర చెంప దెబ్బ కొట్టింది! అని తెలివిగా సమాధానం ఇచ్చింది ప్రీతి జింతా. ఇది ఏ సినిమాలోనిది? చెంప దెబ్బ దేని కోసం? అంటే వివరంలోకి వెళ్లాలి. ప్రీతి జింటా ఇటీవల తన ఎక్స్ ఖాతాలో అభిమానులతో మాట్లాడుతూ %-%కభీ అల్విదా నా కెహ్నా%-% (2006) చిత్రీకరణ సమయంలో షారూఖ్ చెంప దెబ్బ ఎపిసోడ్‌ని గుర్తు చేసుకుంది. ముఖ్యంగా షారుఖ్ ఖాన్‌ను చెంపదెబ్బ కొట్టాల్సిన సన్నివేశంలో తాను అతడిని కొట్టేందుకు సందేహించానని, అయితే షారూఖ్ తనకు తానుగానే సహజత్వం కోసం, సీన్ పండటం కోసం చెంప దెబ్బ కొట్టమని కోరాడని ప్రీతి వెల్లడించింది. ఆ సన్నివేశానికి ప్రామాణికత అవసరం.. ఇంపాక్ట్ పెంచడానికి ఖాన్ ఆ చెంపదెబ్బ నిజంగా పడాలని పట్టుబట్టారు. నేను వెంటనే SRKని చెంపదెబ్బ కొట్టాను. నిజానికి నేను అలా కొట్టాలనుకోలేదు. కానీ షారూఖ్ దానిని నిజం చేయాలని



కోరాడు. అలాంటి అనుభవం అందమైనది కాదు! అని తెలిపింది. ఒక ఔత్సాహిక అభిమాని షారుఖ్ ఖాన్‌ను చెంపదెబ్బ కొడితే ఆనందించాడా? అని అడిగాడు. దీనికి ప్రతిస్పందనగాలేదు! ఇది సరదా కోసం కాదు... అంతేకాకుండా, నేను అతడిని కావాలని ఎప్పుడూ చెంపదెబ్బ కొట్టను... రియా సరన్ అతడిని చెంపదెబ్బ కొట్టింది అని తెలిపింది. రియా సరన్ ఈ చిత్రంలో ప్రీతి జింటా పోషించిన పాత్ర. 2006లో విడుదలైన కభీ అల్విద నా కెహ్నా ప్రేమ, అపనమ్మకం, సంబంధాల నేపథ్యంలో ఎమోషనల్ డ్రామా. కాపురంలో కలతలు ఎదుర్కొనే యువతిగా ప్రీతి జింతా నటించగా, ఆమె భర్తగా షారూఖ్ నటించారు. ఈ చిత్రానికి కరణ్ జోహార్ దర్శకత్వం వహించారు. ప్రీతిజింతా- షారూఖ్‌లతో పాటు రాణి ముఖర్జీ, అభిషేక్ బచ్చన్, అమితాబ్ బచ్చన్, కిరణ్ ఖేర్ తదితరులు నటించారు. రిలేషన్‌షిప్‌లో ఇబ్బందులు ఎదుర్కొనే పెళ్లయిన జంటగా షారూఖ్ - ప్రీతి జింటా అద్భుతంగా నటించారు.




## ఆఫ్ సీజన్ లో వస్తున్న మజాకా గట్టెక్కుతుందా?



ఏ సినిమాకైనా రిలీజ్ డేట్ అనేది చాలా ముఖ్యం. మంచి రిలీజ్ డేట్ ను బట్టే సినిమా కలెక్షన్లు ఆధారపడుతున్న నేపథ్యంలో మజాకాకు సోలో రిలీజ్ డేట్ అయితే దొరికింది. కానీ ఫిబ్రవరి మధ్య నుంచి ఏప్రిల్ మధ్య వచ్చే సినిమాలకు సరైన ఆదరణ దక్కదు. ఈ మధ్య కాలాన్ని ఇండస్ట్రీకి చెందిన వారంతా డ్రై సీజన్ గా భావిస్తుంటారు. ఇలాంటి టైమ్ లో సందీప్ కిషన్ హీరోగా నటిస్తున్న మజాకా మూవీ రిలీజవుతుంది.

ఫిబ్రవరి 26న శివరాత్రి సందర్భంగా మజాకా ప్రేక్షకుల ముందుకు రానుంది. డ్రై సీజన్ లో వస్తున్న సినిమా కావడంతో ఆడియన్స్ పెద్దగా థియేటర్ల వైపు చూడరు. వీటన్నింటినీ అధిగమించి మజాకా వర్కవుట్ అవాలంటే సినిమాలో కంటెంట్ చాలా ఎంగేజింగ్‌గా ఉండాలి. ట్రైలర్ అయితే కామెడీతో ఎంటర్టైనింగ్ గా బాగానే ఉంది కానీ డ్రామా మాత్రం రెగ్యులర్ గానే ఉంది. ఇలాంటి కంటెంట్ తో సినిమా నెట్టుకురావాలంటే కచ్చితంగా మౌత్ టాక్ బాగా రావాల్సిన పరిస్థితి ఉంది. సినిమాలో కంటెంట్ స్ట్రాంగ్ గా లేకపోతే ఈ సీజన్ లో ఆడియన్స్ థియేటర్లకు రావడం చాలా కష్టం. ఇదే సీజన్ లో రిలీజైన తండేల్ మంచి కంటెంట్ తో రిలీజైంది కాబట్టే సూపర్ హిట్ గా నిలిచింది. ఏదేమైనా మజాకా సినిమాకు రిలీజ్ టైమ్ మాత్రం చాలా పెద్ద పరీక్షగా మారింది. అయినప్పటికీ చిత్ర యూనిట్ మాత్రం సినిమాపై ఎంతో నమ్మకంగా ఉన్నారు.

మజాకా ప్రతి ఒక్కరినీ ఎంటర్టైన్ చేస్తుందని, ఆడియన్స్ ను కడుపుబ్బా నవ్విస్తుందని మేకర్స్ ధీమాగా ఉన్నారు. ఈ నేపథ్యంలో చిత్ర యూనిట్ సినిమాను తెగ ప్రమోట్ చేస్తుంది. రావు రమేష్, రీతూ వర్మ, అన్షు ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ సినిమా ఫుల్ లెంగ్త్ కామెడీ ఎంటర్టైనర్ గా రానుంది. ప్రసన్న కుమార్ బెజవాడ్ కథ అందించిన ఈ సినిమాకు త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించాడు.

## సంక్రాంతికి వస్తున్నాం.. ఇక్కడ వెంకీ.. అక్కడ ఆయన?



ఈ సంక్రాంతికి మంచి అంచనాల మధ్య విడుదలై, ఆ అంచనాలను మించిపోయి ఎక్కడికో వెళ్లిపోయింది 'సంక్రాంతికి వస్తున్నాం' చిత్రం. ఆ సినిమా పెద్ద సక్సెస్ అవుతుందని అనుకున్నారు కానీ.. మరీ 300 కోట్ల సినిమా అవుతుందని మాత్రం ఎవ్వరూ ఊహించలేదు. సంక్రాంతికి పర్ఫెక్ట్‌గా సెట్ అయ్యే ఫ్యామిలీ మూవీ కావడంతో కుటుంబ ప్రేక్షకులు ఈ సినిమాకు పోటెత్తారు. టికెట్ల ధరలు కూడా అందుబాటులో ఉండడం కలిసొచ్చింది. 'గేమ్ చేంజర్'తో దెబ్బ తిన్న దిల్ రాజు.. ఈ చిత్రంతో లాభాల పంట పండించుకుని సేఫ్ అయ్యాడు. ఐతే ఆయన సంబరం అంతటితో ముగియలేదు. 'సంక్రాంతికి వస్తున్నాం'ను హిందీలో రీమేక్ చేసి అక్కడా డబ్బులు సంపాదించడానికి ఆయన రెడీ అవుతున్నట్లు సమాచారం. ఇందుకు చర్చలు కూడా జరుగుతున్నాయట. బాలీవుడ్ టాప్ స్టార్లలో ఒకడైన అక్షయ్ కుమార్ ప్రధాన పాత్రలో 'సంక్రాంతికి వస్తున్నాం'ను రీమేక్ చేసేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయట. ఐతే అక్కడ అనిల్ రావిపూడి డైరెక్ట్ చేయడు. ఎవరో బాలీవుడ్ దర్శకుడినే పెట్టుకోవాలని చూస్తున్నారు. అక్షయ్ కొన్నేళ్లుగా సరైన విజయాలు లేక ఇబ్బంది పడ్డారు. ఐతే ఇటీవలే 'స్కై ఫోర్స్' మూవీ సక్సెస్ అయి ఆయనకు కొంత ఉపశమనాన్ని అందించింది. ఐతే ఎక్కువగా సీరియస్ సినిమాలే చేస్తున్న అక్షయ్.. 'సంక్రాంతికి వస్తున్నాం' లాంటి ఫ్యామిలీ ఎంటర్టైనర్‌ను రీమేక్ చేస్తే ఇంకా పెద్ద సక్సెస్ అందుకునే అవకాశముంది. అంతా ఓకే అయితే.. త్వరలోనే రీమేక్ గురించి అధికారిక ప్రకటన రావచ్చు. ఐతే గతంలో హిట్, జెర్సీ సినిమాల హిందీ రీమేక్‌లతో దిల్ రాజు చేతులు కాల్చుకున్నారు. తనకు కలిసి రాని చోట ఆయన చేస్తున్న మూడో ప్రయత్నంలో అయినా కోరుకున్న సక్సెస్ అందుకుంటారేమో చూడాలి మరి.

## అంజలి న్యూ లుక్: గ్లామరస్ కిల్లర్

టాలీవుడ్ అందాల తార అంజలి మరోసారి తన గ్లామర్ లుక్ తో నెట్టింట హీటెక్కించింది. సినిమాల్లో సహజమైన నటనతో ప్రేక్షకులను ఆకట్టుకున్న ఈ తెలుగమ్మాయి, తాజాగా తన స్టన్నింగ్ ఫోటోషూట్ తో ఫ్యాషన్ ప్రపంచాన్ని షేక్ చేస్తోంది. బ్లాక్ అవుట్‌ఫిట్‌లో అంజలి చూపించిన గ్లామరస్ లుక్ అభిమానుల హృదయాలను దోచుకుంటోంది. ఈ లేటెస్ట్ ఫోటోషూట్‌లో అంజలి నీలిరంగపు డిజైనర్ బ్రా అలాగే డీప్ స్లిట్ గల డ్రెస్‌లో కనిపిస్తూ తన అందాన్ని మరింత హైలైట్ చేసింది. స్టైలిష్ వేర్‌లో కనిపించిన ఆమె, మాస్ క్లాస్ ప్రేక్షకులను ఒకేసారి ఆకర్షించగలిగే విధంగా తన హావభావాలను ప్రదర్శించింది. ఆమె కళ్ళలో కనిపించే భావాలు, సింపుల్ మెకప్



కర్లీ హెయిర్ స్టైల్ ఆమె లుక్‌కు మరింత గ్లామర్‌ని జోడించాయి. ఈ ఫోటోలకు "క్యాచ్ ది వైబ్" అంటూ క్యాప్షన్ ఇచ్చిన అంజలి, సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ప్రముఖ స్టైలిస్ట్ మనోగ్న గోల్లపూడి ఈ లుక్‌కు స్టైలింగ్ చేయగా, ఆహిలా ఖాన్ డిజైన్ చేసిన అవుట్‌ఫిట్‌లో ఆమె మరింత అందంగా కనిపించింది. జ్యువెల్స్ ఎంపిక, లైట్ మేకప్ ఆమెను ఒక అందమైన డివా లా మార్చేశాయి. అంజలి నటనా పరంగా సినిమాలు తగ్గించినా, సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు తన అందం, స్టైల్ తో ఫ్యాన్స్‌ను కనువిందు చేస్తోంది. ఇటీవల 'గేమ్ చేంజర్' సినిమాతో ఫ్యాన్స్‌ను అలరించిన ఆమె, వెబ్ సిరీస్‌లలోనూ తళుక్కు మంటోంది. ఈ తాజా ఫోటోషూట్, ఆమెను మరోసారి ట్రెండింగ్‌లోకి తెచ్చింది. ఈ లుక్స్‌తో అంజలి, ఫ్యాషన్ ప్రపంచంలో తనదైన ముద్ర వేయడమే కాదు, ఆమెకు ఇంకా ఎన్నో బిగ్ ఆఫర్లు వచ్చేలా చేస్తోంది. మరి, ఈ గ్లామర్ డోస్ తర్వాత అంజలి బిగ్ స్క్రీన్‌పై మళ్లీ స్టన్నింగ్ ఎంట్రీ ఇస్తుందా? అనేది ఆసక్తిగా మారింది.

## హాఫ్ షోల్డర్ గౌనులో రాశీ కిరాక్

ఇటీవల తెలుగు ఫిలింసర్కిల్స్ లో రాశీఖన్నా సందడి కొంత తక్కువగానే ఉంది. ప్రస్తుతం ఈ భామ ముంబై పరిశ్రమలో సినిమాలు, వెబ్ సిరీస్ లలో అవకాశాలు అందుకుంటోంది. తెలుగులో సిద్ధు జొన్నలగడ్డతో కలిసి %-%తెలుసు కదా%-% చిత్రంలో నటించనుంది. అభిమానులు ఈ చిత్రం కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. మరోవైపు రాశీ తన అభిమానులను నిరంతరం సోషల్ మీడియాల ద్వారా పలకరిస్తూనే ఉన్నారు. రాశీ వరుస ఫోటోషూట్లను షేర్ చేస్తూ ఫ్యాన్స్ ని ఇన్‌స్టాలో యంగేజ్ చేస్తున్నారు. తాజాగా ఈ దిల్లీ బ్యూటీ షేర్ చేసిన ఓ ఫోటోగ్రాఫ్ అంతర్జాలంలో వైరల్ గా మారుతోంది. రాశీ అందమైన ఆఫ్ షోల్డర్ డిజైనర్ ఫ్రాక్ ని ధరించింది. ఇది థై స్లిట్ ఎలివేషన్‌కి సహకరించే ఫ్రాక్. రాశీ ఈ



బ్లాక్ డ్రెస్ లో ఎంతో స్టన్నింగ్ గా కనిపిస్తోంది. సింపుల్ గా మేకప్ లెస్ లుక్ లో కనిపించిన రాశీ చిరునవ్వుతో ఫోటోషూట్ కి ఫోజులిచ్చింది. రాశీ బ్లాక్ గౌన్ తన అందాన్ని పదింతలు పెంచిందని చెప్పాలి. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోగ్రాఫ్ యువతరంలో వైరల్ గా మారుతోంది. ఇటీవలే స్టార్ బోయ్ సిద్ధు జొన్నలగడ్డతో తెలుసు కదా? పోస్టర్లు విడుదలయ్యాయి. సిద్ధూతో రాశీ కెమిస్ట్రీ ఓ రేంజులో వర్కవుటైందని ప్రశంసలు కురుస్తున్నాయి. పోస్టర్ లో లవ్ ఇంటిమేట్ లుక్స్ యూత్ ని టీజ్ చేసాయి. రాశీ కొంత గ్యాప్ తర్వాత మరో యువహీరోతో ఘనంగా తన కంబ్యాక్ ని చాటుకునే పనిలో ఉంది. వ్వాట్ విల్ హ్యాపెన్స్ వెయిట్ అండ్ సీ.

PRINTED, PUBLISHED AND OWNED BY MOHAMMED IMRAN, PRINTED AT RIMSHA PRINTERS & WEB OFFSET PRINTING PRESS, Alugunur (V), Timmapur(M),DIST. KARIMNAGAR. TELANGANA.
PUBLISHED FROM H.NO. 10-2-324/B, VIDHYANAGAR, KARIMNAGAR - 505001. EDITOR : MOHAMMED IMRAN, RNI. NO. TELTEL/2006/16536